నవశక్తి

Vol. 2, no. 14

(Mar. 22, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 14

(Mar. 22, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

భారత జాతీయ ఆశయం

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 22–3–39 బెజవాడ {సంచిక 14

మీరట్ కమ్యూనిస్టు కుట్రకేసు ఖైదీలు



కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలని దేశమందంతటా మార్చి 20 వ తేదీన సభలు జరిగాయి.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
విడి ప్రతి	0—1—6

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అం॥ లోపల ప్రతి అంగుళానికి	రూ.	0—6—0
20" అం॥ పైన	..	0—4—0
100" అం॥ పైన	..	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్‌లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

	మార్చి నెల కోటా	రెండు వారాలలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	2
తూ. గోదావరి	30	2
ప. గోదావరి	50	12
కృష్ణా జిల్లా	50	21
గుంటూరు	30	5
నెల్లూరు	20	6
రాయలసీమ	10	1
నైజాం	10	5
ఇతర స్థలాలు	5	1
	210	55

విదేశాలలో మా ఏజెంట్లు

జి. కాళిదాసు. 209 ఫేయర్ స్ట్రీట్
రంగూన్.

పర్కిన్సు బుక్ షాప్. 14 కింగ్సు స్ట్రీట్.
లండన్. W. C. 2.

లీగ్ ఆఫ్ ఇండియాస్ ఫ్రీడం. 112 ఈస్ట్ 19 వ స్ట్రీట్.
న్యూయార్కు సిటీ.

సంపుటం 2 బుధవారం

సంచిక 14 22-3-39

నవశక్తి

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

త్రిపురీలో స్వాతంత్ర పోరాటానికి పిలుపు.

త్రిపురీ కాంగ్రెసు తీర్మానాలన్నిటిలో పర్యాలోకించిన ముఖ్యమైనది జాతీయ వాంఛా తీర్మానము. ఈ కాంగ్రెసులోని గడబిడలన్నీ మరచి వీక్షించిన, యీ తీర్మానంలో హరిపురా ఫెడరేషన్ వ్యతిరేక తీర్మానం కంటే గమనింపదగిన అభివృద్ధి కాన్పించును. హరిపురా తీర్మానం ఫెడరేషను అంగీంరింపరాదని, స్పష్టపరచింది. "ఈ ఫెడరేషనును బలవంతముగా అమలులోపెట్టు ప్రయత్నములను సకల విధముల నిరోధింపవలెను" అని సంతృప్తి పడింది. అంటే హరిపురా తీర్మానంలో, వేచి కూర్చుందాం. సామ్రాజ్యవాదులు బలవంతాన ప్రవేశపెట్టితే పోరాడుదాం అను భావం ప్రధానంగా వుంది.

త్రిపురీ తీర్మానం ఇంకొక అడుగు ముందుకుపోయింది. కాంగ్రెస్ ఆదర్శము స్వతంత్రమైన ప్రజా ప్రతినిధి ప్రభుత్వమనియు. భారత రాజ్యాంగాన్ని యుక్త వయస్కులగు ప్రజలందరిచే ఎన్నుకోబడిన ప్రజా పరిషత్తు నిర్ణయించాలనీ స్పష్టపరచింది. అంతేగాక "ప్రస్తుత జాతీయ అంతర్జాతీయ పరిస్థితులలో పొడ చూపుతున్న ప్రతిష్టంభనమునకు సిద్ద పడటానికి, కాంగ్రెసు ఆశయాన్ని త్వరగా సాధించడానికి, దేశమంతటా జాతీయ పోరాటాన్ని నడిపే సన్నాహాలు చేయుటకు కాంగ్రెసు సంస్థలను, కాంగ్రెసు రాష్ట్రప్రభుత్వాలను పనిచేయవలసిందని" కాంగ్రెస్ మహాసభ కోరింది. "ఐక్యత నెలకొల్పి, చీలికలకు కారణమైన వైషమ్యాలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వాల పనిని శాసనసభల బయటి పనితో సమన్వయింపజేసి, ప్రజా సంకల్పం నెరవేర్చగల బలవత్తర సంస్థగా కాంగ్రెసును చెయ్యాలనీ" తీర్మానించింది.

ఇది గమనింపదగిన అభివృద్ధియే. కాని తీర్మానం జరుపవలసినకార్యక్రమాన్ని స్పష్టపరచి యుండలేదు. కామ్రేడ్ మెహరల్లీ సూచించిన సవరణ పూర్తిగా అంగీకరించిన యీ లోపం తొలగ యుండేది. సవరణలో "కర్షకుల స్థితి బాగుచేయడానికి, పౌరసత్వ హక్కుల నెలకొల్పడానికి, సాంఘిక చట్టాలు చేయడానికి, జాతీయ ఉద్యమంతోపాటు సంస్థాన ప్రజలపోరాటం అభివృద్ధి చేయడానికి, సుశిక్షితులయిన వలంటీర్ల సైన్యాన్ని తయారుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలి" అని వుంది. సవరణలో ముఖ్యమైన ఈ ఆచరణ భాగాన్ని వదలివేయుటచే తీర్మానం స్పష్టమైన కార్యక్రమం యివ్వలేక పోయింది. ఈ భాగం లోపించుటచే మితవాదుల చేతులలో వున్న రాష్ట్ర కాంగ్రెసు సంఘాలు అమలు జరుపకపోవచ్చును.

ఈతీర్మానానికికూడ వింతఅర్థాలు తీయడానికి అవకాశం లేకపోలేదు. గాంధీజీ అయినా కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని పాసుచేసిన తరువాతనే రాజప్రతినిధితో జరుపు రాయబారాలలో స్వాతంత్ర్య సారాన్ని కలిగివున్న డొమినియన్ ప్రతిపత్తికిదారితీయు బాధ్యతాయుత ప్రభుత్వం (Responsible Governament leading to Dominion Status which is the substance of Independence) అంగీకరించునటుల తెలిపాడు. అలాగే ఇప్పుడూ ప్రజా ప్రతినిధి ప్రభుత్వం (Democratic state) బ్రిటీషు ప్రజా స్వామికంలో భాగమనియు, హరిజన్‌లో వ్రాసినటుల యుక్త వయస్కులందరుకు ఓటింగు హక్కు, అనుభవంలో మనకు పనికిరాదనియు. పూర్వ పక్షంచేయు అవకాశముంది. అటుల చేయకుండునటుల చూచు బాధ్యత తీవ్ర వాదులపైన వుంది. ప్రజలలో చైతన్యం కల్గించి ప్రజా పోరాటాలను వృద్ధిచేసిన ఇట్టి సంకుచిత అర్థాలు చెప్పి రాజీ పడుటకు అవకాశాలు లేకుండ చేయువచ్చును. పోరాటాన్ని పెంపొందించుటకు తీవ్రవాదులకు యీ తీర్మానం చక్కని అవకాశాలు ఒసగుతూంది. ముందుకు సాగడానికి తీర్మానం చూపిన పంథాను-అస్పష్టంగానే కానిండు-పోరాటాన్ని అభివృద్ధి పరచడానికి వినియోగించాలి తీవ్రవాదులు. అదియే పోరాటాన్ని తీవ్రముగావించు సరియైన అనుసరణీయమైన విధానము.

హరిపురా తీర్మానం ఆధారం పైనే సంయుక్త రాష్ట్రాల కాంగ్రెసు సంఘం క్రిందటి ఏడాది కొన్నివేలమంది వాలంటీర్లకు తరిఫీదు నిచ్చింది. ఇప్పుడైనా ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం త్రిపురీ తీర్మానాన్ని గమనించి, ఆంధ్రదేశమంతటా వాలంటీరు శిబిరాల నేర్పరచి, కనీసం 10 వేల వాలంటీర్లను తయారు చేయు ఏర్పాట్లు గావించుతారని ఆశించుతాము. అటులే రాష్ట్ర ప్రభుత్వాల పనిని, బయటి పనితో సమన్వయింప జేయాలను సూచనను గమనించి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు, చిట్టివలస, చీరాల కార్మిక సమస్యలలో, మునగాల కాళీపట్నం రైతు పోరాటాలలో, ప్రజాభీష్టమును నెరవేర్చునట్లు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతాము,

త్రిపురీ కాంగ్రెసు జాతీయ వాంఛను స్పష్టపరచింది. ఇక దాన్ని సాధించుటకు తగిన కార్యక్రమాన్ని అమలునందుంచుట తీవ్రవాదుల, సోషలిస్టుల కర్తవ్యం. ప్రజా పోరాటం వృద్ధి చేయండి ; ఆశయాన్ని సాధించే కార్యక్రమాన్ని అమలునందుంచి మార్గం చూపండి. తప్పని సరిగా కాంగ్రెసు సంస్థ మీ కార్యక్రమాన్ని అనుసరించవలసి వస్తుంది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సమావేశం సూచించిన అట్టి కార్యక్రమం వేరొకచో ముద్రించబడింది. సోషలిస్టులు ఈ కార్యక్రమాన్ని అమలునందుంచి కాంగ్రెసువాదులందరికి మార్గదర్శకులు కావాలి. సోషలిస్టుల స్థానం స్వాతంత్ర్య పోరాట కదన రంగంలో మొదటి వరుసలో వుండుటే. సోషలిస్టులమే కాంగ్రెసు మహాసభా తీర్మానాల అమలునందుంచుటలో అగ్రగాముల మనీ, పోరాటములో ముందుంటామనీ మన ద్వారా ప్రజలు గుర్తించునటుల చేయాలి,

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలి.

కమ్యూనిస్టుపార్టీపై నిషేధము తొలగించాలి. మార్చి 20 మొదలు 27 వరకు ప్రదర్శనాలు, సభలు జరుపండి !

1. సానిక కాంగ్రెసు, రైతు, కూలీ, విద్యార్థిసంఘాలు యీ వారములో సహకారంతో సభలు, ప్రదర్శనాలు జరపాలి.

2. స్థానిక కాంగ్రెసు నాయకులచేతను, అచ్చటి తదితర ప్రాముఖ్యమైనవారిచేతను కమ్యూనిస్టుపార్టీపై నిషేధము తొలగించుటకు గాను వ్రాతమూలక స్టేటుమెంట్లు గైకొని వాటిని ప్రభుత్వమునకు, పత్రికలకు పంపవలెను. వాటి ప్రతులు "నవశక్తి" ఆఫీసుకు పంపవలెను.

3. కమ్యూనిస్టు పార్టీపై నిషేధమును తొలగించుట పౌరసత్వ హక్కును కాపాడుటనియు కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్యపోరాటమునకు చాల అవసరమనియు తెలియ జేయుటయే.

కిసాన్ సంఘ అధ్యక్షత

27 వ తేదీ అఖిల భారత కిసాన్ సంఘ అధ్యక్షతకు ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ఆచార్య నరేంద్రదేవ్‌ను నిలిపింది. కమ్యూనిస్టులు కూడ అతనిని బలపరిచారు. యు. పి. లోనే భారతదేశంలో మొట్టమొదట సార్వజనిక కిసాన్ ఉద్యమం 1932 లో రాజకీయపోరాటంగా మారింది. నాటినుండి ఆచార్య నరేంద్రదేవ్ యు. పి. కిసాన్‌ఉద్యమంలో ప్రాముఖ్యమైన పాత్రను వహించాడు. క్రిందటి సంవత్సరం పార్లమెంటరీ బోర్డు, మంత్రివర్గం, జమీందార్లతో రాజీ పడి యు. పి. టెనెన్సీ బిల్లును సంకుచితపరచు ప్రయత్నాలు గావించునపుడు నరేంద్రదేవ్ రాష్ట్ర కిసాన్ సంఘ అధ్యక్షుడుగా వుండి బ్రహ్మాండమైన కిసాన్ ప్రదర్శనాలు గావించియు, రాష్ట్ర కాంగ్రెస్ సంఘానిచే రైతుల కోర్కెలు బలపరచునట్లు చేసియు, ఆ ప్రయత్నాలను భగ్నం కావించాడు. తత్ఫలితమే నేడు యు. పి. అసెంబ్లీలో చర్చింపబడుచున్న ప్రస్తుతపరిస్థితులలో సంతృప్తికరమైన టెనెన్సీబిల్లు.

స్వామి సహజానంద సరస్వతి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకొన్నాడు. అందుచే అఖిల భారత కిసాన్ సంఘానికి అధ్యక్షుడుగా రాబోవు సంవత్సరానికి ఆచార్య నరేంద్రదేవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఆంధ్ర రాష్ట్ర రైతు ప్రతినిధులను కోరుతాము. సోషలిస్టులు యిందుకొరకై కృషి చేసి రైతు సేవకు లందరి ఆమోదాన్ని సంపాదింతురని ఆశించుతాము.

(ఈవారము పార్టీ సమావేశములో సంపాదకీయ వర్గమంతయు, నిమగ్నమైయుండుటచే 20 పేజీలే వేయగల్గితిమి. వచ్చే వారమునుండి యథావిధిగ 24 పేజీలతో పత్రిక వెలువడును.)

— మేనేజరు.

మన రాజకీయాలు

రాజకీయ ఖైదీల విడుదల

గాంధీ మహాత్ముని ప్రయత్నాల ఫలితంగా, ఢిల్లీ సెంట్రల్ జైలులో బంధించబడియున్న భవానీసాహూ, వైశంపాయన్, జ్వాలా ప్రసాద్ అనే ముగ్గురు స్టేట్ ఖైదీలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడానికి అంగీకరించింది. మహాత్ముడు వీరితో సంభాషణ జరిపిన తరువాత, దౌర్జన్య పద్ధతుల ప్రకారం పనిచేసే ఏ సంస్థలోనూ వీరు చేరరని ఆయన నమ్మి, ప్రభుత్వానికి కూడా అట్టి హామీ యిచ్చిన మీదట పై నిర్ణయం చేయబడింది. ఫిబ్రవరి ఆఖరు వారంలో వీరు ప్రారంభించిన నిరాహార వ్రతాన్నికూడా గాంధీజీ సమక్షాన చాలించారు.

ఇదే విధంగా మహాత్మునికి ఒక సంవత్సరం క్రితం స్వయంగా హామీ యిచ్చిన పృధ్వీసింగునుకూడా ప్రభుత్వము విడుదల చేసేటట్లు ఒత్తిడి తేవలసిందని కోరుతున్నాం.

బెంగాల్‌లోకూడా, మొట్ట మొదట ప్రభుత్వ ప్రతినిధికీ, గాంధీజీకీ మధ్య జరిగిన సంభాషణలు విఫలమైనప్పటికీ, ప్రజాందోళనకు వెరచి క్రమ క్రమంగా రాజకీయ ఖైదీల నందరినీ విడుదల చేస్తున్నారు. ఇక 150 మంది మాత్రమే బెంగాలు జైలులో ఉన్నారట. ఏ ఒక్క రాజకీయ ఖైదీ జైలులో ఉన్నప్పటికీ ప్రజలు సహించి యుండలేరు. తీవ్రమయిన ఆందోళన కొనసాగించవలెను.

మలబారు పోలీసుల అత్యాచారాలు

మొన్నటి మద్రాసు ఎసంబ్లీ సమావేశములో కొందరు శాసన సభ్యు లడిగిన ప్రశ్నలకు ప్రధాని రాజాజీ జవాబు చెప్పుతూ, యీ విధంగా అన్నాడు:

"డిసెంబరు 1938 లోనూ, 1939 జనవరి—ఫిబ్రవరి మాసాలలోనూ, కొన్ని అనధికార సంఘాలు, సంస్థలు మదరాసు ప్రభుత్వానికి పంపిన విజ్ఞప్తులలో మలబార్ జిల్లా పోలీసుల మీద కొన్ని నిందారోపణలు చేయబడ్డాయి. ఆ ప్రదేశములో ప్రజలు ఆర్థికంగా ఎన్నో అవస్థలు పడుతూ ఉండడం వల్లను, ముఖ్యంగా రైతుల స్థితి బొత్తిగా అసంతృప్తికరంగా ఉండడం వల్లనూ, ప్రజా ప్రతినిధులే బాధ్యత గల ప్రభుత్వాధికారంలో ఉన్నందువల్లనూ, పోలీసుల మీద ప్రజలు అనేక నేరారోపణలు చేయడము సహజమే. నేడు అమల్లో వున్న విధానాన్ని బలపరచడం పోలీసుల కర్తవ్యం. కాబట్టి, వారు మార్పును కోరే ఉద్యమాలను అణచివేసేవారుగా కనపడతారు...."

మరొక శాసన సభ్యు డడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, "రెండు పక్షాలయందు కధలు ఎన్నో ఉన్నాయి" అనీ, ప్రజలనుండి వచ్చే ప్రతి విజ్ఞప్తినీ ప్రభుత్వం అంగీకరింపజాలదనీ, రాజాజీ చెప్పాడు.

మలబార్‌లో ప్రజల జీవితం నికృష్టమైనదని రాజాజీ అంగీకరిస్తున్నాడు. కాని, కాంగ్రెసు మంత్రులు అధికారంలో ఉన్నారు కదా అనే చులకన భావంతో, ప్రజలు పోలీసులమీద నిందారోపణలు చేస్తారట. నేటి విధానాన్ని బలపరచడమే పోలీసుల కర్తవ్యమట మన రాజధానిలో కాంగ్రెసు మంత్రులు అధికారానికి వచ్చిన మొట్ట మొదటినుంచీ పోలీసుల అత్యాచారాలను సమర్ధించడంలో రాజాజీ మొనగాడనిపించుకొన్నాడు. మలబార్ జమీందార్ల అక్రమాలను ఎదుర్కోవడానికి కొత్తగా స్థాపించబడిన రాష్ట్ర రైతు సంఘం తీవ్రంగా కొనసాగించిన ఆందోళనా ఫలితంగా పోలీసులు ఎట్టి అమానుష చర్యలకు దిగారో మలబార్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శంకరన్ నంబూద్రిపాద్‌గారు రాజాజీకి ఎన్నో విజ్ఞప్తులు పంపించారు. వాటికి జవాబుగా రైతులు శిస్తులు చెల్లించడం మానివేశారంటూ ఆమధ్య శాసన సభలో రైతులమీదనే రాజాజీ నిందారోపణలు చేశాడు. ఈ రోజున మళ్ళీ ఆ పంధానే అవలంబించి, ప్రజలే పోలీసులమీద అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని సమర్ధిస్తున్నాడు.

ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ పదవి

మొన్న 18 వ తేదీని వాల్తేరులో ఆంధ్రాయూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ పదవికి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీవారిచే నియమించబడిన కోటిరెడ్డిగారు సి. ఆర్. రెడ్డిగారి మీద పోటీ చేసి, 15 వోట్ల తారతమ్యముతో ఓడిపోయినందుకు విచారిస్తున్నాము. అయినప్పటికీ, మొట్టమొదటిసారి రాష్ట్రకాంగ్రెసు కమిటీ ఈ ఎన్నికలలో అభ్యర్ధిని నియమించడము, పోల్ చేయబడిన 85 వోట్లలో ఆయనకు 35 వోట్లు లభించడం, గొప్ప విషయమేనని చెప్పాలి. ఇప్పుడు వైస్‌ఛాన్సెలర్‌గా ఉన్న సి. ఆర్. రెడ్డి గారు యూనివర్సిటీ విద్యార్థుల వాక్సభా స్వాతంత్ర్యాన్ని అరికట్టేరూల్సు సెనేట్‌లో ప్రవేశ పెట్టితే ఇద్దరు సెనేట్ సభ్యులు తప్ప మిగిలిన కాంగ్రెసు వారంతా రెడ్డిగారికే వోట్లిచ్చి నెగ్గించినప్పుడు, ఎట్టి ఉన్నత భావాలతోకూడు కొన్న కాంగ్రెసు సభ్యులు సెనేట్‌లో నేడు సభ్యులుగా ఉన్నారో ఊహించుకొనవచ్చు. కాబట్టి, కాంగ్రెసు టిక్కెట్ మీద నిలబెట్టబడిన కోటిరెడ్డిగారికి వైస్‌ఛాన్సెలర్ పదవి రాకపోయినప్పటికీ, సెనేట్‌లో సభ్యులుగా ఉన్న కాంగ్రెసువాదులకు రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధికారులు ప్రజాతంత్ర సూత్రాల నేర్పవలసిందని కోరుతున్నాము.

కాంగ్రెస్‌కే విజయం

ఇండియా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తూన్న "రక్షణ" విధానాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ తరఫున సత్యమూర్తిచే ప్రతిపాదించబడిన "కట్ ప్రతిపాదన"కు అధిక సంఖ్యాకులు అనుకూలంగా ఓట్లిచ్చారు. 56 వోట్లు అనుకూలంగాను, 43 వోట్లు ప్రతికూలంగాను వచ్చినాయి. గ్రేట్ బ్రిటన్ అవలంబిస్తూన్న "రక్షణ" విధానాన్నే ఇండియా కూడా అవలంబిస్తూన్నదనీ, విదేశాంగ రాజనీతి విషయంలో గ్రేట్ బ్రిటన్ లొంగుబాటు పద్ధతులనే చేబట్టినదనీ, అట్టి రాజనీతికి ఇండియా దూరంగా ఉండవలసి వస్తూన్నదనీ, సత్యమూర్తి ఉపన్యసించాడు. డిఫెన్సు శాఖ ఇండియాను రక్షించడంలో కంటే బ్రిటిషు సామ్రాజ్యాన్ని రక్షించడములో ఎక్కువ శ్రద్ధ కనపరుస్తూన్నదని చెప్పాడు. ఖండన తీర్మానం చాలా స్వల్ప విషయం అనీ, ప్రభుత్వాన్ని మెడకు తాడుగట్టి ఉరితీయవలసిందేననీ, సర్దార్ మంగళ్ సింగ్ గారన్నారు.

నామినేటెడ్ సభ్యులందరూ ప్రభుత్వానికీ, ఎన్నుకోబడిన వారంతా కాంగ్రెస్ తీర్మానానికీ, అనుకూలంగా వోటుచేసి, ప్రభుత్వంయొక్క "డిఫెన్సు" (రక్షణ) విధానం యెడల ప్రజాభిప్రాయం ఎంత ఎక్కువ వ్యతిరేకంగా ఉన్నదో ప్రదర్శించారు. అయినా సర్వాధికారాలు విదేశీ ప్రభుత్వం చేతులోనే ఉన్నప్పుడు ప్రజాభిప్రాయానికి విలువ ఎక్కడిది?

ఒరిస్సా ప్రభుత్వం రాజకీయ ఖైదీలు

ఒరిస్సావంటి కాంగ్రెస్ రాష్ట్రాలలో కూడా నేటికీ రాజకీయ ఖైదీలు విడుదల చేయబడకుండా ఉండడం కాంగ్రెసేతర ప్రభుత్వాలకు ప్రోత్సాహ మిస్తోంది. 1934 ప్రాంతములో విశాఖపట్నం ఏజన్సీలో శ్రీహరిదాస్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేసి తాను స్వయముగా పరిపాలనను స్థాపించడానికి ఏర్పాట్లు చేస్తున్నాడని నేరారోపణలు గావించి, దోపిడీ కేసులు దానికి జత పర్చి మదరాసు ప్రభుత్వం 7 సంవత్సరాలు కఠిన శిక్ష విధించింది. అతని విడుదల విషయమై డా॥ పట్టాభిగారు పూనుకొనవలసిందని రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి చలసాని వాసుదేవరావు గారు వ్రాయగా, పట్టాభిగారు ఒరిస్సా కాంగ్రెసు మంత్రివర్గానికి యీ విషయం తెలియజేసి, శ్రీహరిదాసు విడుదలకై ఉత్తరువు లిప్పించవలసినదని కోరారు. కాని, ఫిబ్రవరి 20 వ తేదీని పట్టాభిగారికి వచ్చిన జవాబుప్రకారము, శ్రీహరిదాసును ఒరిస్సా ప్రభుత్వము విడుదల చేయడానికి అంగీకరించనట్లు తెలుస్తోంది. రాజకీయ ఖైదీల విషయంలో ఒక సంవత్సరం క్రితం బీహార్—యు పి, కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీనామా లిచ్చి బయటకు వచ్చే పరిస్థితులు ఏర్పడితే, దాదాపు రెండు సంవత్సరాల కాంగ్రెసు పరిపాలన అనంతరము ఒరిస్సాలో రాజకీయ ఖైదీలుండడం విచారకరం.

ఫెడరేషనును భగ్నము కావించాలి ★ ★ స్వాతంత్ర్య పోరాటానికి బయలుదేరండి

ఏప్రిల్ 1 ఫెడరేషను ప్రతికూల దినోత్సవం జరుపండి.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు తీర్మానము.

నేషనల్ డిమాండు తీర్మానము ఈవరకు కాంగ్రెసు తీర్మానాలన్నిటికన్న ముందుకు వెళ్ళినది. కాని స్వాతంత్ర్య పోరాటాన్ని పెంపొందించడానికి మనము కోరినంత స్పష్టముగా లేదు. అయినను దేశమందు స్వాతంత్ర్య పోరాటాన్ని పెంపొందింప జేయడానికి సహాయపడుతూ ఉంది. కాన ఈతీర్మానమును ఆచరణలో పెట్టుటకు పార్టీ సభ్యులందరికి ఈక్రింది కార్యక్రమమును సూచించు చున్నది.

I. ఈతీర్మానము ప్రకారము రాజకీయాందోళన సాగించడానికి 4 గురికి మించని పార్టీదళాలు ఏర్పరచవలయును.

ఈదళాలు జిల్లాలలో సాధ్యమైనన్ని ఎక్కువ గ్రామాలలో ఏప్రిల్ ఒకటి నుండి పర్యటనము గావించవలయును.

II. ఈపర్యటనములో

1. (a) నేషనల్ డిమాండును విశదీకరించాలి.
   (b) కార్మిక కర్షక పోరాటాలను అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకతను. వానికోసం, కార్మిక కర్షక సంఘాల అవసరమును తెలియజేయాలి.
   (c) కాంగ్రెసు చరిత్ర, దానిలో చేరవలసిన ఆవశ్యకతను తెలియజేయాలి.
   (d) వాలంటీరు దళాల ఆవశ్యకతను తెలియజేయాలి.
2. గ్రామములోని ముఖ్య పరిస్థితులనుగూర్చి తెలుసుకోవాలి.
3. కాంగ్రెసు సభ్యులను చేర్పించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.
4. కూలీ రైతు సంఘములను ఏర్పరచడానికి తగిన ఏర్పాట్లుచేయాలి.
5. నవశక్తి పత్రికకు చందాదారులను చేర్పించుటకు ప్రయత్నించాలి.
6. అతివాద వాఙ్మయమును ప్రచారము గావించాలి.
7. వాలంటీర్లను రిక్రూటుచేయాలి.
8. వాలంటీరు శిబిరాలకు, ఈ ప్రచారానికి కావలసిన ధనమును సేకరించడానికి ప్రయత్నించాలి.

III. ఈ క్రింది లక్షణములు గలవారిని వాలంటీర్లుగా చేర్చుకోవాలి.

1. వచ్చేపోరాటములో స్థానికంగా నాయకత్వం వహించి, యిచ్చిన సూచనల ననుసరించి పనిచేయుటకు తయారైనవారు ఈ విధంగా పని చేయడం వలన కలుగునష్టములకు భయపడనివారు.,
2. ఇదివరకు కాంగ్రెసులో పనిచేసినవారు.
3. ఎక్కువ రాజకీయ దృక్పధము లేకపోయినను, తిరుగుబాటు స్వభావము (స్పిరిట్) కలిగి ఉత్సాహముతో రాజకీయాలలో కొంతవరకైనా పాల్గొనాలని ఉన్నవారు.

IV. ఈ వాలంటీర్లకు కనీసం ప్రాధమిక రాజకీయ సిద్ధాంత పరిజ్ఞానము కలుగజేయవలయును. దానికొరకు 15 దినాల స్కూల్సు తాలూకావారీగాగాని లేక డివిజనలు వారీగాగాని ఏర్పాటు చేయాలి.

V. ఈ స్కూల్సులో చెప్పవలసిన విషయాలు :—

వాలంటీరు శిబిరాలు : వేసంగి పాఠశాలలు.

1857 నుండి నేటివరకు భారత స్వాతంత్ర్య పోరాటపు విషయాలు మాత్రము తెలియజేయాలి. ఈఘటనలు, దశలకు వెనుకనున్న రాజకీయ వ్యాఖ్యానం గాని, రాజకీయ తత్వం గాని చెప్పనవసరము లేదు. కార్మిక పోరాటాలు, కర్షక పోరాటాలు, ఏవిధంగా స్వాతంత్ర్య పోరాటములో ఒక భాగమో చెప్పాలి. అంటే వానిమూలంగా బ్రిటిషు ప్రభుత్వానికి ఏరీతిగా దెబ్బో చెప్పాలి. అంతర్జాతీయంగా కొన్ని ప్రాధమిక విషయాలు కూడ చెప్పవచ్చును.

భారత స్వాతంత్ర్య పోరాటము గూర్చి తెల్పిన పిదప ప్రస్తుతము కాంగ్రెసు కార్యక్రమము, (కరాచీ, ఫెయిజ్‌పూరు, 1937 ఫిబ్రవరి వార్ధా వర్కింగు కమిటీల కార్యక్రమము, ఈ కార్యక్రమములో ఏయే అంశాలు, ఏయే గ్రామాలలో ఏవిధంగా ఆచరణలో పెట్టడానికి అవకాశముందునో, ఏవిధంగా పెట్టాలో ఒక్కొక్క వ్యక్తికి అతని గ్రామమును తీసుకుచెప్పాలి. ఈవ్యక్తులచేత వారి గ్రామపరిస్థితులను, అందరి సమక్షాన తెలియచేయాలి. ఆపరిస్థితులలో బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెసు కార్యక్రమము ఏవిధంగా ఆచరణలో పెట్టడానికి సాధ్యమగునో, మనము సూచనల నివ్వాలి. ఆసూచనలను అచ్చట సమావేశమయిన వారందరు చర్చించాలి. అంతేగాక, ఆరీతినే మిగిలిన వారి గ్రామాలలో ఏవిధంగా చేయాలని ఉంటుందో వారే ఆలోచించుకొని తమ్మని చెప్పాలి, ఇట్టి సమస్యా పరిష్కారము, వారి ఉత్సాహ (ఇనీషియేటివ్) శక్తిని, ఉపన్యాసశక్తిని కూడ వృద్ధిచేయును.

సిద్ధాంత చర్చలకు ఎక్కువగా దిగకుండ జాగ్రత్తపడాలి. రాబోవు పోరాటములో ఏవిధంగా కాంగ్రెసు కార్యక్రమాన్ని అవలంబించడానికి, అంటే పోరాటాన్ని అవలంబించడానికి వీరు తమ తమ గ్రామాలలో పూనుకోవాలో తెలియజేయాలి. ఈపోరాటాలు ఆరంభమయిన పిదప తదుపరి సమస్యలను వారి సందేహాలను పరిష్కరించడానికి సలహాల నివ్వడానికి పార్టీ నిర్మాణము వారితో సంబంధముంచుకోగల్గియుండాలి.

ఈ సందేహముల నివారించునపుడు వారి రాజకీయ చైతన్యాన్ని, వారి అనుభవముమీదనే పెంపొందించెదము. గాంధివాదము, తదితర వాదాలకు మధ్యగల భేదాలు మొదలగునవి, ఈ పోరాటాల అనుభవమునుండి వారు నేర్చుకొనేటట్లు చేయగల్గుదుము.

కాని, ఆరంభముననే కొంతమందికి ఇట్టి సిద్ధాంత సందేహాలు కలిగినవారు, అంటే అంత రాజకీయ చైతన్యము కలిగినవారు ఉన్నచో వారికి ఈ విషయమై కొద్దిగా చర్చించవచ్చును. కాని వారికికూడ ప్రాధమిక పోరాటాలను నడుపుటకు మనము తయారుచేయు యోధుల సందేహాలనుతీర్చి, కార్యరంగములో పనిచేయించు విధానము, పద్ధతులగూర్చే ప్రధానముగా చెప్పాలి. అంటే వారి రాజకీయ చైతన్యాభివృద్ధిని, ఆచరణలో మిగిలినవారిని కార్యరంగమునకు దింపునట్లు చేయుటకు వుపయోగించాలి.

VI. ఇట్టి తాలూకా శిబిరాలు నడపడానికి కావలసిన వర్కర్లను తయారుచేయడానికి ఈక్రింది జిల్లాలలో ప్రత్యేక వేసంగి పాఠశాలలు నెలకొల్ప బడవలయును.

నెల్లూరు :— మే నెల 16 జూన్ 16 నుండి వరకు చిత్తూరు, కడప నుండి కూడ విద్యార్థులను తీసికొనెదరు. కాని, ఇందు 100 మందికి మించరాదు.

రాయలసీమ :— కర్నూలు, కడప, అనంతపురం, బళ్లారి 100 మందికి మించకూడదు.

విశాఖపట్టణము:—నూరుమందికి మించకూడదు.(ఉభయ గో॥ కృష్ణా, గుంటూరులలో ఇట్టి స్కూల్సు ఏర్పాటు చేయకపోయినను, వాలంటీరు శిబిరాలను, తాలూకా వారీగా ఏర్పరచడానికి తగినంతమంది సభ్యులు తరిఫీదు చెందినవారు యున్నారని ఒకవేళ ఈ జిల్లాలలోకూడ అట్టి స్కూల్సు వారు ఏర్పాటు చేసుకుంటే రాష్ట్రపార్టీకి అభ్యంతరము లేదు. కాని, వారికి ప్రత్యేకంగా రాష్ట్రపార్టీ ఎట్టి సహాయము చేయజాలదు.)

ఈ విద్యార్థులలో ప్రధానంగా ఇచ్చట శిక్షణ పూర్తికాగానే వెంటనే తాలూకాల వారీగా శిబిరాలు ఏర్పరచడానికి, ఆక్టివ్‌గా రాజకీయాలలో పాల్గొనడానికి తయారైన వారిని ఈవరకే రాజకీయాలలో కొంత సంబంధమున్నవారిని మాత్రము తీసుకోవాలి.

ఈ విద్యాలయాలలో, అధ్యయమునకు, నిర్మాణ సమస్యలలోని అధ్యయన తరగతులలోని విషయాలు.

కొంత మిలిటరీ డ్రిల్లు శిక్షణకూడ ఇవ్వబడును. ఈ శిక్షణలో ప్రాధమిక శిక్షణ తాలూకా శిబిరాలలోనివారికి నేర్పుటకు కూడ వీరినందరిని తయారు చేయాలి.

(ఈ వివిధస్కూల్సుకు ఇతర రాష్ట్రాలనుండి ఎట్టి ఉపన్యాసకుడుగాని, ప్రత్యేకముగా రారు. ఎవరైనా వచ్చినచో ఒక స్కూలు నుండి మరియొక స్కూలుకు ప్రయాణము చేయుదురు.)

★

గుంటూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ

వార్షిక సమావేశం

గుంటూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ వార్షిక సమావేశం యీ నెల 29 వ తేదీన గుంటూరుజిల్లాలో జరుగును. పార్టీసభ్యులందరు హాజరుకావలెను. పార్టీ వార్షిక నివేదిక ఫెడరేషన్ ప్రతికూల ప్రచారానికై దళాల యేర్పాటు, వివిధరంగాలలో పార్టీపని, పార్టీ నిర్మాణం మొదలగు విషయాలు సమావేశములో చర్చించబడును. కాన్ఫరెన్సులో పెట్టబడు ముఖ్య తీర్మానములను తయారుచేయుటకుగాను పార్టీ సమావేశమునకు ముందుగా 28 వ తేదీన పార్టీ కార్యనిర్వాహకవర్గము సమావేశమగును.

తెనాలి, 20—3—39.

పి. నరసింహమూర్తి,
కార్యదర్శి,
జి. కాం. సోషలిస్టు పార్టీ.

ప్రపంచ శాంతికి దారితీసే సోవియట్ విదేశ రాజనీతి

శ్రీ నారా శ్రీనివాసరావు

రష్యాలో సోవియట్ ప్రభుత్వం స్థాపించిన నాటినుండి నేటివరకు రష్యావిదేశాంగ వ్యవహారమును పరికించినట్లయిన రష్యావిదేశాంగ నీతి శాంతిపైననే ఆధారపడి యున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1917 వ సంవత్సరం నవంబరు 8 వ తేదీని కామ్రేడ్ లెనిన్ ప్రఖ్యాతిగాంచిన తన (Peace decree) శాంతి డిక్రీని, ప్రపంచయుద్ధంలో హోరాహోరి పోరాడుచు, బెలిజిరెంటు హక్కులను కలిగియున్న దేశాలన్నింటికీ తెలియజేశాడు.

శాంతి డిక్రీలోని ముఖ్యాంశాలు:— "ఈ కార్మిక, కర్షక ప్రభుత్వం యుద్ధంలో పాల్గొన్న సమస్త మానవకోటికి, ఆయా ప్రభుత్వాలకు వెంటనే శాంతిస్థాపనకు రాయబారాలు జరుపవలసినదిగా కోరుతుంది. కాని అశాంతిమార్గాలు మాత్రం బలత్కార విదేశాక్రమణలతో కూడినవిగా వుండకూడదు. అదే సమయాన పైసూచనలు అంతిమ సూచనలుగా భావించవద్దని ఈ ప్రభుత్వం తెలియపరుస్తుంది. యుద్ధంలో పాల్గొన్న మరే యితర దేశమైన శాంతిమార్గాలు సూచించినప్పటికీ, ఆలోచించడానికి సిద్ధంగా వుంది రష్యన్ కార్మిక, కర్షక ప్రభుత్వం. కాని ఈ ప్రభుత్వం గట్టిగా నొక్కి చెప్పే దేమన, ఆయా శాంతిస్థాపన మార్గాలు అస్పష్టంగాను ద్వంద్వార్థాలతోను, కుట్రాలోచనలతోను కూడినవిగా వుండకూడదు."

ఈ శాంతి డిక్రీని ప్రకటించిన నాటినుండి సోవియట్ రష్యా దీన్ని అక్షరాలా అమలులో పెట్టింది. ఆనాటినుండి ఈనాటివరకు రష్యా శాంతివిధానం. సర్వ సమాన హక్కులు, స్వయం నిర్ణయం వీటిపైననే ఆధారపడియుంది జారిస్టు రష్యా సామ్రాజ్య కాంక్షతో 1914 వ సంవత్సరములో టర్కీ పరిష్యా బాల్కను స్టేట్సును కలుపుకుందామనే యుద్దేశ్యంతో సామ్రాజ్యవాదులతోకూడి. యుద్ధంలో పాల్గొన్నది. ప్రపంచ విఖ్యాతి చెందిన 1917 అక్టోబరు విప్లవంతో, జాతీయ నిరోధకవిధానం నాశనమైంది. జాతీయైక్య సామరస్వభావ మేర్పడింది. కాన్‌స్టాంటి నోపుల్ కలుపుకోటానికి, జారిస్టు రష్యా చేసుకొన్న రహస్య సంధులను సోవియట్ రష్యా బయటపెట్టింది. కాన్‌స్టాంటినోపుల్ మహమ్మదీయుల స్వాధీనంలోనే ఉండాలని సోవియట్ రష్యా ప్రకటించింది. టర్కీస్, అమెరికన్, పెరిటటిరి పంపుళ్ళకు సంబంధించిన జారిస్టు రష్యా రహస్య సంధులను బ్రద్దలు గావించింది జారిస్టు రష్యా, అఫ్గనిస్థాన్ మంగోలియా, చైనా దేశాలపై రుద్దిన అసమానత్వ సంధులను రద్దుపరచింది సోవియట్ రష్యా.

ఈ శాంతి డిక్రీని ప్రకటించిన పిమ్మట ఇతర దేశాలెవ్వియును శాంతి రాయబారాలు జరుపనందున తానే స్వయముగా జర్మనీతో సంధి చేసికొన నిశ్చయించింది. ఈ నిశ్చయానికి ముందు, యుద్ధంలో నిమగ్నమైయున్న దేశాలన్నీ ఆర్ మిస్టిస్ సంధిని చేసుకొనవలసినదని తన ప్రత్యేక ప్రకటన ద్వారా తెలియజేసింది. కాని సామ్రాజ్య కాంక్షలో బడి కొట్టుకాడుదేశాలెవ్వియు ఈ శాంతియుత సలహాలను ఎంతమాత్రము కూడా చెవినిబెట్టలేదు. అప్పుడు శాంతినే పరమావధిగా బెట్టుకున్న సోవియట్ రష్యా జర్మనీతో సంధి రాయబారాలు జరుప నారంభించింది. ఈ సంధి మూలంగా ముందు చిక్కులున్నాయని తెలిసినప్పటికీ, శాంతినే ప్రధానంగా పెట్టుకొన్న సోవియట్ రష్యా సామ్రాజ్యవాద యుద్ధంలో అదివరకే ప్రాణాలనర్పించిన అమాయక ప్రజలను ఇకముందయినను అట్టి యుద్ధాల దారి నుండి తప్పించుటకై జర్మనీతో సంధి చేసుకొన నిశ్చయించింది. ఈ సంధి రాయబారాలకు మూల కారకుడును, ప్రపంచ శాంతమూర్తియును, కాటకాలతో తెల్లాడుతూన్న రష్యన్ ప్రజలకు దారి చూపెట్టిన మహానుభావుడును అయిన కామ్రేడ్ లెనిన్‌తో కొంతమంది లెఫ్ట్ కమ్యూనిస్టులు, ఇంపీరియలిస్టు జర్మనీతో సంధి చేసుకోవటం హానికరమని వాదించి, సంధి చేసుకొనుటకు ఒప్పుకొనకుండిరి. అందులో ట్రాట్‌స్కీ ప్రభృతులు, బుఖారిన్ ప్రియో బ్రెజెన్‌స్కీ పియాటకోవ్ మొదలగువారు సంధికి వ్యతిరేక ప్రచారంకూడా సాగించారు. కానీ ఆ పరిస్థితులలో సంధియే ప్రధానంగా నెంచిన కామ్రేడ్స్ లెనిన్ స్టాలిన్‌లు పార్టీలో బలాన్ని సంపాదించి 1918 మార్చిలో జర్మన్ ఇంపీరియలిస్టు కైజరు ప్రభుత్వంతో బ్రెస్ట్‌లిటోవస్కు సంధి చేసుకున్నారు. జర్మనీయుద్ధంలో ఓడిపోయి కైజరు ప్రభుత్వం భరిమివేయబడ్డ తర్వాత అఖిల రష్యా కేంద్ర కార్యవర్గ సంస్థ ఈ సంధిని రద్దుచేసికొని జర్మన్ రిపబ్లికన్ ప్రభుత్వ మంగీకారాన్ని బడసింది. ఈ బ్రెస్ట్ లిటోవస్కు సంధిఫలితంగా సోవియట్‌రష్యా తన ప్రజలను యుద్ధ మారణహోమాల దారి నుండి తప్పించి తన శాంతి దృక్పథమును వెల్లడించింది.

1917 విప్లవానంతరం, సోషలిస్టు రాజ్య స్థాపన తర్వాత, సోవియట్ రష్యాను నిర్మూలం గావించడానికి సామ్రాజ్యవాద దేశాలన్నీ విశ్వప్రయత్నాలు గావించినాయి. 1918—21 వ సం॥ వరకు, రష్యాను ఒక్కుమ్మడిగా 13 దేశాలు చుట్టుముట్టి ఘోరఅవస్థలపాలు చేసునప్పుడుకూడ తన రాజ్యాంగ విధానాన్ని కాపాడుకొని, శాంతిని నెలకొల్ప గలిగింది 1920 సం॥లో సోవియట్ రష్యా బాల్టిక్ స్టేట్సుతోను, పరిష్యాతోను, శాంతి ఒడంబడికలు చేసికొంది. 1921 వ సం॥లో బ్రిటన్‌తో వర్తక సంధిని చేసికొంది. పోలెండు, టర్కీలతో తమస్నేహ సంబంధాలు కాపాడుకోటానికి సంధులు చేసేకొంది 1922 వ సం॥లో జినీవాలో జరిగిన ఆర్థిక మహాసభకు సోవియట్ రష్యా ఆహ్వానింపబడింది. ఆసభలో సోవియట్ రష్యా ప్రతినిధి, సమస్త దేశాలు ఆయుధ విసర్జనాపద్ధతి నవలంబిస్తేనేగాని, శాంతి చేకూరదనియు, ప్రపంచార్థిక విధానమునకు పునాది వేయలేమని యు వాదించెను. కాని సామ్రాజ్యకాంక్షతో ప్రాకులాడే తదితరదేశాలు రష్యా శాంతి సూచనలను మొట్టమొదటగా ఎదిరించినాయి. సోవియట్ రష్యా అనేకములైన తటస్థ విధాన సంధులను (Non aggression Pacts)…….. చేసుకొంది. 1927 వ సం॥లో జర్మనీతోను, లిథూనియాతోను, టర్కీ పరిష్యాలతోను, ఆఫ్గనిస్థాన్‌తోను అట్టి సంధుల జేసికొంది. ప్రపంచ నాగరిక దేశానికి జెందిన బ్రిటిష్ కన్సర్వేటివ్ ప్రభుత్వం 1927 సం॥లో రష్యాకు వ్యతిరేక ప్రచారం సాగించి, రష్యామీదికి కొన్ని దేశాలను పురిగొల్పింది. అప్పటి బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి "ఆస్టెన్ ఛేంబర్లేను రష్యాలోఉన్న పరస్పర సంబంధాలను త్రెంచుకుంటానని బెదిరించాడు. అప్పుడు సోవియట్ రష్యా తన శాంతి కార్యక్రమాన్ని వెలిబుచ్చుచు, అట్టి జడిపింపులకు తావులేదని సమాధానమిచ్చింది. 1927 వ సం॥లో లండన్‌లోని రష్యా వర్తక ప్రతినిధి ఆఫీసుమీదికి లండన్ పోలీసులు దాడివెడలారు. బ్రిటిష్ ప్రముఖులు ఈవిధంగా రష్యాను రెచ్చగొట్టు ప్రయత్నాలుగావిస్తూ, రష్యాను బెదరిస్తున్నారు. రియాక్షనరీ ప్రభుత్వంతో కూడిన చైనా—పెకిన్ షాంఘై, కాంటనులలోని రష్యా రాయబారుల ఆఫీసులమీదికి దాడివెడలింది. 1927 వ సం॥లో సోవియట్‌రష్యా, పోలెండు రాయబారిని "వార్సాలో" రహస్యకూనీ సల్పారు. బ్రిటిష్ ప్రభుత్వం దీన్నిఆధారం చేసికొని రెండుదేశాలను పురికొల్పి తగాదా పెట్టడానికి ప్రయత్నించింది కాని విఫలమైంది. 1929 వ సం॥పు వేసవివరకు చైనా ప్రభుత్వం సోవియట్ రష్యామీద దాడి వెడలుతూనేవుంది. దీనికి సోవియట్ రష్యా రెడ్‌ఆర్మీ తూర్పు చైనాకు తగురీతిని సమాధానంచెప్పి, చైనాను సంధికి రప్పించి, దానితో శాంతి సంధులను చేసికొనితూర్పు ప్రాంతాలలో శాంతిని నెలకొల్పగలిగింది. సోవియట్ రష్యాను రెచ్చగొట్టి యుద్ధానికి పురిగొల్పి శాంతిని భగ్నం చేద్దామనే బ్రిటిష్ రాజ్యతంత్రజ్ఞుల ఆశలు నిరాశలైనవి.

సోవియట్ రష్యా, 1927 వ సం॥లో జినీవాలో జరిగిన ఆయుధవిసర్జన మహాసభలో, ఆయుధవిసర్జన తీర్మానాన్ని ప్రతిపాదించి తన్మూలంగా శాంతిని కాపాడదలచింది. వెంటనే అన్ని దేశాలలోను సంపూర్ణ ఆయుధ విసర్జన చేయబడాలి. ……అని సూచించిన సోవియట్ రష్యా తీర్మానాన్ని తక్కిన సామ్రాజ్యవాద దేశాలు ఎదిరించాయి. అప్పుడు "లిట్వినాఫ్" నిర్ణీత ఆయుధ విసర్జన (Partial disarmament) తీర్మానాన్ని ఉపపాదించాడు. జాతిసమితి యొక్క కౌన్సిలు ఈ రష్యా శాంతి సూచనల నిరాకరిస్తూ మరుసంవత్సరానికి వాయిదావేసింది. 1927 వ సం॥నుండి సోవియట్ రష్యా ప్రతినిధులు ఆయుధ విసర్జనకై పోరాడుచునే యుండిరి.

1934 వ సం॥లో జాతిసమితిలో చేరవలసినదని 30 దేశాల సంతకాలతో కూడిన ఆహ్వాన పత్రము రష్యాకు పంపించారు. సోవియట్ రష్యా జాతిసమితిలో చేరినప్పటినుండి ప్రపంచ శాంతిపట్ల తన దృక్పథాన్ని వెల్లడించుచూ, శాంతి స్థాపనకై జాతిసమితిలో పోరాడుచునే యుండెను.

జాతి సమితిపట్ల సోవియట్ రష్యా వైఖరిని గూర్చి, ఇంగ్లండు పార్లమెంటు సభ్యురాలైన "డచ్చెస్ ఆఫ్ ఎథోల్" అను నామె ఈవిధంగా చెప్పింది. ఈమె ఇటీవలనే ఛేంబర్లేను విదేశాంగ వ్యవహారమువట్ల అసమ్మతి సూచకంగా తన సభ్యత్వానికి రాజీనామా నిచ్చింది.

"1919 వ సం॥ లో రష్యా, జర్మనీకన్న ఎక్కువ భూభాగాన్ని కోల్పోయినప్పటికి, తిరిగి దాన్ని సంపాదించే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు. 1934 వ సం॥లో జాతిసమితిలో చేరుటకు ఆహ్వానం వచ్చినప్పుడు కూడ, లోగడ నుండి తాను పెట్టుబడిదారీ ప్రభుత్వాలయెడ చూపుతూన్న నిరసన భావమును వెల్లడించుచునే చేరింది. కాని జాతిసమితిలో సభ్యురాలైనప్పటి నుండి, ఈరోజు వరకు సమితిపట్ల విశ్వాసపాత్రత వహించిన సభ్యురాలు ఒక్క సోవియట్ రష్యాయే అని నేను గట్టిగా చెప్పగలను."

జర్మనీ, జపానులు, జాతిసమితినుండి విడిపోయి, ప్రపంచ వినాశానికి దారితీసే ఫాసిస్టు కుట్ర సన్నాహాలు చేయడంవల్ల శాంతిదూతయైనసోవియట్ రష్యా జాతి సమితిలో చేరినప్పటినుండి సమితిద్వారా వాటిని ఎదుర్కొని శాంతిని కాపాడుటకు సర్వశక్తులా ప్రయత్నించింది. సామ్రాజ్యవాదుల సంఘమైన జాతిసమితిలో చేరుటకు సోవియట్ రష్యా ఎందుకు ఒప్పుకున్నదో లిట్వినాఫ్ తన మొట్టమొదటి ఉపన్యాసంద్వారా లీగులో వెల్లడించాడు.

"అంతర్జాతీయ జీవితాభివృద్ధిని జాగ్రత్తగా పరిశీలిస్తూన్న సోవియట్ ప్రభుత్వము, శాంతిని కాపాడేందుకు, మిలిటరీ నియంతృత్వ దేశాలవలంబిస్తూన్న దురాక్రమణ విధానాన్ని ఎదుర్కొనేందుకు, జాతిసమితిలోని కొన్ని దేశాలు చేస్తూన్న ప్రయత్నాలను గమనించకుండా వుండలేదు. అంతేగాక దురాక్రమణ పద్ధతి నవలంబిస్తూన్న దేశాలు జాతిసమితియొక్క నిర్బంధాలు ఆటంకంగా వుండటంచేత భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తూన్నవి. కాబట్టి ప్రపంచ దేశాల మధ్య శాంతిని, సహకారాన్ని నెలకొల్పేటందుకు మార్గాల నన్వేషిస్తూన్న సోవియట్ ప్రభుత్వపు జాతిసమితిపట్ల వెనుకటి దృక్పథాన్ని ఈ సంఘటనల మూలంగా మార్చుకోవలసి వచ్చింది."

సోవియట్‌రష్యా జాతిసమితిలో చేరిన తర్వాత 1935 వ సంవత్సరం నవంబరులో అమెరికాతో స్నేహ సంబంధాలు ఏర్పరచుకో మొదలిడింది. అమెరికాను సహాయం తీసుకొని ప్రపంచ శాంతిని కాపాడ ప్రయత్నించింది తర్వాత సోవియట్ రష్యా అమెరికాకు యూరప్ వ్యవహారాలతో దగ్గిర సంబంధం కల్పించింది.

మే, 1935 వ సంవత్సరంలో సోవియట్ రష్యా, ఫ్రాన్సు, జెకొస్లొవేకియాలతో పరస్పర సహాయక సంధులు చేసుకొన్నాయి. అప్పుడు హిట్లరు ఈ సంధులన్నీ ఇతరదేశాలమీదికి దాడివెడలేందుకు చేసుకున్నారని లోకానికెరిగించి భగ్నం చేయజూచాడు. కాని అప్పుడు మాత్రం లాభంలేకపోయింది. తూర్పు యూరోపా దేశాలమధ్య శాంతి భద్రతలను నెలకొల్పడానికి ఈ పరస్పర సహాయకసంధి పత్రాలు అమితంగా తోడ్పతాయని సంధిపత్రాలమీద సంతకాలు పెట్టిన దేశాల ప్రతినిధులు ప్రకటించారు.

1936 వ సంవత్సరంలో సోవియట్ రష్యా బ్రిటన్‌తో నావికా సంధిని చేసుకుంది.

1936 వ సంవత్సరం మార్చిలో అమెరికా జర్నలిస్టు రాయ్‌హోవార్డ్‌కు స్టాలిన్ ఇంటర్‌వ్యూ ఇచ్చినప్పుడు ఈ విధంగా చెప్పాడు.

"ప్రస్తుత ప్రపంచంలో ఏనాటికానాడు యుద్ధానికి తయారయే దేశాలు జపాన్, జర్మనీలు. ఇటీవల జపాను మిలిటరీ అధికారులు ఇతర దేశాలను బెదరిస్తూ ఇచ్చిన స్టేట్‌మెంటులు నాకు జ్ఞప్తియే యున్నవి. అతి ఉత్సాహవంతంగా వీటి రెంటికీ యుద్ధకాంక్ష పెచ్చు పెరుగుతుంది. కాని ఏది ముందు యుద్ధానికి దారితీస్తుందో మాత్రం చెప్పలేము."

ఈ ఫాసిస్టు కుట్రదారుల దూకుడును, దురాక్రమణపద్ధతి నరికట్టడానికి సోవియట్ రష్యా (collective security) సాముదాయిక భద్రతను నెలకొల్పవలెనని జాతిసమితిని కోరింది. ప్రపంచ దృష్టిని శాంతిమార్గాల త్రిప్పుటకును, శాంతికై పోరాడు దేశాల సంఖ్య నభివృద్ధి చేయుటకును, సోవియట్ రష్యా ఎన్నోవిధాల ప్రయత్నించింది. జాతిసమితిసభ్యురాలైన ప్రతి ఏదేశంయొక్క జాతీయతను కాపాడు హామీ ఇవ్వాలని కోరింది. సమితి సభ్యురాలైన ఏ దేశంపైనగానీ, మరేదేశమైనను యుద్ధం ప్రకటించినట్లయిన జాతిసమితి తప్పక జోక్యం కలుగజేసుకొని శాంతిని కాపాడాలని వాదించింది. సమితి సభ్యురాలైన ఏ దేశం పైనగాని దురాక్రమణపద్ధతి నవలంబించు యితర దేశాలు దాడివెడలినట్లయిన జాతిసమితి మీదికి దాడి వెడలినట్లేనని వాదించింది. కానవెంటనే దురాక్రమణపద్ధతుల నవలంబించు దేశాలపైన శాంక్షన్సు (ఆంక్షలు) ను ప్రయోగించాలని కోరింది. అంతేగాకుండా సోవియట్ రష్యా సాముదాయిక భద్రతను నెలకొల్పుటకు (Regional pacts of mutual assistance) ప్రాంతీయ అన్యోన్య సహకార సంధులు అవసరమని వాదించి జాతిసమితి దృష్టిని వాటిపైమరల్చింది. అప్పుడు 'హిట్లరు ఫాసిజానికి, స్నేహితురాలైన పోలిష్ గవర్నమెంటు, సోవియట్ రష్యా వాదనను రద్దు పరుపజూచింది. దీని స్థానే (Bilateral non aggression pacts) రెండుజాతు లొండొరులపై దాడివెడలకూడదనే ఒడంబడికలు ప్రతిపాదించి (Lcoalisation of war) యుద్ధాలను ప్రాంతీయం చెయ్యాలని వాదించింది. అప్పుడు లిట్వినాఫ్ సెప్టెంబరు 1935 వ సంవత్సరపు తన ఉపన్యాసంలో ఈ విధంగా చెప్పాడు.

"ఎవరైనాసరే (Localisation of war) యుద్ధాలను ప్రాంతీయం చెయ్యమని ప్రతిపాదిస్తున్నారంటే, దాని అర్థము యుద్ధాలకు అనుమతినిచ్చి, నిరాటంకంగా యుద్ధాలు కొనసాగించటానికి ఒప్పుకోట మన్నమాట" (లిట్వినాఫ్)

ఈసమయంలోనే సోవియట్ రష్యా ప్రతినిధి, అంతర్జాతీయ కాన్ఫరెన్సులలో భిన్నరహితమైన శాంతిని నెలకొల్పవలెనని అన్నిదేశాల ప్రతినిధులకు తెలియజెప్పాడు. ఇంతలో ఇటలీ-అబిసీనియా ఘోరభయంకర యుద్ధపరిస్థితులకు భీతిచెందిన దేశాలు (అందు ముఖ్యంగా ఫ్రాన్సు యితర చిన్న దేశాలు ఫాసిస్టుల క్రూరకృత్యాలకు త్తరచెంది) సోవియట్ రష్యా సూచించిన, సాముదాయిక భద్రతా కార్యక్రమాన్ని బలపరిచాయి. అదేసమయంలో, జాతిసమితిలోనిచిన్న చిన్న ఫాసిస్టు ప్రతినిధి దేశాలు, జర్మనీ, జపానులను తిరిగి సమితిలో చేర్చుకునేటట్లు ప్రయత్నాలు సలుపుతున్నాయి. జాతిసమితి బలవత్తరంగా వుండాలంటే జాతిసమితిలో అన్ని దేశాల ప్రతినిధులు ఉండాలనియాదేశాలు ప్రచారం సాగించాయి. కాని వీండ్ల అంతరంగి కోద్దేశ్యమేమన, సోవియట్ రష్యా సాముదాయిక భద్రతనుసూచించే ఈసమయంలో ఈ ఫాసిస్టు గుంపుఅంతా సమితిలోచేరి, రష్యా సూచనలను ఎదుర్కోవటం, 1936 వ సం॥ సెప్టెంబరులో లిట్వినాఫ్ తన చరిత్రాత్మకమైన ఉపన్యాసం ద్వారా (collctive security) సాముదాయిక భద్రతను భగ్నం చేయజూచు ఫాసిస్టు దోపిడిదారీ గుంపుల ప్రయత్నాలను అరికట్టి, వాండ్ల వాదనను త్రోసిపుచ్చాడు.

1935 వ సం॥లో ఫాసిస్టు నాయకుడైన ముస్సోలినీ, తన దోపిడీపద్ధతి నవలంబించి నిరపరాధులును, నిరాయుధులును అయిన అబిసీనియా ప్రజలమీదికి దండెత్తి, మారణయంత్రాలతోను, విషవాయువులతోను, ముంచివేయుచున్న సమయంలో ఇటలీపై శాంక్షన్సును ప్రయోగించి, క్రూరత్వపు దారినుండి అబిసీనియాను తప్పింపవలసినదని ఎలుగెత్తి చాటింది. సోవియట్‌రష్యా, ఫాసిస్టుల దాడి నరికట్టి, ప్రజాస్వామ్య దేశాల స్వాతంత్ర్యాన్ని కాపాడి ప్రపంచశాంతిని నిలబెట్ట వలెనని ఎలుగెత్తిచాటింది సోవియట్ రష్యా ఒకవైపు అబిసీనియా పై ఇటలీ దాడి నరికట్టడానికి ప్రయత్నిస్తుంటే వేరొకప్రక్క ప్రపంచ ప్రఖ్యాత బ్రిటిష్ ఇంపీరియలిష్టు ప్రభుత్వము నిక్కృష్టమైన హోరు—లావెలు సంధిలో నిమగ్నమై యుద్ధఫలితాలను పంచుకోడానికి ముస్సోలినీతో చేరి కుట్రలు పన్నుతూంది.

1931 సం॥ లో జపాను చైనామీదికి దాడి వెడలినప్పుడు ఇద్దరు జాతిసమితి సభ్యులు కావడం చేతను, కొద్దిపాటి న్యాయమైనా జరుగుననే ఆశతో చైనా జాతిసమితికి మొరబెట్టుకుంది. కాని జాతిసమితిలో బాధ్యతగల సభ్యురాలైన బ్రిటిష్ ప్రభుత్వం తన రాజకీయ చాక్చక్యము (Diplomatic support) నుపయోగించి జపానుకు సహాయం చేసింది. అప్పుడు సోవియట్ రష్యా బహిరంగంగా జపాను చర్యను ఖండించి, చైనాకు సహాయం చేస్తూ జపానుదాడి నరికట్టవలెనని తదితర దేశాల బాధ్యతను గుర్తెరిగింప జేసింది. పిమ్మట సోవియట్ రష్యా (Far East) తూర్పు భాగమందు శాంతిని నెలకొల్పడానికి చైనాతో ఆగస్టు 21, 1937 వ సం॥ లో (Non aggression Pact) దాడుల నరికట్టు సంధిని చేసికుంది.

ఇంకపోతే స్పెయిన్ విషయంలో హిట్లరు, ముస్సోలినీలు బహిరంగంగా ఫ్రాంకోకు సహాయం చేస్తుంటే, ఫ్రాన్సు, బ్రిటనులు తటస్థవిధానం తటస్థవిధానం అని మూలుగుతూన్నాయి. సోవియట్ రష్యా స్పెయిన్ ప్రభుత్వానికి తాను వీలైనంతవరకు సహాయంచేస్తూ ఇతర దేశాలను కూడ సహాయము చేయవలసినదని అనేకమార్లు హెచ్చరించింది. సక్రమ ప్రజాస్వామ్యంతో కూడిన స్పెయిను ప్రభుత్వంమీదికి ఫాసిస్టు బందిపోటు గుంపు పట్టపగలు, దోపిడీకి బయలుదేరితే, శాంతి కాముకులమని చెప్పుకొనే, ఫాసిస్టుదేశాలచుట్టూ పరుగులుతోలే బ్రిటన్, ఫ్రాంసులు అవలంబిస్తున్న తటస్థవిధానాన్ని గూర్చి జాతిసమితి కౌన్సిలుసభలో (League of nations council) సోవియట్ రష్యా విదేశాంగ మంత్రి కామ్రేడ్ లిట్వినాఫ్ తీవ్రంగా విమర్శించి ఎత్తిపొడిచాడు. 1936 సం॥ అక్టోబరులో, కామ్రేడ్ స్టాలిన్ స్పెయిన్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శియైన (Jose Diaz) జోస్ డ్యాజ్‌కు, ఈ స్పానిష్ అంతర్యుద్ధ సమయంలో ప్రజాస్వామ్య శాంతిప్రియుల కర్తవ్యమును గూర్చి ఒక టెలిగ్రాముద్వారా తెలిపాడు. "రియాక్షనరీ ఫాసిస్టు క్రూరుల బారి నుండి స్పెయిన్‌దేశాన్ని కాపాడటం, స్పెయిన్ ప్రజల స్వవిషయానికి సంబంధించిన విషయం కాదు. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతూన్న మానవజాతి కంతకు సంబంధించిన విషయం". దీన్నిబట్టి స్పానిష్ ప్రజలయొక్క హక్కులకై జరుపవలసిన పోరాటాన్ని రష్యా కార్మిక, కర్షకులు తమ ప్రభుత్వం ద్వారాను రష్యన్ ప్రభుత్వంగాని, జాతిసమితిలోని మరియే యితర సంఘంలోగాని ఉన్న తన సభ్యుల ద్వారాను బలపరచడాన్ని తన సిద్ధాంతంగా పెట్టుకుందని తెలుస్తూంది. 1936 వ సం॥ అక్టోబరులో స్పెయిన్ విదేశాంగ వ్యవహార మంత్రియైన (Alvarez del vayo) ఆల్‌వర్జ్ డెల్‌వాయ్, ఫాసిస్టులు స్పెయిను దేశములో మిలిటరీ జోక్యమును కలుగజేసికొంటున్నారని జాతిసమితిలో అనేక కారణాలద్వారా నిరూపించాడు. దీన్ని ఆధారముగా చేసికొని సోవియట్ రష్యా ప్రతినిధి లండను తటస్థవిధాన సంఘసభలో చక్కని ఉపన్యాసమిచ్చాడు.

"తటస్థ విధానావలంబనా పద్ధతికి వ్యతిరేకముగా నడుచుకోవటాన్ని వెంటనే ఆపకపోయేటట్లయితే సోవియటు రష్యా తటస్థవిధాన సంఘంతో సంబంధంలేనట్లు ఎంచుకుంటుంది."

ఈ ఉపన్యాసం, స్పెయిను ప్రభుత్వ అంతర్గత బలానికి బయటినుండి ఎంతో తోడ్పడింది.

మాడ్రిడ్ సరిహద్దులో ఫ్రాంకోసేనలు అపజయ మొందినప్పుడు, ఇటాలియను జర్మను ఫాసిస్టులు తమ మిలిటరీ సైన్యాన్ని ఫ్రాంకోకు విరివిగా పంపసాగారు. అప్పుడు సోవియటు రష్యా స్పెయినులోకి ఫాసిస్టు వాలంటీర్ల దిగుమతిని ఆపివేయవలెనని లండను కమిటీలో వాదించింది. 1937 వ మేలో లిట్వినాఫ్ జాతిసమితి సభలో ప్రపంచ శాంతి రక్షణ విషయమై హెచ్చరిస్తూ స్పెయిన్ ప్రజాపోరాటానికి ఎంత ఎక్కువ సహాయము చేయగలిగితే అంతఎక్కువ చేయాలి అని వాదించాడు. 1337 వ సంవత్సరంలో, అంతర్జాతీయ పరిస్థితులు విషమరూపం దాల్చినవి. సోవియట్ రష్యా వర్తకపుతోడ దొంగల విషయమై గట్టిగా హెచ్చరిక చేసింది. మెడిటరేనియన్ పవర్సుయొక్క (Nyon) న్యాన్ కాన్ఫరెన్సులో ఫాసిస్టు ఓడదొంగవిధానాన్ని ఖండిస్తూ లిట్వినాఫ్ ఉపన్యాసం గావించాడు. ఈ కాన్ఫరెన్సులో మెడిటరేనియన్ పవర్సు అన్నీ కలసి పరస్పర సహాయక సహకార సంధిని (Mutual support and assistance) కుదుర్చుకున్నాయి. ఇదే శాంతిని కాపాడుటకును, ఫాసిస్టు యుద్ధ పెనుభూతాల దురాక్రమణ పద్ధతినుండి తప్పించుటకును, తద్వారా ప్రపంచ శాంతినినిలబెట్టుటకును అన్ని దేశాలు కలసి చేసుకొన్న అగ్రిమెంటు. అదివరకు ఎన్ని సంవత్సరాలనుండియో సాముదాయక భద్రత, (collective security) కొరకు పోరాడు సోవియట్‌రష్యా కోరిక ఫలించింది. అప్పటినుండి అమలులో పెట్టబడింది.

మే, 23,1938 వ సంవత్సరంలో స్పెయిన్ కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ సభలో స్పెయిను కమ్యూనిస్టు నాయకురాలైన కామ్రేడ్ పాసనా ఈ విధంగా చెప్పింది.

"ఈరోజున అంతర్జాతీయ కార్మిక, కర్షకులకు ప్రోత్సాహ మిచ్చే దితన శాంతి పద్ధతిని వీడక, ఫాసిస్టుక్రూరులవల్ల బాధ ఉపడుచున్న ప్రజాస్వామ్యదేశాలకు అండగా నిలచింది ఒక్క సోవియట్‌రష్యాయే."

ఇటీవల హిట్లరు మధ్యయూరప్‌లో జెకొస్లొవేకియాపై దాడివెడల సమకట్టేముందు పెనుకటి సంధిప్రకారం సహాయానికొస్తానన్నదిసోవియట్ రష్యా. కాని శాంతిదూతయని చెప్పుకొను ఛేంబర్లేను కుట్రపన్నాగాలవల్ల జెకొస్లొవేకియా ఎవ్వరి సహాయ్య మవసరం లేదంటానే దానోహాని కొడిగట్టింది అప్పుడు సోవియట్ రష్యా జోక్యం కలుగజేసుకోటానికి అవకాశం లేకపోయింది.

సోవియట్ రష్యా స్పెయిన్ ప్రజాప్రభుత్వాన్ని కాపాడడానికి అనేక ప్రయత్నాలు సలుపుతూంటే, బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం స్పానిష్ ప్రజాస్వామ్యమ, పట్ల ఫాసిస్టు కుట్రదారులైన హిట్లరు, ముస్సోలినీలు పన్నిన కుట్ర పన్నాగాన్ని ప్రోత్సాహపరుస్తూంది. స్పెయిన్ ప్రజాప్రభుత్వాన్ని నుబిమివేయటానికై బ్రిటిష్ ప్రభుత్వం అనేక అమానుష కార్యాచరణులకు గడంగుతుంది. ఇట్టి అమానుష నీచకృత్యాలకు పాల్పడిన ఛాంబర్లేను స్పానిష్ రిపబ్లికన్ ప్రభుత్వమృత కళేబరముపై ఆంగ్లో-ఇటాలియన్ పరస్పర స్నేహాన్ని నెలకొల్ప ప్రయత్నిస్తున్నాడు. కామ్రేడ్ లిట్వినాఫ్ ఈ చర్యలన్నిటినీ ఎదుర్కొంటునే యున్నాడు. కాబట్టి:

1. నవంబరు 7 వ తేదీ 1917 వ సంవత్సరపు విప్లవము, ముగిసిన నాటినుండి ఈ రోజువరకు ప్రపంచ కష్టజీవులపాలిటి కల్పతరువై అంతర్జాతీయ కష్టజీవుల కలయికకోసరమై నిరంతరం కృషి సల్పుతూన్న దేశం సోవియట్ రష్యా.

2. మైనారిటీ దేశాల స్వాతంత్ర్యాన్ని కాపాడుటకై సంపూర్ణ ఆయుధ విసర్జనకై పోరాడిన దేశం సోవియట్ రష్యా.

3. కలెక్టివ్ సెక్యూరిటీకి అండగానిలిస్తేనేగాని ఫాసిస్టు పెనుభూతాల వేరుపరచి, ప్రజాస్వామ్య స్వాతంత్ర్యానికి హామీ ఇవ్వలేమని ప్రపంచాని కంతటికి ఎలుగెత్తి చాటినదేశం సోవియట్‌రష్యా.

(మిగతా 14 వ పేజీలో)

రాష్ట్రమంతటా కాళీపట్టణ రైతులయెడ సానుభూతి

కాంగ్రెస్ సేవకులపై అభియోగము

కాళీపట్నం సత్యాగ్రహ సందర్భంలో ఎరస్టు చేయబడని వారు 23 రు లాఠీచార్జీలకు గురియై బయటనే ఉన్నారు. వారందరిచేత ప్రత్యేక స్టేటుమెంటులు రెవిన్యూ మంత్రిగారికి ఎంపబడినవి. కాళీపట్నము, పాతపాడు రైతులు పూర్వమునుండి జరుపు రొయ్యిపప్పు వ్యాపారమునకు సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరములు, 1924 వ సంవత్సరమునుండి మాత్రమే గలవు. అంతకుపూర్వము కొన్నాళ్లు ఆకివీడునకును, కొన్నాళ్లు నర్సాపురంలో యున్న రంగూను వ్యాపారస్తుల ఏజంటులతో వ్యాపారము జరిపిరి. రైతుల సంతకములతో కాళీపట్నము పూర్వ చరిత్రయంతయు రివిన్యూ మంత్రిగారికి పంపినారు. రిజర్వు పోలీసులు కొందరు నేటికిని కాళీపట్నములో యున్నారు. ఉభయపక్షముల తరఫునను శాంతముగానే యున్నది. చుట్టుపట్లయున్నవారును, నర్సాపురములోయున్న విద్యాధికులుకూడ రైతులపై ఎక్కువ అభిమానమును చూపుచున్నారు.

నర్సాపురం జైలులో యున్న శ్రీమతి అన్నపూర్ణాదేవి, మాణిక్యాంబగార్ల కేసు 15-3-39 వ మధ్యాహ్నము 1 గంటకు తహసీలుదారు విచారణ మొదలుపెట్టి 144, 107 సెక్షనుల క్రింద మిమ్ములనెందుకు శిక్షించరాదని అడిగెను. అందుపై వారిరువురు యీ క్రింది స్టేటుమెంటు యిచ్చిరి :

"రాష్ట్రములందు స్వపరిపాలనము చేకూరినదని ప్రజలలో కొందరు చెప్పుకొను ఈ దినములలో నైనను అధికారుల దృక్పథము మారునని ఆశించితిమి. కాంగ్రెసు మంత్రివర్గము అధికారములోనికివచ్చి దాదాపు రెండు సంవత్సరాలైనది అధికారుల దుండగములు తగ్గలేదు. లంచగొండుల సంఖ్య మితిమీరుచున్నది. ఈ మధ్య కాళీపట్నములో నిరాయుధులగు పేద రైతులను, రైతులలో ముసలివారిని, స్త్రీలను, గర్భిణీ స్త్రీలను పోలీసు నౌకరులు లాఠీలతో నిర్దాక్షిణ్యముగా కొట్టినారు. త్రివర్ణ పతాకమును ఒకబాలుని చేతిలోనుండి పోలీసులు లాగి చింపివేసి బురదలో ఊర్రదొక్కిరి. డిప్యూటీ సూపరింటెండెంటు ఒక ముసలి పేదరైతును బూటుకాలితో తన్నెను; అనరాని మాటలు అనెను. అమానుష కృత్యములుచేయు అధికారులను ఉద్యోగమునుంచి తొలగించినగాని దేశమున శాంతి చేకూరదు. జమీందారుని తృప్తిపరచు స్థానికోద్యోగులు ఇట్టి చర్యలకు పాల్పడుట మిగుల విచారకరము. మేము పొలములోనికి వెళ్ళినమాట వాస్తవమే. మేము కాళీపట్నము, పాతపాడు కాపురస్తులము కాము. తిండిలేకుండా 24 గంటలు పుర్రభూములలో మండుచుండుంచిరి. మేము వాలమ్రు కాపరస్తులము."

కేసు 17 వ తేదీకి వాయిదావేసి ఆరోజున విచారణ ప్రారంభించి, తిరిగి 25 వ తేదీకి వాయిదావేసిరి. 16-3-39 తేదీన సబుకలెక్టరు మైలవరపు రామారావుగారిమీద కేసు 25 వ తేదీకి వాయిదావేసిరి.

శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, సంకు అప్పారావుగార్లతో మరి నలుగురు రైతులను కలిపి, చింతలపూడి సబ్‌జైలునుండి 16వ తేదీ రాత్రి 9 గం. లకు నర్సాపురం సబ్‌జైలుకు తీసుకొనివచ్చారు. 17 వతేదీ ఉదయం 8 గంటలకు పైవారిని తణుకు సబ్‌జైలుకు మార్చారు.

త్రిపురీ కాంగ్రెసు నుండి తిరిగి వచ్చిన కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారి మీద కూడా 16 వ తేదీని 107 వ సెక్షన్ నోటీసును జారీచేయబడింది. 18 వ తేదీని నర్సాపురం కోర్టులో వారు హాజరు కావలసి యున్నది. కామ్రేడ్ కలిదిండి బంగారంగారిమీద కూడా 18 వ తేదీని విచారణ ప్రారంభించబడెను.

కాళీపట్నపు అభాగ్య స్త్రీల అరణ్యరోదన

తుమ్మపూడి గ్రామంనుండి శ్రీ సూర్యదేవర వెంకటప్పయ్యగారు ఈవిధముగా వ్రాయుచున్నారు:—

"మరుద్దామన్నా మరపునకురాని అఘోర దృశ్యాన్ని వర్ణింప శక్యం కాకుండా ఉంది. హాహా కారాలుచేస్తూ, బొబ్బలుపెట్టుతూ, గుండెలుబాదుకొనుచూ, కంటికి కడివెడుగా కన్నీళ్లు కారుస్తూ రాయవేలూరు జైలుకు తీసుకొని వెళ్ళబడుతున్న ఆ కాళీపట్నపు అభాగ్యస్త్రీలను బెజవాడ స్టేషన్‌లో నేనుచూచుట తటస్థించినది. బయటి ప్రపంచాన్నైనా యన్నదూ యెరుగనట్టి, చివరకు రైలుసయితం ఎప్పుడూ చూడనోచుకోనట్టి, కల్లా, కపటం అనేదేమో ఎన్నడూ ఎరుగనట్టి ఆదిక్కుమాలిన వృద్ధనారీమణులు జమీందారుగారి ఆగ్రహ దృష్టులకు ఆహుతి కావలసినంత తప్పేమిచేశారో వూహింప దుస్సాధ్యంగా వుంది. తల్లుల యెడబాటెన్నడూ యెరుగని ఆ పసిబిడ్డలు ఈనాడింటి దగ్గర తల్లులకొరకు ఎంత అలమటిస్తున్నారో ఈ తల్లులయొక్క రోదనయే చెప్పక చెప్పుచున్నది. బెజవాడ స్టేషన్లో వారెక్కిన బండి ఆగియున్నప్పుడు ప్లాట్‌ఫారంమీద కన్పడిన ప్రతి వ్యక్తినీ "ఏం, బాబయ్యా మాగతింతేనా; కాంగిరేసు మంత్రులు పూనుకుంటే మాకట్టాలు గట్టెక్కుతాయట నిజమేనా?" యని ఏకధారగా కన్నీరు కారుస్తూ యెంతో దీనంగా యడుగుతూంటే, ఎప్పుడు దయాదాక్షిణ్యాల్లేకుండా చివరకు మానవత్వమే వదిలేసి అతికూరంగా వుండే పోలీసుల కళ్లెంట నీళ్ళు కార్చుచుండుట నాదృష్టి గోచరమైంది. ఇలాంటప్పుడు ఇక ప్రజాయిక్కట్టులు బాప గట్టెక్కుతున్నామని శపథాలు చేసిన మన కాంగ్రెసు మంత్రివర్యులేమి చేస్తారో చూడాల్సింది. ఎలక్షనులప్పటి వాగ్దానాలను ఒకమారు స్మరణకు దెచ్చుకొని, ఆవిలపించే బిడ్డలనూ, తల్లులనూ, యేకంచేయుటానికి మన కాంగ్రెసు మంత్రివర్యులు యేమాత్రం ఆలస్యం చేసినప్పటికీ, నిందలపాలు గావలసి వస్తుందని హెచ్చరిస్తున్నాను."

సానుభూతి సభలు

బెజవాడ.

16-3-39 వ తేదీని బెజవాడ నగర యువజనసంఘ యాజమాన్యమున కామ్రేడ్, మద్దూరి అన్నపూర్ణయ్యగారి అధ్యక్షత క్రింద సాయంత్రం 6-30 గంటలకు గాంధీపార్కులో బహిరంగసభ జరిగెను. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి కామ్రేడ్ చలసాని వాసుదేవరావుగారు కాళీపట్నం పోరాటంయొక్క చరిత్రను విశదీకరించారు. రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు కాళీపట్నం రైతులమీద పోలీసులు జరిపిన అమానుష చర్యలకు కాంగ్రెసు మంత్రులు తగిన కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రకాంగ్రెస్ సోషలిస్టుపార్టీ సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్యగారు ఫిబ్రవరి 14 వ తేదీని చిట్టివలస కార్మికులపై అర్ధరాత్రివేళ పోలీసులు గావించిన లాఠీచార్జీలను, కాల్పులను తీవ్రముగా ఖండించారు.

పిమ్మట, కాళీపట్నంలోను, చిట్టివలసలోను పోలీసులు జరిపిన దుండగాలను ఖండిస్తూ, వాటికి కారకులయిన ఉద్యోగస్థులపై కాంగ్రెసు మంత్రివర్గం కఠినచర్య తీసుకోవలసినదని కోరుతూ తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

సత్యాగ్రహ పోరాటంలో అనేక బాధలు పడుతూన్న రైతు కుటుంబాల సహాయార్థం దాదాపు 4 రూపాయలు సభలో వసూలు చేయబడెను.

పాలూరు.

15-3-39 వ తేదీని పాలూరులో గ్రామ కాంగ్రెసుసంఘ యాజమాన్యాన జరిగిన బహిరంగ సభలోకూడా యిదే విధంగా కాళీపట్నం రైతు సత్యాగ్రహ పోరాటాన్ని అభినందిస్తూ పోలీసుల దుండగాలను ఖండిస్తూ, తీర్మానించబడింది.

కొందేపాడు.

ఈ నెల 14 వ తేదీ సాయంకాలం 8 గంటలకు కొందేపాడులో గ్రామకాంగ్రెసు సంఘ యాజమాన్యమున, శ్రీ కొచ్చాల వెంకన్నగారి అధ్యక్షత క్రింద జరిగిన బహిరంగసభలో శ్రీయుతులు యస్. ఆనందరావు, వై. రంగనాయకులుగార్లు ఉపన్యసించిన అనంతరం కాళీపట్నం రైతులు గత 6 మాసాలనుంచి తమ న్యాయమైన హక్కులకై జమీందారుతో సల్పుతూన్న పోరాటానికి, యిటీవల వారు ప్రారంభించిన సత్యాగ్రహానికి అభినందిస్తూ, రైతులపై పోలీసులు జరిపిన లాఠీచార్జీలు, ఎరస్టులు మొదలైన కఠినచర్యలను నిరసిస్తూ, రాష్ట్రకాంగ్రెసుకమిటీవారు, కాంగ్రెసు మంత్రివర్గంవారు, రైతులకు న్యాయం కలుగజేయవలసిందని ఏకగ్రీవంగా తీర్మానించబడింది.

విజయనగరం.

11-3-39 వ తేది సాయంకాలం విజయనగరంలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీయొక్క యాజమాన్యాన జరిగిన బహిరంగసభలోకూడా ఈ క్రింది తీర్మానం ఏకగ్రీవంగాఆమోదించబడింది.

"సక్రమమైన తమహక్కులకొరకై శాంతియుతంగా సత్యాగ్రహం చేస్తూన్న కాళీపట్నం రైతులయెడ యీ సభవారు సానుభూతిని కనపర్చుచూ, కాంగ్రెస్ మంత్రుల హయాంలోనే సత్యాగ్రహులపై పోలీసులు లాఠీచార్జీలు, ఎరస్టులు చేయుటను ఖండిస్తూ, వెంటనే కాంగ్రెస్ మంత్రులు యీ విషయమై కలుగజేసుకొని రైతులకు న్యాయం కలిగించవలసినదని యీ సభవారు కోరుచున్నారు.

యండగండి

ది 10-3-39 తేదీని యండగండి గ్రామ రైతు సంఘ యాజమాన్యమున రామాలయము వద్ద పెన్మెత్స వెంకట సోమరాజు అధ్యక్షతను బహిరంగసభ జరిగెను. సభకు సుమారు 200 మంది రైతులు వచ్చిరి.

కాళీపట్నం రైతులు దుస్థితిని గురించి పేరిచర్ల చినసోమరాజుగారు విపులంగా మాట్లాడిరి. సభలో యీదిగువ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడెను.

"కాళీపట్నంలో కొన్ని శతాబ్దములనుంచి అక్కడవున్న భూమిలో చేపలను పట్టుకొని జీవనోపాధి చేయుచున్న రైతులను కాళీపట్నం జమీందారు మీకు ఈభూమి అంతటిలో కాల్వ త్రవ్వించి 800 ఎకరములు భూమి యిచ్చెదనని మోసముచేసి రైతుల సహాయముతో కాల్వ త్రవ్వించుకొని యిప్పుడు ఆభూమి అంతయు నాదేననియూ అమ్ముకొనుచుండగా ఆ పేద రైతులు వారికి యిస్తానని చెప్పిన భూమిని అమ్ముటకు వీలులేదని సత్యాగ్రహము చేయుచుండగా ఆజమీందారు పోలీసువారి సాహాయముతో 144 సెక్షను ప్రయోగించి స్త్రీలను పురుషులను భేదములేకుండా అతిఘోరముగా లాఠీచార్జీ చేసియున్నారు. యిప్పటికి సుమారు 40 మందిని అరెస్టుచేసిరి. కాంగ్రెసు గవర్నమెంటు పరిపాలనలోకూడా యిటువంటి ఘోరకృత్యములు జరుగుటవల్ల ప్రజలు చాలా సిగ్గుపడుతూ వెంటనే మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గమువారు అక్కడ 144 సెక్షను రద్దుచేసి అరెస్టుచేసిన వారిని వెంటనే విడుదలచేసి రైతులకు యిచ్చెదమన్న భూమిని యిప్పించవలసినదిగా మంత్రివర్గమువారిని యీసభవారు కోరుచున్నారు."

మల్లిపూడి.

11 మార్చి 39 తేదీరాత్రి 7 1/2 గంటలకు మల్లిపూడి గ్రామ కాంగ్రెసు సంఘ యాజమాన్యమున సభ జరుపబడి ఈ దిగువ తీర్మానము చేయబడినది.

"కాళీపట్టణములో రైతులు తమ న్యాయమైన హక్కులకొరకై సుమారు ఆరుమాసములనుంచి చేయుచున్న పోరాటమును అభినందించుచు, రైతులను, రైతుసేవకులను అరెస్టుచేయుట; లాఠీచార్జీచేయుట మొదలగు పోలీసువారి చర్యలను ఈసభవారు నిరసించుచున్నారు. ఎరస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయవలసినదిగా ఈసభవారు మంత్రివర్గమువారిని కోరుచున్నారు."

మద్రాసు ప్రభుత్వపు భూమి శిస్తు విధానం

ఎసెంబ్లీలో ప్రకాశంగారి ప్రకటన.

ఈనెల 15 వ తేదీని సమావేశమైన మదరాసు లెజిస్లేటివ్ ఎసంబ్లీలో మద్రాసు ప్రభుత్వం యొక్క రైత్వారీభూమి శిస్తు విధానాన్ని గురించి జరిగిన చర్చకు జవాబుగా రివెన్యూ మంత్రిగారు చేసిన ప్రకటనలో యీక్రింది విషయాలు తెయజేసారు.

పంజాబు పద్ధతి

"పంజాబులో నేడు అమల్లోఉన్న స్లైయిడింగ్ పద్ధతిని (అంటే రైతులకు ఏటాటవచ్చే ఆదాయన్నిబట్టి క్రమక్రమంగా శిస్తురేట్లు ఎక్కువ చేసే పద్ధతి) జాగ్రత్తగా పరిశీలించిన తరువాత, యీవిధాన మందలి ఏఒక్క భాగంగాని' పూర్తిగాగాని, మన మద్రాసు రాష్ట్రానికి అది పనికిరాదనీ నిశ్చయానికి ప్రభుత్వం వచ్చింది. దానికి కారణాలు త్వరలో ప్రవేశపెట్టబోయే బిల్లులో తెలియజేయ బడుతుంది

అంతేగాక, రైత్వారీ ప్రదేశాలలో రైతులు నేడు ప్రభుత్వానికి చెల్లించే శిస్తుమొత్తాలు హెచ్చించడంగాని, తగ్గించడంగాని, జరగకుండా కొత్తబిల్లులో కట్టుదిట్టాలు చేయబడతాయి.

మార్ష్‌బ్యాంక్స్ కమిటీ నివేదిక

1914 వ సంవత్సరం తరువాత చేయబడిన రీసెటిల్మెంటులన్నీ రద్దు చేయబడాలని మార్ష్‌బ్యాంక్స్ కమిటీవారు చేసిన సిఫార్సును నేడు మదరాసు ప్రభుత్వం ఆచరణలో పెట్టజాలదు. ఆకమిటీ నివేదికలోఉన్న లోపాలను ప్రభుత్వం సొంతంగా పరిశీలించిన తరువాతనే ఈనిర్ణయానికి వచ్చింది. కమిటీవారికిగల స్వల్ప కాలంలో యీ సమస్యను పూర్తిగా చర్చించుటకు అవకాశంలేదు. 1914 వ సంవత్సరంలో ప్రపంచ యుద్ధఫలితంగా వ్యవసాయ సరకుల ధరలు పెరిగి యుండడంవల్లను, అంతకు పూర్వం తగ్గియుండడంవల్లను, అట్టి సిఫార్సు చేసినట్లు కమిటీవారు తలచినప్పటికీ, ఆసంవత్సరమే ఎందుకు ఆధారంగా తీసుకోవాలో అనే సమస్యను ప్రభుత్వం యింకా చర్చిస్తూంది. ఎట్టి నిశ్చితాభిప్రాయానికి ఇంకారాలేదు. ప్రభుత్వం శాస్త్రీయమైన ఒక చక్కని ఆధారాన్ని నిర్ణయించి, దాన్ని అనుసరించియే భూమి శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టుతుంది.

రెమిషన్లు

నిరుడూ, ఈయేడూ కూడా ప్రభుత్వం 71 లక్షల రూపాయల మాత్రమే రెమిషన్లు యిచ్చినందుకు కొందరు సభ్యులు ఆక్షేపణ తెలియజేశారు. కాని, ప్రభుత్వం రెమిషన్ రేట్లలోనే కాకుండా ల్యాండ్ రివెన్యూ రేట్లలో కూడా ఎట్టిమార్పులూ తేదలచుకోలేదు. (ఈ ఎసెంబ్లీచే అనుమతించబడితే తప్ప) ఇదివరలో చేయబడిన సెటిల్మెంట్ల ప్రకారం హెచ్చుచేయబడిన శిస్తురేట్లు రద్దుచేయ బడతాయి. కాబట్టి యిది సాధ్యం అవుతుంది. రెమిషన్లకై ప్రత్యేకించబడిన సొమ్ములో ఏమాత్రం తగ్గకుండా ఉండే ఏర్పాట్లు ప్రభుత్వం విధిగా చేస్తుంది. ఇంతవరకూ రైతుల కీయబడుతూన్న 'కన్సెషన్లు' (రెమిషన్లు వగైరా) ఒక నిర్ణీత పద్ధతిపై గాని, సూత్రాల ననుసరించి గాని, ఈయబడటంలేదు. అట్టివి ఏర్పరచడానికే ప్రభుత్వం నేడు ప్రయత్నిస్తోంది

ప్రభుత్వానికి ఆదాయం.

నేటి విధానంలో పన్నులభారంతో మూలుగుతూన్న రైతులకు సదుపాయం గలిగించడానికి ప్రభుత్వం అభిలాషపడుతున్నారు. కాని, యీ ప్రయత్నంలో ప్రభుత్వాదాయానికి నష్టం కలుగకుండా ఉండేటట్లు చూడదలుచుకొన్నారు.

ప్రభుత్వం పన్నులు చెల్లించుకొన గలిగే వారినుండి యిప్పటికంటె అధికంగా రాబట్టడానికి మార్గాలుకనిపెట్టి, పరిపాలన నిర్వర్తించ గలిగినట్లయితే, అవసరం వచ్చినప్పుడు శిస్తు రేట్లను యిప్పటికంటె తగ్గించడానికి ప్రభుత్వం ఏమాత్రము వెనుదీయదు. ల్యాండ్ రివెన్యూ విధానంలో మనరాష్ట్రం చిరకాలంనుంచి తప్పు మార్గాలలో పడిఉంది. అనేక భూములమీద హెచ్చుపన్నులు విధించబడ్డాయి. కాని, ఒక్కసారిగా నేడు అమల్లోఉన్న విధానాన్ని తారుమారు చేసినట్లయితే, ప్రభుత్వంయొక్క పరిపాలనా యంత్రాన్ని సరిచేయడం చాలా కష్టమైపోతుంది. మద్యపాన నిషేధంద్వారా ప్రభుత్వం కోల్పోయిన ఆదాయాన్ని సేకరించాలంటే, పన్నులు తగ్గించడానికి వీలుండదు.

బంజరు భూములు.

మద్రాసు ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెన్వెంటనే భూములులేని బీదలకు బంజరు భూములు యిప్పించే ఏర్పాట్లు చేసింది. కాని, ఆభూములలో అధికభాగం ఋణదాతల స్వాధీనంలోకి పోవడం జరుగుతోంది. కాబట్టి యీ పద్ధతిని ఉపసంహరించుకోవలసి వచ్చింది.

నిరుద్యోగ పరిష్కారం

నిరుద్యోగంలోఉన్న విద్యాధికులు పల్లెటూళ్ళకుపోయి వ్యవసాయం చేయడం మంచిది. ఏజన్సీవంటి ప్రదేశాలలో విస్తారమైన భూమి ఉంది. అక్కడ మలేరియా వ్యాపించి యున్నప్పటికీ, అది చాలా ఫలవంతమైన భూమి. కాని విద్యాధికు లందుకు అంగీకరిస్తారని తోచదు ... ..."

సారాంశం.

ప్రకాశంగారి పై ప్రకటన రైత్వారీ రైతులకు మిక్కిలి ఆశాభంగం కలిగిస్తోంది. గత సంవత్సరపు మదరాసు బడ్జట్ చర్చ సందర్భంలో, ప్రధాని రాజాజీ మన ల్యాండు రివెన్యూ పద్ధతిలో ఎట్టిమార్పు తీసుకొని రావడానికి వీల్లేదని ప్రకటించినప్పుడు ప్రకాశం పంతులుగారు తప్పకుండా వీలున్నదనీ, తీవ్రమైన మార్పులెన్నో చేయబడతాయనీ, చెప్పారు, కాని ఒక సంవత్సరం గడిచాక, ప్రకాశం పంతులుగారు కూడా అదే అభిప్రాయానికి వచ్చారు. పేదలకు బంజరు భూమిల్ని పంచిపెట్టే స్కీంకూడా ఇకనుంచి ఆచరణలో ఉండదు. తరతరాలనుంచే తప్పుల్యాండు రెవిన్యూ పద్ధతికి గురి అవుతూన రైతులకు రక్షణకలిగించే విధానం ఏదీ సూచించక పోగా, చదువుకొన్న విద్యాధికుల్ని మన్య ప్రదేశాలకు వెళ్ళి వ్యవసాయం నేర్చుకోమనడం రైతులకు ఎటుల తృప్తి నిస్తుందో బోధపడ్డం లేదు.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం వారిచే సూచింపబడిన వృద్ధి క్రమానుసారం పన్నులు విధించే పద్ధతిని, అంటే పంజాబులో నేడు అమల్లో ఉన్న స్లైయిడింగ్ స్కేలు పద్ధతిని, అమల్లో పెట్టితే పేదరైతులకు పన్నుల భారమూ తగ్గుతుంది; ప్రభుత్వానికి యిప్పటికంటె ఎక్కువ ఆదాయమూ లభిస్తుంది. ఈమార్పును తలపెట్టినట్లయితే, జస్టిస్ మంత్రుల కంటె కాంగ్రెసు మంత్రివర్గం అడుగుకూడా (రెవిన్యూ విధానం విషయములో) పోజాలక పోయిందనే అభిప్రాయానికి తావుండేది కాదు.

రైతులోకం

కొప్పర్రు

ది 16-3-39 తేదీ రాత్రి గం 9 లకు నర్సాపురం తాలూకా కొప్పర్రు గ్రామములో పోలిశెట్టి నారాయణస్వామిగారి అధ్యక్షత క్రింద సభ జరిపి కాళీపట్నపు రైతులపై జరిపిన లాఠీచార్జి వగైరాలను నిరసించుచూ, శాంతియుతముగా సత్యాగ్రహముజరిపి జైలునందు కష్టములనుభవించుచున్న సోదరీ, సోదరులను అభినందించుచూ, రైతులపైయున్న కేసుల నెత్తివేసి, జైలు నందున్నవారిని విడుదలచేసి, రైతుల అనాదినుండి అనుభవించుచున్న హక్కులను కాపాడవలసినదిగా మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచూ తీర్మానించడమైనది. రైతుల హక్కులను స్థిరపరచు నిమిత్తం పని చేయుటకు కొన్ని చందాలుకూడ వసూలు చేయుచున్నారు. 16 వ తేదీ రాత్రి గం 9 ల బండిలో భూపతిరాజు లక్ష్మీనరసరాజు, సంకు అప్పారావుగార్లను నలుగురు రైతులను చింతపూడి జైలునుండి నర్సాపురం తీసుకొనివచ్చి 17 వతేదీ వుదయం గం 9 ల బండిలో నర్సాపురం నుండి తణుకు తీసుకొని వెళ్ళిరి. వీరికేసు విచారణ యీనెల 20 వ తేదీ తణుకులో ప్రారంభమైనది.

వుయ్యూరు ఎస్టేటువారి వింతచర్యలు.

ఈ యెస్టేటులో రైతులు జమీందార్లకు పూర్తిగా పన్నుకట్టి రశీదిమ్మనికోరగా పూర్తిగా పన్నుకట్టినవారికికూడా కొంతభాగము పన్నేకట్టినట్లు రశీదు లిచ్చుచున్నారు. ఇదేమి అన్యాయమని యస్టేటు ఉద్యోగస్థుల నడుగగా మా యిష్టం అని సమాధానము చెప్పుచున్నారు. అందుచే వారి దౌర్జన్యమునకు రైతులు బాధపడలేక, వారు రశీదులో (కొంత) అని వ్రాసినను పూర్తిగానే పన్నులు యిచ్చివేయుచున్నారు. దాట్ల నృసింహ రాజు అనే ఒక రైతు గత నాలుగు సంవత్సరముల నుంచి పన్ను కట్టలేదనే నెపముతో తణుకు డిస్ట్రిక్టు మునసబు కోర్టులో యస్. సి. నెం. 90/39 రు లో దావా చేస్తూ యిదివరకెన్నడు బకాయి లేకుండా పూర్తిగాపన్నులు చెల్లిస్తూ వారి యిష్టప్రకారం యిచ్చే రశీదులు పుచ్చుకొంటున్నా. నడింపల్లి సత్యనారాయణరాజు, యీ. తిరుపతిరాజు, రత్తయ్యమ్మ, పెన్మెత్స బాపిరాజు, కోపూరి సూరమ్మ, పెన్మెత్స సూరయ్యమ్మ, దాట్ల తిరపతిరాజుగార్లనుకూడా పై దావాలో కలిపి అన్యాయంగా కోర్టులకు రప్పించి, హింసించుట చాలా దారుణము. కాబట్టి యిప్పటికైనా పన్ను పూర్తిగా చెల్లించేవారికి రశీదుమీద "పూర్తిగా" అని వ్రాయించి, ప్రజలు యీ జమీందారీ దుండగములకు లోనుగాకుండా ప్రభుత్వమువారు యేర్పాటు చేయించవలసినదిగా కోరుచున్నాము. అని నడింపల్లి తిరుపతి రాజుగారు (దావాలో 4 వ ప్రతివాది) రేలంగి నుంచి మాకు వ్రాయుచున్నారు.

* * *

వెంకటగిరి తాలూకాలో కరవుబాధ

ఈయేడు వెంకటగిరి తాలూకా అంతయు ప్రజలు కరవు బాధచే చెప్పనలవిగాని యిబ్బందులు పడుతున్నారు. పంటలకు నీరు బొత్తిగా లేక, రైతులు శిస్తులు చెల్లించ జాలకున్నారు. జిల్లా జమీన్ రైతుసంఘ కార్యదర్శి శ్రీ సి. గురునాధం గారి యాజమాన్యమున పలుగోడు, తీర్ధంపాడు, సిద్దాగుంట, వగైరా గ్రామాలలో సభలు జరిపింపబడి, పాడైపోయిన పంటకు రెమిషన్లు యిప్పించవలసిందని రైతులు కోరినప్పటికీ, జమీందారీ ఉద్యోగస్థులు, తాబేదార్లు, బీదరైతుల్ని అనేక విధాల నిర్బంధించి శిస్తులు వసూలు చేస్తున్నారు.

* * *

రైతు ప్రచారకులమీద జామీనుకేసులు.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ అసిస్టెంటు కామ్రేడ్ వాసిరెడ్డి శివలింగప్రసాద్‌గారు, వీరమాచనేని వెంకటేశ్వరరావు, అట్లూరి అప్పారావుగారలు చెర్వుకొమ్ముపాలెం, పెదవరం (కృష్ణా జిల్లా) గ్రామాలలో జమీందారీ రైతులను అనేక చెడ్డపనులు చేసేటట్లు పురిగొలుపుతూ ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలిచ్చినందువల్ల శాంతి భద్రతలకు తీరని భంగం కలిగింది కాబట్టి క్రిమినల్ ప్రొసీజరు కోడ్ 107 వ సెక్షను ప్రకారం ఒక సంవత్సరం వరకూ శాంతికి భంగం కలుగకుండా వుండడానికి ఒక్కొక్కరు 500 రూపాయల పూచీకత్తు బాండుల నివ్వవలసిందనీ; ఒక్కొక్కరికి 500 రూపాయల చొప్పున ముగ్గురు మనుష్యులు జామీను ఉండవలసిందనీ, బెజవాడ జాయంటు మేజస్ట్రేటుగారు 114 వ సెక్షన్‌క్రింద ఉత్తరువులు జారీచేసి, సంజాయిషీ చెప్పుకోడానికి 16-3-39 వ తేదీని తమవద్ద కోర్టులో హాజరు కావలసిందని సమన్లు పంపించారు. పైఉత్తరువుల ప్రకారం, 11-11-38 వ తేదీని చెర్వుకొమ్ముపాలెం (ముక్త్యాల ఎస్టేటు) లో కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్యగారితో సహా వీరు యిచ్చిన ఉపన్యాసాలలో జమీందారుగారి రక్తం ప్రవహించేటట్లు చేస్తేగాని స్వరాజ్యం రాదని చెప్పారట. జమీందార్లను కొట్టడం నేరం కాదని హెచ్చరించారట 21-1-39 వ తేదీని పెదవరంలో జరిగిన బహిరంగసభలో, రైతులు తమ నాగళ్ళతోను, కొడవళ్ళతోను, తిరుగుబాటుచేస్తే జమీందార్లు, ప్రభుత్వం సప్త సముద్రాలు దాటి పారిపోవలసిందేనని చెప్పారట. జమీందారుగారి అడవికి పోయి స్వేచ్ఛగా కట్టెలు తెచ్చుకోమని ప్రోత్సహించారట. 16 వ తేదీని కామ్రేడ్ శివలింగ ప్రసాద్‌గారు బెజవాడ జాయింటు మేజస్ట్రేటుగారి కోర్టులో హాజరుకాగా 504 వ సెక్షను క్రింద ముక్త్యాల జమీందారుగారిని, వారి ఏజంట్లనూ పరుషభాష ఉపయోగించి తిట్టినారని మరొక అభియోగం చేర్చారు. విచారణ ప్రారంభం కాలేదు. 25 వ తేదీకి కేసు వాయిదా వేయబడింది.

"మార్చిలో ప్రపంచయుద్ధమా" అనే సందేహం నవశక్తి పాఠకుల ముందు కొన్నినెలల ముందే పెట్టాము. నేటివార్తలు అట్టి ప్రపంచ యుద్ధం సమీపించినట్లు తెలియజేస్తున్నాయి. తిరిగి ఈ విషమస్థితిని తెచ్చిన ఘటనాచక్ర మేమిటో తెలుసుకుంటాము.

స్లోవేకియా తంతు.

జెకోస్లోవేకియాలో గత సెప్టెంబరులో హిట్లరు సూడెటను ప్రాంతాన్ని ఆక్రమించిన పిదప, ఒక ఫెడరలు ప్రభుత్వం ఏర్పడినది. జెక్కుల ప్రభుత్వము (బొహిమియా మొరోవియా రాష్ట్రాలలో). స్లోవక్కుల ప్రభుత్వము, రుథానియా ప్రభుత్వము ఈమూడు ప్రభుత్వాల ఫెడరేషనే జెకోస్లోవేకియా ప్రభుత్వముగా తయారయింది. కాని ఇందు, స్లోవేకియా ప్రభుత్వము పూర్తిగా ఫాసిస్టు ధోరణిని అవలంబించింది. యూదులను హింసించడానికి, కమ్యూనిస్టు పార్టీని నిషేధించడానికి, ఇదే దారితీసింది. జెకోస్లోవేకియా ఫెడరలు ప్రభుత్వంకూడ అట్టి చర్యనవలంబించునట్లు జయప్రదంగా ఒత్తిడి తెచ్చినదికూడ. ఈ స్లోవేకియా ప్రభుత్వ మంత్రివర్గం, ఈ మధ్య హిట్లరు సలహా ననుసరించి, జకోస్లోవేకియానుండి విడిపోవడానికిప్రయత్నాలు మొదలుపెట్టింది. జెకోస్లోవేకియా ప్రభుత్వము స్లోవేకియా ప్రభుత్వము నుండి అట్టి ప్రయత్నాలు సాగించకుండుటకు కొన్ని గ్యారంటీలను కోరింది. స్లోవేకియాలోని హ్లింకా పార్టీ తిరుగుబాటు తీసుకవచ్చింది. ఫెడరలు ప్రభుత్వము స్లోవేకియా ప్రభుత్వమును రద్దు పరచింది. దాని ప్రధానామాత్యుడు టిసోను పదవినుండి తొలగించి తాత్కాలిక ప్రభుత్వాన్ని ఒకదానిని ఏర్పాటుచేసింది. కాని ఈ ప్రభుత్వం 12 గంటలుమాత్రమే ఉండినది. స్లోవక్కులు దీనిని కూలద్రోశారు. టిసో, హిట్లరు సహాయాన్ని కోరాడు. తన్ను డిస్మిస్ చేయుట అక్రమమని తెలియజేశాడు. ఫెడరలు ప్రభుత్వము బేరానికి దిగింది. మరియొక తాత్కాలిక ప్రభుత్వాన్ని స్లోవేకియా అధ్యక్షుని సలహా ప్రకారం మంత్రులను తీసుకొని ఏర్పరచింది. కాని ఇది టిసోకు నచ్చలేదు.

ఇంత చక్కగా తయారుచేసిన నాటకములో తన పాత్రను నిర్వహించడానికి హిట్లరు ముందుకువచ్చాడు. జర్మను పత్రికలలో, స్లోవక్కులను, జర్మనులను జెకోస్లోవేకియా ప్రభుత్వము అనేక బాధలు పెట్టుతున్నదనే ప్రచారము ఆరంభించారు. మరుచటి 24 గంటలలో ప్రేగు(జెకోస్లోవేకియా)ప్రభుత్వమునకు హిట్లరు ఒక అల్టిమేటము పంపించాడు. స్లోవేకియాను ఒక సంపూర్ణ స్వతంత్రదేశముగ పరిగణించాలని, ప్రేగుప్రభుత్వమునుండి జవరలు సిరోవిని తొలగించాలనీ ఆజ్ఞాపించాడు తన్ను చూడ వచ్చిన టిసోను, స్లోవకు పార్లమెంటును సమావేశపరచి, స్లోవకును స్వతంత్ర దేశముగా ప్రకటించమని చెప్పాడు. జర్మను సైన్యానికి జెకొస్లోవేకియాలో ప్రవేశించడానికి ఆజ్ఞ యిచ్చాడు.

మార్చి 14 వ తేదీన స్లోవకు పార్లమెంటు తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. టిసోను అధ్యక్షునిగాను ప్రధాని గాను ఎన్నుకుంది. ఈవరకు ఫెడరలు ప్రభుత్వముచే డిస్మిసుచేయబడినవారినే మంత్రివర్గానికి ఎన్నుకుంది.

రుథానియాను హంగరీ ఆక్రమించింది.

రుథానియా ప్రభుత్వము కూడ తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. నూతన ప్రధాని వాలోసిన్, హిట్లరు యొక్క సహాయాన్ని కోరాడు. కాని రుథానియాను కలుపుకోవాలని గత సెప్టెంబరు నుండి ప్రయత్నిస్తూ ఉన్న హంగరీ తన సైన్యాన్ని పంపి రుథానియాను ఆక్రమించుకోడానికి ఆరంభించింది. ప్రేగు ప్రభుత్వము రుథానియా స్వతంత్రత ప్రకటించినపుడు, తనకేమీ బాధ్యత లేదని, రుథానియాలోని జెక్కు సైన్యాన్ని వెనక్కి రమ్మన్నది. హంగరీ కమ్యూనిస్టు వ్యతిరేక సమ్మేళనములో జర్మను ఇటలీలతో కలసినందులకు, ప్రతిఫలముగ రుథానియాను కోరియుండవచ్చు. హంగరీ తాను చెప్పినట్లు చేయుటకు తయారయినపుడు రుథానియా దాని చేతిలో ఉండినా నష్టములేదను కొన్నారు హిట్లరు. అందుచే హంగరీ ఆక్రమణను అడ్డు చెప్పలేదు.

రుథానియాలో, యుక్రెయినులు, జెక్కు ప్రభుత్వము వెనుదిరిగి రమ్మనను రాని జెక్కు సైనికులు, హంగరీతో యుద్ధము ఆరంభించారు. తమకు హిట్లరు సాయముచేస్తాడని అపేక్షించి యుద్ధానికి పూనుకున్నాయి. కాని ఆశలు నిరాశలైనవి. హంగరీ రుథానియానంతను ఆక్రమించింది. హిట్లరు ముస్సోలినీలకు అభినందనలను, కృతజ్ఞతలను తెలియజేసింది.

జెకోస్లోవేకియాను హిట్లరు ఆధీనము చేసుకొన్నాడు.

హిట్లరు హంగరీ ఆక్రమణకు అడ్డు చెప్పక పోవడమేగాక ప్రేగు అధ్యక్షుడు డాక్టరు హచా, ప్రధాని బేరన్‌తో సంప్రదించి వారిచే ఒక ఒడంబడిక కాగితము మీద సంతకాలు చేయించాడు. ఇది ఒడంబడిక కాదు. దేశాన్ని బానిసత్వానికి అమ్ముకొన్న విక్రయ పత్రము ఎందుకంటారా ? ఆ పత్రములోని విషయాలివి :

1. జర్మను పటములో బొహిమియా, మొరోవియా అను రెండురాష్ట్రాలుగ మాత్రము చూపబడును.

2. ఈ రాష్ట్రాలు సైన్య ముంచుకోరాదు.

3. విదేశాలలో రాయబార వర్గాలుండవు.

4. దేశస్థులకు జర్మనీ ప్యాసుపోర్టు లుంటాయి.

5. స్వస్తికా జండా (జర్మనీ జండా) యే వీని జండా.

ఈ షరతులు దేశాన్ని అమ్ముకోవడం కాకపోతే మరేమిటి?



హిట్లరు

15వ రోజు ఉదయంనుండి జర్మను సైన్యాలు జెకొస్లోవేకియాను ఆక్రమించుకున్నాయి. ప్రేగు ప్రభుత్వము, నాజీ సేనలను ఎదుర్కోవద్దనీ జెకొస్లోవేకియా సైన్యము ఆయుధాలను వారికి

హిట్లరు తిరిగి యుద్ధ యాత్ర ఆరంభించాడు!

జెకోస్లోవేకియాను కబళించాడు: రుమేనియాకు అల్టిమేటము పంపాడు

వశముచేయమని, దేశమంతా శాంతంగా మును పటివలే తమతమ పనులు సాగించవలసినదని పదేపదే బ్రాడుకాస్టుచేసింది. జర్మనులు జెక్కు రాష్ట్రాలను ఆక్రమించుకున్నారు. మరుచటి రోజు స్లోవకు ప్రభుత్వము కూడ జర్మను రక్షణ అంగీకరించింది. నాజీసేనలో స్లోవకు దేశాన్నికూడ ఆక్రమించుకున్నాయి.

ఇంగ్లండు వైఖరి.

కామన్సుసభలో 15 వ తారీఖునే ఈ విషయమై చర్చజరిగింది. ఛాంబర్లేను "జర్మనీ ఇప్పుడు చేసేపని, మ్యూనిక్ ఒడంబడికకు వ్యతిరేకము. జర్మనుజాతికి చెందని రాజ్యాలను సైన్యముతో ఆక్రమించడము అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితులకు కారణమవుతుంది. ఇది చాల విచారకరము. కాని ఇటువంటి ఘటనల వలన మన మార్గాన్ని మార్చుకో కూడదు. మనపద్ధతి శాంతికోసం చాల అవసరము." అని తెలియజేశాడు. ఈదెను ఇతర ప్రజాతంత్ర దేశాలతోకలసి ఇట్టి దురంతాలను అరికట్టాలన్నాడు. కాని ఆర్థికమంత్రి సైమను, ఇట్టి ఘటనలు సమర్థనీయము కాకపోయిననూ, ఇతర దేశాలతో అట్టి సంప్రదింపులు ఆరంభించడమువలన మిలటరీఒడంబడికలు చేసుకోవలసి వస్తుంది. దానికి తాము తయారుగా లేమన్నాడు.

కాని దేశములో ప్రజాభిప్రాయము, కడకు ఛాంబర్లేను పార్టీలోనే తీరని అసంతృప్తి బయలుదేరింది. ఒక్కవారము రోజుల క్రితమే యూరోపులో ఎట్టి ప్రమాదము సంభవించదు. శాంతి వాతావరణము మునుపెప్పుడులేని రీతిగా ఉంది అని కామన్సుసభలో బ్రిటిషు మంత్రులు తెలియచేశారు. ఇంతలోనే ఇట్టి ఘటనలు జరిగినచో, బ్రిటిషు గూఢచారులేమయ్యారు? బ్రిటిషు మంత్రివర్గానికి ఈవిషయాలు ముందుగా తెలియలేదనుట, కేవలము అబద్ధము. ఎందుకంటే ఈఘటనలు జరుగుటకు నెలరోజుల ముందునుండియే యూరపులోని అమెరికా రాయబారులు ఇట్టి ప్రమాదము జరుగునని రూజ్‌వెల్టుకు తెలియజేస్తూనేవచ్చారు, అమెరికను రాయబారులకు తెలిసిన విషయము బ్రిటనుకు తెలియలేదనుట హాస్యాస్పదము. పైగా ఒక జర్మనుమంత్రి మార్చి 15 వ తారీకు ఏమి జరుగుతుందో చూస్తూ ఉండండి అని విదేశపత్రికా విలేఖరుల ముందు కొన్ని నెలలముందే ప్రేలాడు. హిట్లరు జనవరి 30 వ తారీఖున ఇచ్చిన ఉపన్యాసములో యూరపు ఆగ్నేయమూలలో తన హక్కులు గుర్తించాలి. దానికి అడ్డమువస్తారేమో జాగ్రత్త అని రేడియోలో హెచ్చరించాడు. ఆవార్తను పత్రికలలో ప్రకటించనివ్వలేదు ఛాంబర్లేను.


బ్రిటిషు ప్రభుత్వము, హిట్లరుకు యూరపు ఆగ్నేయమూలలో సంపూర్ణ స్వాతంత్ర్యమిచ్చి, అతని దృక్పథము కాలనీలనుండి తాత్కాలికముగానైనా మరల్చాలనీ ప్రయత్నిస్తూ వచ్చింది. ఇప్పుడు ప్రజాభిప్రాయము ముందు సమర్థించుకోడానికి తమకు ఈవిషయాలు ముందుగా తెలియవంటున్నారు. ఏమయినా ప్రజాభిప్రాయము, ఛాంబర్లేను ప్రభుత్వముచే, జర్మనీతో జరుగవలసిన వర్తకపు సంప్రదింపులను

అపుచేయించింది. జెకోస్లోవేకియాకు మునుపు ఇస్తామన్న అప్పును తాలూకా ఇంతవరకు ఇవ్వని డబ్బును ఇక ఇవ్వవద్దని బ్యాంకులకు నోటీసు పంపించింది. అంతేగాక ఛాంబర్లేను ఒక ఉపన్యాసము బర్మింగుహాములో ఇచ్చాడు. మ్యూనిక్ ఒడంబడికకు వ్యతిరేకంగా హిట్లరు ప్రవర్తించి నందుకు విలపించాడు. జెక్కులకు కెట్టి స్వాతంత్ర్యము లేనందులకు పరితపించాడు. జర్మను గూఢచారులు (గెస్టపో) జెక్కు దేశములో అప్పుడే అరెస్టులు; ఆరంభించింది. స్వయం నిర్ణయ సూత్రానికి హిట్లరు స్వస్తి చెప్పాడు. జర్మను సైనికులాండును సైన్యముతో నింపడము ఆస్ట్రియాను, సూడెటను ప్రాంతాన్ని వశపచ్చుకోవడములో ప్రపంచములో క్లిష్టపరిస్థితులు కలుగజేసినను, కొంతవరకు జర్మనీ నిర్యలను సమర్థించడానికి కొన్ని కారణాలయినా ఉండినయి. కాని జెకొస్లోవేకియాను పూర్తిగా ఆక్రమించడాన్ని ఏరీంగాను సమర్థించ జాలము. జర్మనీ యొక్క



ఈ నాటి దాని ఉద్దేశములను పూర్తి గావించుకోడానికి ఆఖరిదా లేక మరి ఇట్టి అనేక దాడులు సాగించడానికి ఇదిప్రారంభమా అనేదే ప్రశ్న. జర్మను ప్రపంచాన్నంతా తన ప్రాబల్యము క్రిందికి తేవాలని యుద్ధానికి కాలు దువ్వితే ఇంగ్లండు ఊరుకోదు. ఇంగ్లండు స్వాతంత్ర్యము పేరిట తప్పక పోరాడుతుందట.

జర్మనీ ఎన్ని దేశాలయినా ఆక్రమించవచ్చు. కాని బ్రిటనుయొక్క ప్రపంచ ఔన్నత్యాన్ని మాత్రము ముట్టుకోరాదు. అంతవరకు ఛాంబర్లేను తన విధానాన్ని మార్చుకోడనియే కదా ఈ భాషణ అర్థము?



ఇతరదేశాల వైఖరి.

అమెరికా ప్రభుత్వము జర్మనీ గావించిన ఈ దురంతాన్ని తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ చట్టాలను తృణీకరించే ఒక గూండా పనులని అన్నది. జర్మనీలో జెకొస్లోవేకియా ఒకభాగమని తాను అంగీకరించనన్నది.

ఫ్రెంచి దలదీరు ప్రభుత్వము, ఇదే సమయమునుకొని, తమకు సంపూర్ణాధికారా లివ్వమని ఒక చట్టాన్ని ఫ్రెంచి పార్లమెంటులో ప్రవేశ పెట్టింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు యెంత వ్యతిరేకించినా అది చట్టమయింది దాని క్రింద వారమునకు 40 గంటలు మాత్రము పని అనే చట్టాన్ని పూర్తిగా తొలగించారు డిక్రీలతో ఫ్రాన్సును పరిపాలించ సాగారు.

బ్రిటను, ఫ్రాంసులు జర్మనీ చర్య పట్ల తమ అసమ్మతిని తెలియచేశారు. హిట్లరు దానికిచ్చిన జవాబు. "ఈ అసమ్మతికి రాజకీయంగా గాని, అంతర్జాతీయ చట్ట రీత్యా గాని, లేక నైతికంగా చూచినా ఎట్టి కారణము లేదు పొమ్మ"న్నాడు. బ్రిటను ఫ్రాంసులు తమ రాయబారులను జర్మనీనుండి వెనక్కి పిలిచాయి. జర్మనీ ఆ దేశాల నుండి తన రాయబారులను వెనక్కి పిలిచింది.

జర్మనీ; రుమేనియాకు అల్టిమేటం పంపింది.

జర్మనీ కేవలము జెకొస్లోకియా ఆక్రమణతో తృప్తి చెందుతుందనుకోవడం వట్టి భ్రమ. జెకొస్లోవేకియాను ఆక్రమించుకోవడము, మరి యే దేశము పైననో యుద్ధము చేయుటకోసమే.

రుమేనియాకు జర్మనీ ఒక అల్టిమేటము పంపినదని వార్తలు తెలియజేస్తున్నాయి. అందులో,

1. రుమేనియా ఇకముందు ఎట్టిపరిశ్రమలు స్థాపించకూడదు. ఇప్పుడున్న ఫ్యాక్టరీలను కూడ త్వరలో మూసివేసి, కేవలము వ్యవసాయముమాత్రము కొనసాగిస్తూ ఉండాలి.

2. ధాన్యము, పెట్రోలు, కలప, పశువులు, ఆహారవస్తువులు పూర్తిగా జర్మనీకే ఎగుమతి చేయాలి. మరి యే దేశానికికూడ ఎగుమతి చేయకూడదు, అని తెలియజేయబడింది. వీనికి అంగీకరించినచో రుమేనియా స్వాతంత్ర్యాన్ని గ్యారంటీ చేస్తానని ప్రకటించింది. ఇవి అన్నీ అంగీకరిస్తే ఇక స్వాతంత్ర్య మేమిటో? రుమేనియా తన సైన్యాన్ని ప్రోగుచేసుకుంటూంది. సరిహద్దును బలపర్చుకుంటూంది. దేశములోని అన్ని పార్టీలు ఏకమయ్యాయి. ఇంగ్లండు, ఫ్రాంసు, రష్యాలు తనకు సహాయము చేస్తే, పోలెండును బాల్కను రాజ్యాలనుకూడ జర్మనీకి వ్యతిరేకముగా నిలబడేటట్లు చేయగలనని ప్రకటించింది.

కాని, జర్మనీ తనకు అల్టిమేటము ఇవ్వలేదనికూడ ప్రకటించింది. ఈవిధంగా ప్రకటించినచో జర్మనీ వెనుకకు మరలుటకు అవకాశాయుండునను ఆశ. జర్మనీకూడ కొంత వెనక్కి తాత్కాలికంగా తగ్గినట్లూహించవచ్చును. రుమేనియాతో ఒకవిధమైన వర్తకపు ఒడంబడిక. తాను కోరినరీతిని గాకపోయినను దానిలో చాల భాగమైనా వచ్చురీతిని కుదురుతుందని ఆశించి ఉంది.

ఇంగ్లండు, ఫ్రాంసు, రష్యాలు, వానికితోడు అమెరికాకూడ వెంటనే తనకు వ్యతిరేకముగా యుద్ధానికి దిగుతాయేమోనని కొంత భీతికూడ ఉండవచ్చు. ప్రపంచములోని శాంతిశక్తులు కడకు బ్రిటిషు ప్రభుత్వాన్నికూడ తన దృక్పథాన్ని కొంతవరకు మార్చుకొనేటట్లు చేస్తున్నాయి. అంతేగాక, రుమేనియా యొక్క ఆయిల్ (పెట్రోలు) ధాన్యము అంతా జర్మనీకి పోతే; జర్మనీ బలము మరింత పెరుగును. దానితోను, స్పెయినులో ఫ్రాంకో విజయము పిదప ఇటలీ జర్మనీలకు మధ్యధరా సముద్రములోని ప్రత్యేక స్థానము రావడముతోను ఇంగ్లండు ఫ్రాంసులకు పూర్తిగా అపాయకరమని ఇంగ్లండు ఫ్రాంసులలోని పెట్టుబడిదారీ పరిపాలకులలోనే చాల మందికి సందేహము కలిగినది.

కాని జర్మనీ ఆగుతుందనే నమ్మకము లేదు ఆర్థికస్థితి చాల దుర్భరముగా ఉంటచే ఇట్టి యాత్ర సాగించిన జర్మనీ, తన ఆర్థికస్థితి తాత్కాలికంగా నైనా బాగుపడడానికి కావలసిన వసతులేర్పడే వరకు ఆగుతుందను కోవడము పొరపాటు.

రుమేనియా తనతో సంతృప్తికరమయిన ఒడంబడికకు ఒప్పుకొనకపోతే; హంగరీ ద్వారా రుమేనియాపై దండెత్తించవచ్చు. తానువెనక నుండి సహాయము చేయవచ్చు.

జర్మనీ భవిష్యత్తు.

మెమిలులో నాజీలు. లిథూనియా ప్రభుత్వం తమ ఆర్థిక స్థితిని ఏమాత్రము బాగుచేయలేదు కాబట్టి జర్మనీతో మెమిలును కలిపివేయాలని పట్టుపట్టుతున్నారు. లిథూనియా విదేశాంగ మంత్రి జర్మనీకి వెళ్లాడు వీని విషయము మాట్లాడడానికి. మెమిలు త్వరలో జర్మనీతో కలసిపోతుందనుకో వచ్చు.

జర్మనీ రష్యాపై యుద్ధానికి దిగుతుందా లేక కాలనీలకోసం బ్రిటనుతో కయ్యానికి కాలు దువ్వుతుందా అనే ప్రశ్నకు జవాబు చెప్పుట చాల కష్టము.

రష్యా, జర్మనీ దురంతాన్ని ఖండిస్తూ ఒక తీవ్రప్రకటనను జర్మనీకి పంపినది. "జెకోస్లోవేకియా ఏర్పడినది లగాయతు అంతమొందే వరకు, దేశములో శాంతి, విదేశాలలో సామరస్యనీతిని అవలంబించినది. అట్టి దేశములో అల్లరులు జరుగుతున్నాయని అందుచే ఆక్రమించాల్సిన అవసరం కలిగిందనుటలో అర్థము లేదు. వందలకొలది సంవత్సరాలు తమ స్వాతంత్ర్యముకోసం పోరాడిన ప్రజలు తమస్వాతంత్ర్యాన్ని కావాలని అమ్ముకొన్నారనుట విశ్వసించము. జర్మనీ నిరంకుశంగా సైన్యముతో జకొస్లోవేకియాపై దాడి వెడలి ఆక్రమించుకుంది. ఈ ఆక్రమణను మేము గుర్తించము. ఇట్టి ఆక్రమణమూలంగా యూరపులో అశాంతిని, యుద్ధాన్ని ఎక్కువచేసింది జర్మనీ."



ఛాంబర్లేను

రష్యాయొక్క ఈప్రకటన జర్మనీని మరింత రెచ్చగొట్టవచ్చు. అంతేగాక జపాను, చేపలు పట్టుకొనే హక్కుకోసం, రష్యాతో యుద్ధము గావించడానికి 40000 మంది సైన్యాన్ని గత వారము మంచూకో సరిహద్దులకు పంపియుంది. అంతేగాక, జర్మనీయొక్క ఈమెత్తు, రష్యాపై దాడి సల్పడానికేనని జపాను పత్రికలు వ్రాస్తున్నాయి.

కాని రష్యాపై యుద్ధము గావించాలంటే, ముందు రుమేనియాను ఆక్రమించుకోవాలి. కనీసము, రుమేనియా హిట్లరు బంటుఅయినా కావాలి. అంతేగాక పోలండు కూడా తాను చెప్పినట్లు మరుమాటాడక యుద్ధములో పాల్గొనాలి. లేక పోలెండును కూడ ఆక్రమించుకోవాలి. ఈ పనులు పూర్తికాక మునుపు రష్యాపై దండెత్తడము పూర్తిగా వినాశకరము.

జర్మనీ బ్రిటనుతోకూడా ఘర్షణపడుతూఉంది. బ్రిటను తనప్రస్తుత జర్మనీ వ్యతిరేకదృక్పథాన్ని వదులుకోకపోతే నౌకా ఒడంబడికను రద్దుచేస్తామని జర్మనీ ప్రకటిస్తూ ఉంది. జర్మనీ బ్రిటనును బెదరించి, రుమేనియా పోలండులను తన ప్రాబల్యము క్రిందికి తీసుకొని వచ్చుటకు ఒప్పించవచ్చు. యూరపులో తన అధికారము ఈ విధంగా స్థాపించిన పిమ్మట, రష్యాపైనా లేక బ్రిటను ఫ్రాంసులపైనా యుద్ధము చేయుట యని నిర్ణయిస్తుంది. కాని ఈ వ్యవధి కూడా కావాలంటే జర్మనీకి రుమేనియా పోలండులను అప్పజెప్పడమేగాక, ఇటలీకి ఉత్తరాఫ్రికాలోను, ఫ్రెంచి సోమాలిలాండులోను సౌకర్యాలు ఫ్రాంసు కలుగచేయవలసి ఉంటుంది

బ్రిటను, ఫ్రాంసు పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఇప్పటికైనా జర్మనీ ఇటలీల నరికట్టడానికి రష్యా అమెరికాలతో కలుస్తాయా? లేక తమ ధోరణిని కొనసాగిస్తాయా? బ్రిటను ఫ్రాంసులలోని ప్రజాశక్తి, బ్రిటను ఫ్రాంసుల అధీనములోనున్న దేశాలలో ప్రజాతిరుగుబాటులు విజృంభించి ప్రస్తుతమున్న ఛాంబర్లేను, దలదీర్ల ప్రభుత్వాలను తొలగించ కలిగితేనే, ఇది సాధ్యమగుతుంది.

కాళీపట్టణదినోత్సవం 25 వ తేదీ జరుపండి

కాళీపట్టణములో రైతులు తమకున్న అనాది సిద్ధమైన హక్కులను రక్షించుకొనుటకు గావించిన సత్యాగ్రహమును కొనియాడుచూ ఆ సందర్భమున కృషి చేయుచున్న పార్టీ సభ్యులను, అరెస్టు గాబడిన రైతు సోదర సోదరీమణులను అభినందించుచున్నాము.

స్థానిక పోలీసు వుద్యోగస్థులు సత్యాగ్రహ సందర్భమున శాంతియుతముగా యున్న రైతులపై తీవ్రమైన లాఠీచార్జీయు, అమానుష చర్యలు, అరెస్టులు గావించినందులకు వారి చర్యలను తీవ్రముగ ఖండించుచూ అట్టి చర్యలకు బాధ్యులయిన పోలీసులపైనను, ఉద్యోగస్థులపైనను తగిన చర్య గైకొనవలెనని కాంగ్రెసు మంత్రివర్గమును కోరుచున్నాము.

కాళీపట్టణ రైతుల పోరాటము కోర్కెల యెడల సానుభూతి వెలిబుచ్చుచు వారి కోర్కెలను వెంటనే జమీందారు తీర్చునట్లు, అరెస్టుగాబడ్డ రైతులపై ఉన్న కేసులన్నీ ఉపసంహరించుకొని ఎట్టి షరతులు లేకుండా విడుదల చేయుటకు కాంగ్రెసు మంత్రివర్గము త్వరలో పూనుకొనునట్లు రాష్ట్రమంతటా యీనెల 25 వ తేదీన సభలు గావించి ఆందోళన సాగించుటకు పార్టీ సభ్యులు కృషి చేయవలెను. గ్రూపులతోను, తరువాతను అరెస్టుగాబడ్డ కుటుంబముల ఆర్థిక సహాయ నిమిత్తమై చందాలు గూడ వసూలు చేసి పంపవలెను.

—ఆంధ్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ తీర్మానము

తిరువాన్కూరు దివాన్ వాచాలత

తిరువాన్కూరు సంస్థానంలో తిరిగి సత్యాగ్రహం సాగించాలని స్టేటు కాంగ్రెసు నిర్ణయించినప్పటినుండీ దివాన్ సి. పి. రామస్వామి అయ్యంగారికి ఆగ్రహం ఎక్కువైనట్లు కనబడుతోంది. 13 వ తేదీ తిరువాన్కూరు పోలీసు ప్రదర్శనంలో కాంగ్రెసు మీద, గాంధిగారిమీద దుమ్మెత్తి పోశాడు. కాంగ్రెసు నాయకత్వం జర్మనీలో నాజీల డిక్టేటరు షిప్పు లాంటిదట. సంస్థాన పోరాటాలతో కాంగ్రెసు సంబంధము పెట్టుకోవడం, దాని మూల సిద్ధాంతమయిన అహింసా విధానాన్ని భగ్నపరచటమేనట. గాంధిగారి సలహాలు తన సంస్థాన ప్రజలు వినడానికి ఆయన శాశ్వతమా అంటున్నాడు, అక్కడికి తన దివాన్‌గిరి శాశ్వతమైనట్లు. పైగా 50 ఏండ్లనుంచి రాజ్యాంగ సంస్కరణల కోసం పోరాడే కాంగ్రెసుకే దిక్కులేకపోతే నిన్న మొన్న కళ్లు తెరచిన సంస్థాన ప్రజలకి అప్పుడే బాధ్యతాయుత ప్రభుత్వ మెందుకు అంటున్నాడు. అదిగాక తన సంస్థాన ప్రజలు ధర్మమూర్తియైన తమ ప్రభువుగారు చెప్పినట్లు నడచుకోవాలిగాని బైటవారి మాటలు విన కూడదని హితబోధ చేశాడు. తన దివాన్‌గిరి వచ్చినప్పటినుంచీ, లాఠీ దెబ్బలతోటి, తుపాకి కాల్పులతోటి, రౌడీల రాక్షస కృత్యాలతోటి తామెంత సుఖపడుతున్నారో ప్రజలకు తెలియదూ? ఈ మంత్రి శేఖరుని మేధస్సును మెచ్చే కాబోలు రాజకోట థాకూర్ సాహెబు, ఫెడరల్ జడ్జిముందు తమ దౌష్ట్యాలను సమర్థించడానికి వీరిని కోరాడు. కాని వీరు నిరాకరించారని తెలుస్తోంది.

సత్యాగ్రహ సన్నాహాలు.

ఈనెల 25 వ తేదీనుండి ప్రారంభింపనున్న సత్యాగ్రహోద్యమానికి స్టేట్ కాంగ్రెసు చురుకుగా సన్నాహాలు చేస్తూంది. బహిరంగ సభలు, తాలూకా సభలు, గ్రామాలలో ప్రచారం మొదలయినవి జరిపి ప్రజలను సిద్ధం చేస్తున్నారు. 14 వ తేదీని అల్లెపీలో పెద్ద బహిరంగ సభ జరుపబడింది. కాంగ్రెసు నాయకుడయిన జోసఫ్ పన్నురాన్, సత్యాగ్రహ కార్యక్రమాన్ని తెలియపరుస్తూ ప్రజలను ఉద్బోధించాడు.

స్టేట్ కాంగ్రెసు అధ్యక్షుడు ఒక స్టేట్‌మెంటును ప్రకటించాడు. దానిలో గాంధిగారి సలహాపై ఆరోపణలు ఉపసంహరించుకొన్నప్పటికిని, ఉద్యమం ఆపినప్పటికిని ప్రభుత్వ వైఖరిలో ఏవిధమైన మార్పు కనపించకపోవడం, (పత్రికలపై నిషేధం తొలగింపబడలేదు. పోలీసు కాల్పులను గురించి విచారణ అయినా జరపలేదు) వల్లను తాము సత్యాగ్రహం సాగించవలసి వస్తోందని ప్రకటించాడు.

16 వ తేదీని త్రివేంద్రం తాలూకా మహాసభ, స్టేట్ కాంగ్రెసు అధ్యక్షుడయిన పట్టంతానుపిళ్ళె అధ్యక్షతను జరిగింది. సత్యాగ్రహ కార్యక్రమాన్ని గూర్చి ప్రజలకు తెలియజేశాడు.

స్టేట్ కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడయిన జాన్ ఫిలిప్పోస్ గారు ఈ సత్యాగ్రహం విషయమై ఢిల్లీ వెళ్ళి గాంధీగారితో సంప్రదించి వచ్చారు.

దివాన్‌కు బహిరంగలేఖ

12 వ తేదీన త్రివేంద్రంలో జరిగిన పోలీసుప్రదర్శనం ... చేసిన ఉపన్యాసంవల్ల ప్రజలలో అశాంతి ఎక్కువౌతూందని, జి. రామచంద్రన్ గారు దివాన్‌కు ఒక బహిరంగ లేఖ వ్రాసినట్లు తెలుస్తూంది.

మైసూరు

మైసూరులో హామిల్టన్‌బిల్డింగు సత్యాగ్రహం చినికి చినికి గాలివానలాగ తయారవుతూ వుంది. హామిల్టన్, పూర్వం మైసూరుసంస్థానంలో ఒక పోలీసు ఆఫీసరు. కడు దుర్మార్గుడు. ప్రజలను నానాహింసలు పెట్టేవాడు. మైసూరులో అతని గౌరవార్థం ఒక భవనము నిర్మింపబడింది. స్టేట్ కాంగ్రెసు ఈ భవనము వద్ద సత్యాగ్రహము చేయడానికి నిశ్చయించారు. హామిల్టన్ బిల్డింగు సత్యాగ్రహ కమిటీ ఒకటి ఏర్పడింది. సత్యాగ్రహము ప్రారంభమై ఇప్పటికి నెలరోజులయింది. మొదట, రోజుకు ఇద్దరు చొప్పున వాలంటీర్లు వెళ్ళి సత్యాగ్రహము చేయడము సాగించారు. కాని ఈ నెల 13 వ తేదీనుండి సత్యాగ్రహం తీవ్రరూపం దాల్చింది. వాలంటీర్లు వచ్చేసమయానికి భవనం వద్ద చాలమంది ప్రజలు గుమిగూడడం ప్రారంభించారు. 13 వ తేదీని 10 మంది సత్యాగ్రహులను పోలీసులు అరెస్టు చేశారు. వాలంటీరు కెప్టెనుకు రు. 10 లు, మిగతా వారికి రు. 2 లు జుర్మానా విధించారు. చెల్లించ నిరాకరించినందున 5 రోజులు శిక్ష విధించారు. 14 వ తేదీని

సంస్థానాలు

లక్ష్మీదేవమ్మ అను 60 ఏండ్ల స్త్రీ సత్యాగ్రహ దళాన్ని నడిపింది. ఆమెను వదలిపెట్టి, 10 మంది వాలంటీరులను అరెస్టు చేశారు. ప్రభుత్వం శిక్షలుకూడ ఎక్కువ జేసింది. వారిలో ఒకరికి రు. 225 లు జుర్మానా లేక 5 నెలల ఖైదు, మిగతావారికి రు. 200 లు జుర్మానా లేక 2 నెలలు శిక్ష విధింపబడ్డాయి. డిక్టేటరు సుబ్బారావు ఉపాధ్యక్ష- సత్యాగ్రహ కమిటీ సభ్యుడగు ఎ. యన్. సూర్యనారాయణరావు గార్లను ప్రభుత్వము అరెస్టు చేసింది. అయినా సత్యాగ్రహము ఆగ లేదు. ప్రతిరోజు 5 లేక 10 మంది చొప్పున సత్యాగ్రహం చేస్తూనే వున్నారు.

రిఫారమ్సు కమిటీ

ఇదివరలో నియమింపబడిన మైసూరు రాజ్యాంగ సంస్కరణల సంఘం ఈనెల 12 వ తేదీనుండి 17 వ తేదీవరకు చర్చలు సాగించారు. చర్చలు మళ్ళీ 27 వ తేదీకి వాయిదా వేశారు. వారి లక్ష్యం ఇంకా ఏమీ నిర్ధారించబడలేదు, రిపోర్టు ఎప్పుడు ప్రకటిస్తారో తెలియదు. ఈ కమిటీకి నియమింపబడిన యిరువురు కాంగ్రెసువారు ఇదివరకే రాజీనామా నిచ్చియున్నారు.

పాటియాలా

పాటియాలా సంస్థానంలోకూడ నిర్బంధ విధానం మెల్లి మెల్లిగా సాగుతూనే ఉంది. ఈ నెల 14 వ తేదీని పాటియాలాలో ఒక బహిరంగసభలో పోలీసులు లాఠీచార్జి చేశారు. 17 వ తేదీని ప్రజా మండలి అధ్యక్షుడు సర్దార్, నరహరిసింగు, ఉపాధ్యక్షుడు భగత్ సింగు, కార్యదర్శి బిషన్‌దాస్‌గార్లను 1938 వార్తా నిబంధనల నుల్లంఘించారని అరెస్టు చేశారు.

సంస్కరణలు.

పాటియాలా సంస్థానంలో ప్రవేశపెట్టబడే సంస్కరణల విధానాన్ని ఇప్పటికి సంస్కరణ సంఘంవారు ప్రకటించారు. ఈ నూతన రాజ్యాంగ విధానం ప్రకారము, 41 మంది సభ్యులు గల ఒక లెజిస్లేటివ్ ఎస్సెంబ్లీ ఏర్పాటు చేయబడుతుంది. దీనిలో 21 మంది ఎన్నిక సభ్యులు, 20 మంది ప్రభుత్వంచే నియమింపబడినవారు వుంటారు. అందులో 12 మంది సంస్థానోద్యోగులు 8 మంది ఇతరులు వుంటారు. జాయింటు నియోజక వర్గాలనుండి యే ఎన్నికలు జరగాలి. వివిధ సంఘాలకు సీట్లుకూడా వుంటాయి. జాగీరు గ్రాంట్లు, ధర్మ సంస్థల గ్రాంట్లు, విదేశాంగ వ్యవహారాలు వీటిపై అస్సెంబ్లీకి అధికారముండదు. అస్సెంబ్లీలో నుండి ఒక మంత్రిని, ఇద్దరు కార్యదర్శులను, ప్రెసిడెంటును సంస్థానంవారే నియమిస్తారు. ఉపాధ్యక్షుని మాత్రం ఎస్సెంబ్లీ ఎన్నుకోవచ్చు.

ప్రజలీ సంస్కరణలతో సంతృప్తిపడినట్లు తోచదు. ఎస్సెంబ్లీ సభ్యత్వాలన్నిటికి బహిరంగ ఎన్నికలు జరగాలని వారి కోరిక రాజా నిర్ణయం ఇంకా బయట పడలేదు.

కాశ్మీరు

కాశ్మీరు సంస్థానంలో కొత్తగా అమలుజరుపబోయే రాజ్యాంగ సంస్కరణలు ఏమిటో ప్రకటింపబడింది. ఇప్పటి ఎసంబ్లీ ఈ సంవత్సరం ఆగస్టు 15 వ తేదీతో అంతమొందుతుంది. కొత్త ఎసంబ్లీ శ్రీనగర్‌లో సమావేశమౌతుంది. దీనిలో అధికంగా 16 గురు కౌన్సిలర్లు వుంటారు. వారిలో 9 గురిని రాజాయే నియమిస్తాడు. ప్రెసిడెంటును కూడ రాజాయే నియమిస్తాడు. డిప్యూటీ ప్రెసిడెంటును మాత్రం ఎసంబ్లీకి ఎన్నుకోవచ్చు. అయినా ఆయన కివ్వవలసిన గౌరవ వేతనాన్ని రాజాయే నిర్ణయించుతాడు.

టాల్చేరు

టాల్చేరు సంస్థానంలో నిర్బంధ విధానం యింకా సాగుతూనే ఉంది. ప్రజామండలి ప్రచారకులగు మగుని ప్రధాన్, గణేశ సామంతరాయ్ గార్లను ఎక్స్ట్రాస్ డిషన్ ఆక్టు 431, 409, 427 సెక్షన్ల ప్రకారం అరెస్టుచేశారు. ఇదివరలో పోలీసుల దుండగాలు భరింలేక సంస్థానం విడిచిపెట్టి పోయిన 30 వేల ప్రజలవద్దకు వెళ్లి కొత్తగా ఏర్పరుపబడిన ఒరిస్సా పొలిటికల్ ఏజంటు మెట్కాఫ్ సి. యల్. సరల్, వారిని తిరిగి సంస్థానంలోనికి రావలసిందంటూ కోరాడు. వారు, ఇదివరకు ఖైదు చేసినవారి నందరిని విడుదలచేసి, తమ కెట్టి హాని కలిగించమని రాజా వ్రాతమూలకంగా హామీ యిస్తే వస్తామన్నాడు.

ఒరిస్సా సంస్థానాల విషయమై హరికృష్ణమోహతాబ్‌గారు గవర్నరుతో చర్చించారని తెలుస్తూంది.

కాకినాడ పీచు పనివారల సమ్మె

కాకినాడలో నార పరిశ్రమ ముఖ్య పరిశ్రమల్లో ఒకటి. ఈపరిశ్రమలో పనిచేసే కూలీల గుండెలు తప్పకుండా పాడవుతవి. పూర్వము తాటి నార వర్తకులు, ఒక్కొక్కకూలీకి 112 పౌనులకి రు. 1—8—0 నుంచి 3 రూపాయల వరకూ ఇచ్చేవారు. నాలుగు సంవత్సరాల క్రితం, కాకినాడ తాటినార వర్తకులు ఏకమయి తమ సంఘాన్ని స్థాపించుకున్నారు. అయినా ఈ వర్తకులు ఒకరితో నొకరు హద్దు లేని పోటీ చేసుకొని, తక్కువ ధరలకి, నార ఇతర దేశాలకి ఎగుమతి చేయడము సాగించారు. అందువల్ల తమ లాభాన్ని కూడ దీసుకునేందుకు, కూలీలకి ఇచ్చే కూలిని దారుణముగా 4 నుంచి 5 రెట్లుదాకా తగ్గించేశారు.

కూలీల కష్టాలు

ఈ మూడు నాలుగు సంవత్సరాలనుంచీ, కూలీలు అలాగే పనిచేస్తూ వచ్చారు. దినము అంతా, ఒక్క కుటుంబం అంతా, చెమట ఓడుస్తూ, రెక్కలు ముక్కలయ్యేలాగ పని చేస్తున్నా, మనిషికి ఇప్పుడు 0—1—0 కంటె ఎక్కువ కూలీ ముట్టడం లేదు. వర్తకుల ఈ చర్యను సహించలేక కూలీలంతా కలిసి ఒక సంఘాన్ని స్థాపించుకున్నారు. ఫిబ్రవరి 24 వ తేదీని పీచు పనివాళ్ల సాధారణ సమావేశం జరిగింది. కార్మికుల యీ దిగువ కోర్కెలను, తెలియజేస్తూ, కాకినాడ ప్రతి కంపెనీ నార వర్తకునికి, 25 వ తేదీని యూనియను ప్రతులు పంపింది.

పీచు పనివారల కోర్కెలు

1. (a) కోరనార దువ్వి, మోపువేసి, యెండబెట్టి, సైజు కట్టినందుకు 112 పౌనులకి రు 1-6-0 లు యివ్వాలి.

(b) ఆర్డినరీ పొడిది మోపువేసి, ఉరిమి, యెండబెట్టి, సైజు కట్టినందుకు 112 పౌనులకు రు 0-12-0 యివ్వాలి.

(c) ఆర్డినరీ పన తడిపి మోపువేసి ఉరిమి,యెండబెట్టి, సైజు కట్టినందుకు 112 పౌనులకు రు 0-14-0 యివ్వాలి.

(d) సుపీరియర్ పన దువ్వి. మోపువేసి ఉరిమి, యెండబెట్టి, సైజు కట్టినందుకు 112 పౌ॥ రు 1-0-0 యివ్వాలి.

(e) చాపల్లు బొండాలు దువ్వి మోపువేసి, ఉరిమి, యెండబెట్టి. సైజు కట్టినందుకు 112 పౌ॥ రు 1-4-0 యివ్వాలి.

(f) నల్లనార పారముజల్లి, పనబెట్టి, దువ్వి, మోపువేసి, ఉరిమి, యెండబెట్టి, దువ్వి సైజుకట్టినందుకు 112 పౌ॥ రు 2-8-0 లు యివ్వాలి.

(g) బొండునార, రంగువేసినది, పారముజల్లి, పనపెట్టి, దువ్వి, మోపువేసి, ఉరిమి, యెండబెట్టి, దువ్వి, సైజు కట్టినందుకు 112 పౌ॥ రు 3-0-0 లు యివ్వాలి.

(h) నల్ల నార మోపు వేసి, ఉరిమి, దువ్వి, మళయాళము సైజుకి కట్టినంగులకు 112 పౌనులకు రు. 1—12—0 లు యివ్వాలి.

(i) రంగు వేసిన నల్లనార తిరిగి దువ్వి, సైజు కట్టినందుకు 112 పౌనులకు రు. 1—0—0 లు ఇవ్వాలి

(j) రంగు నల్లనార, రంగు బొండునార కలిపి పారంజల్లి పనబెట్టి, దువ్వి సైజు కట్టినందుకు 112 పౌనులకు రు. 1-0-0 లు ఇవ్వాలి.

(k) రంగువేసినది యెండబెట్టి, దువ్వి మళయాళము సైజు కట్టినందులకు 112 పౌనులకు 12 అణాలు యివ్వాలి.

(l) తాటి యీనెలు మోపు వేసి, ఉరిమి, సైజు కట్టినందులకు 112 పౌనులకు రు. 0-6-0 లు ఇవ్వాలి.

(m) (1) 7 అంగుళములు పైదానికి కట్ చేసినందులకు (సరకు 1 కి) టన్ను 1 కి 3 రూ॥లు ఇవ్వాలి.

(2) 7 అంగుళములు లోపు $4\frac{1}{2}$ అంగుళములు దాటిన కట్ 1 కి టన్ను 1 కి 6 రూ॥లు యివ్వాలి.

(3) 4 అం॥ లోపు $2\frac{1}{2}$ అంగుళములపై కట్ 1కి టన్ను 1 కి రు. 12—0—0 లు యివ్వాలి.

(n) రేజా నరికి తూనిక వేసినందులకు 112 పౌ॥ లకు రు. 0-2-0 లు యివ్వాలి.

(o) (1) కటింగు అయిన నార 7 అంగుళముల పైన పిడి కట్టు కట్టి రేజా నరికి తూనిక వేసినందులకు 112 పౌనులకు రు. 0-4-0 యివ్వాలి.

(2) కటింగు అయిన నార 7 అం॥ లగాయితు 5 అం॥ల వరకు యున్నది పిడి కట్టుకట్టి, రేజా నరికి తూనిక వేసినందులకు 112 పౌనులకు రు. 0-5-0 లు యివ్వాలి.

(3) కటింగు అయిన నార 4 అం॥ లగాయితు $2\frac{1}{2}$ అం॥ వరకు యున్నది పిడి కట్టు కట్టి రేజా నరికి తూనిక వేసినందుకు 112 పౌనులకు రు. 0.10-0 లు యివ్వాలి.

(p) రంగు నల్లనార సైజు ఎంచినందుకు టన్ను 1 కి రు. 1-0-0 లు యివ్వాలి.

(q) బుట్ట కావు వేసినందుకు పుట్టి 1 కి 0-4-6 లు చొ॥ యివ్వాలి.

2. ఎట్టి కమీషను గాని, కొట్టు తరుగు గాని, తీసి వేయకుండా తయారు అయిన సరకు సరియైన తూనిక ప్రకారం 112 పౌనులకు మాత్రమే తూచుకోవాలి. ఎప్పుడు నార తయారు చేసి వప్పచెప్పితే అప్పుడే పూర్తి కూలి యివ్వాలి.

3. కమీషనులు గాని, మేస్త్రీకి గాని, ధర్మం గాని, పాకీమనిషికి గాని, విద్యార్థికి గాని మరి యేయితరకారణములు చెప్పి ఎట్టి కమీషను తీసుకోరాదు.

4. వెట్టి చాకిరీలు మానెయ్యాలి.

5. రంగు వేయుటకై ఉడకబెట్టుటకు టాంకు 1 కి రు. 1-8-0 లు యివ్వాలి.

6. బజారు క్లీనుకు హండ్రడ్‌వెయిటు 1 కి రు. 0-10-0 లు యివ్వాలి.

రాయబారాలు

పీచు పనివారి సంఘాధ్యక్షుడు, మార్చి 1 వ తేదీని, వర్తకుల సంఘంతో, మాట్లాడి త్వరగా సమాధానం యిమ్మని కోరాడు. 5 వ తేదీకి తెలియచేస్తామని, వర్తక సంఘం చెప్పి, 6 వ తేదీని తిరిగి 8 వ తేదీ వరకూ, సమాధానం యిచ్చేందుకు గడువు యిమ్మని కోరింది. పీచు పని సంఘాధ్యక్షుడు యిలా వాయిదాలు వేయివద్దని యజమానులకు హెచ్చరిక యిచ్చాడు.

సమ్మె ఆరంభం

8 వ తేదీ 12 గంటలు వరకూ, కూలీలు, ఎంతో వోపికతో, సమాధానం కోసం చూచారు. చివరకి కంపెనీల దగ్గరనుంచి సరిగ్గా సమాధానం రాక పోవడము మూలాన్ని, సమ్మె డిక్లేరు చేశారు. పెద్ద సభ వెంటనే జరిగింది. 1000 మంది ఆడకూలీలు మగ కూలీలు సమ్మెలో చేరారు. 2 రు స్త్రీలు సభలో లేచి గంభీరంగా హెచ్చరిస్తూ యేమైనాసరే సమ్మె జయం పొందేదాకా సాగించాలి అంటూ ఉపన్యసిస్తూ, కూలీ హృదయాల్ని కుదుపేశారు. కామ్రేడ్ కృష్ణారావుగారు సమ్మెదారుల్ని ఉద్బోధిస్తూ, యీ అగ్నిపరీక్షకి ధాటీగా నిలబడాలని హెచ్చరించారు. కామ్రేడ్ కొరపాటి సమ్మె కమిటీలని, వాలంటీర్లనూ, ఏర్పాటు చేస్తూ, ఒక్క కూలీనికూడా దొడ్డిదారిని ప్రవేశించనీయకూడదనీ, ప్రతీ కూలీకూడా, తమ కష్టాల్ని, దోచుకుంటూన్న కంపెనీలు లొంగి కూలీ హెచ్చించేవరకు సమ్మె సాగించాలని చెప్పారు. ఇంకా చాలమంది కామ్రేడ్స్ కూడా వచ్చి సమ్మె దిగ్విజయంగా సాగించేటందుకు పని చేస్తున్నారు.


ప్రచారం ఊరేగింపులు

ప్రతీ కూలీ పేటలోనూ, ప్రతి దినం సభలు జరుగుతూన్నవి. ప్రతి దినం కరపత్రాలు పంచిపెట్టబడుతూన్నవి, స్త్రీ కూలీలు ముఖ్యంగా సభల్లో ఉపన్యసిస్తూ కూలీలకి గంభీరమైన హెచ్చరికల నిస్తున్నారు. వాలంటీర్లు చుట్టుప్రక్కల పల్లెలకు పోయి పీచు పని వాళ్ళ సమ్మెజరుగుతూన్న సందర్భాల్ని తెలియజేస్తూ, కూలీల కుండ పడగొట్టవలదని హెచ్చరిస్తూన్నారు. ప్రతీ కంపెనీవద్ద పికెటింగు జోరుగానూ, శాంతంగానూ సాగుతూంది. ప్రతి దినం వందలకొద్దీ స్త్రీ కూలీలూ, పురుష కూలీలూ ఊరేగింపులో చేరి వీధుల్ని, పట్టణ మూల మూలకి, కూలీ నినావాలతో మారుమ్రోగిస్తున్నారు, 4 సంవత్సరపు కూలీ బిడ్డకూడా, "కూలీ సంఘానికి జై" "ఎర్ర జండాకి జై" అంటూ సమ్మె వుత్సాహంతో మారుమ్రోగిస్తున్నారు. ఎర్ర జండాలతో, ప్లెకార్డ్సుతో ప్రతీ కంపెనీ ముందు ప్రదర్శనాలు జరుపుతున్నారు.

వర్తకసంఘంలో చీలిక

సమ్మె యింత ఉత్సాహంగా, శాంతంగా, పట్టుదలగా సాగుతూన్నా, కూలీల కోర్కెల్ని యేమాత్రము లెఖ్ఖ చేయమంటూ, వర్తకులు మొండిగా కూర్చున్నారు. తడిసిపోయిన తాటినార గుట్టలు గుట్టలుగా కంపెనీలలో పడి ఉంది. మూట కూలీల్ని పనిలోనికి వర్తక సంఘం దొడ్డిదారిని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించింది, కాని వర్తక సంఘానికి బుద్ధి చెప్పే లాగ, "మా కూలీ సోదరుల తిండి పడగొట్టం" అని వారు జవాబిచ్చారు. పే. రామారావు గారు అనే తాటినార వర్తకులు కూలీసంఘపు కోర్కెల్ని అన్నీ అంగీకరిస్తున్నానని తెలియజేశాడు, ఆయన పనికి మాత్రము సమ్మెలేదు. యీ వర్తకసంఘంలో 5 గురు మాత్రమే పెద్ద వర్తకులు. మిగతా 20 మంది చిన్న వర్తకులు. చిన్న వర్తకులంతా కలసి, కో ఆపరేటివ్ పీచు కొని అమ్ము యూనియన్ ను పెట్టుకొని కూలీ షరతులకు ఒప్పుదల కావడానికి సిద్ధముగా ఉన్నట్టు తోస్తుంది. కంపెనీ యూనియనులో, ఇలాంటి చీలిక ఉన్నందున, సమ్మె తీవ్రత వలనను త్వరలో వర్తకులు లొంగవచ్చును.

పేటలలో చురుకయిన ప్రచారం జరుగుతూంది. సమ్మె తప్పకుండా జయం పొంది తీరుతుంది.



సోవియట్ విదేశ రాజనీతి

(7 వ పేజీ తరువాయి)

4. ప్రజాస్వామ్య దేశాలతో అనేకవిధము లైన సంధులు చేసుకొని, దాడుల నరికట్టు సంధుల ననేకం చేసికొని, నిజమైన శాంతి పద్ధతిని వెల్లడించిన దేశం సోవియట్ రష్యా.

5. ఇటలీ, అబిసీనియా యుద్ధసమయాన, ఫాసిస్టు ఇటలీకి వ్యతిరేకంగా శాంక్షన్సు ప్రయోగించి అబిసీనియా జాతిగౌరవమును కాపాడవలెనని గర్జించిన దేశం, సోవియట్ రష్యా.

6. స్పెయిన్ ప్రజాప్రభుత్వము పట్ల, ఛేంబర్లేను, హిట్లరు, ముస్సోలినీలు పన్నుకుట్ర పన్నాగాలను ఎదుర్కొనుచు, స్పెయిన్ పతనమే ప్రపంచ పతనమనియు, స్పెయిను విజయమే ప్రపంచ విజయమనియు ఎలుగెత్తి ప్రపంచానికి చాటుతూన్న దేశం సోవియట్‌రష్యా.

7. ప్రస్తుతం చైనాపట్ల జపాన్ గావించు మహాఘోర ఘాతుక కృత్యాలపట్ల తన తీవ్ర నిరశన భావాన్ని వెలిబుచ్చుచు, చైనాకు అండగా నిలబడి చైనీయులకే చైనా అనే నినాదాన్ని గతనవంబరు 7 వ తేదీని మారుమ్రోగించిన దేశం, సోవియట్‌రష్యా.

8. శాంతినే ప్రధానంగా పెట్టుకొని వివిధ ప్రజాస్వామ్య దేశాలతో సన్నిహిత సంబంధమేర్పరచుకొని, ప్రపంచకుట్ర దారులయిన ఛేంబర్లేను, హిట్లరు, ముస్సోలినీల, సామ్రాజ్యకాంక్షా పరతత్వముతో కూడిన ప్రపంచ వినాశకర మార్గాల నెదుర్కొని ప్రజాస్వామ్య దేశాల కాపాడ సర్వదా ప్రయత్నిస్తూన్న దేశం, సోవియట్‌రష్యా.

9. బానిసత్వమనుభవిస్తు పరదేశాక్రమణతో పీడింప బడుచూన్న మనదేశంవంటి కాలనీదేశాల సమస్యవచ్చినప్పుడు సామ్రాజ్యవాద దేశాలను తీవ్రంగా ఎదుర్కొని బానిస దేశాలకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఇచ్చివేయాలని వాదిస్తూన్న దేశం, సోవియట్ రష్యా.

"మన విదేశాంగపద్ధతి, శాంతిని కాపాడుట కొరకును. విదేశాలతో వ్యాపార సంబంధాల నభివృద్ధి చేసికొనుటకును, పైవాటిపై ఆధారపడి యున్నది. మనకన్న చిన్నదేశాలను ఎదుర్కొవడంగాని, బెదరించడంగాని మన ఉద్దేశ్యం ఎంతమాత్రమును కాదు. శాంతి ప్రక్కనే ఉంటాము. శాంతిస్థాపన మార్గాలను సమర్ధిస్తాము. కాని మనం మాత్రం బూటకపు బెదరింపుల కెంతమాత్రమును జడవము. "పరరాజ్యాని కాశపడము" మనమీదకు దండెత్తి వచ్చినట్లయిన దెబ్బకు దెబ్బ ముట్టజెపుతాము, మనతోపాటు ఎవరైతే శాంతిని కోరుతారో వారికి మన సహాయమెప్పుడూ ఉండితీరుతుంది. కాని మన దేశాన్ని ఎవరైతే ఎదుర్కొ ప్రయత్నిస్తారో అట్టివారికి వినాశకరమైన అపజయాన్ని ముట్టజెపుతాము." (కామ్రేడ్ స్టాలిన్,—1935 లో)

వీటన్నిటినిబట్టి సోవియట్‌రష్యా విదేశాంగ వ్యవహారము శాంతిపైననే ఆధారపడి యున్నదని నిస్సందేహముగా చెప్పవచ్చు. ఈనాడు సోవియట్ రష్యా ప్రభుత్వము సోషలిస్టు విధానముమీద ఆధారపడి యున్నది. సోషలిస్టు రష్యా విదేశాంగ వ్యవహారము శాంతిపైననే ఆధారపడియున్నది. కాబట్టి సోషలిజం అంటే శాంతి అన్నమాట.

కాంగ్రెసు ప్రచారకుల సమావేశం

1—3—39 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తునికిపాడు, తిరువూరు తాలూకా గ్రామములో శ్రీయుత మురుకుట్ల వెంకటప్పయ్యగారి అధ్యక్షత క్రింద కాంగ్రెసు ప్రచారకుల సమావేశం జరిగింది. తిరువూరు నందిగామ తాలూకాలోని, నిజాం రాష్ట్రములోని ప్రచారకులు సుమారు 40 మంది విచ్చేసిరి.

యీ సమావేశమున తునికిపాడులో మే నెలయందు రైతాంగ విద్యాలయమును నడుపుటకు తీర్మానింపబడెను.

యీ విద్యాలయం నడుపుటకు, కామ్రేడ్స్ సుంకర వీరభద్రరావు, పి. సుందరంగార్లను అర్గనైజర్లగాను, పేట బాపయ్యగారు మున్నగు 19 మంది ఎన్నుకోబడి-యీ దిగువ తీర్మానములు ఏకగ్రీవముగా అంగీకరింపబడెను.

1. విద్యాలయమును నిర్విఘ్నముగా సాగించుటకు అవసరమగు ధనమును సహాయం చేయవలసినదిగా ప్రాంతీయులందరిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

3. చిట్టివలస కాల్పులను గురించి మద్రాసు ప్రభుత్వమువారి ప్రకటనకు యీ సభవారు అసంతృప్తి వెల్లడించి, నిష్పాక్షికమైన కమిటీని వేయగోరుచూ చనిపోయిన కూలివారి కుటుంబములకు సానుభూతిని తెల్పిరి.

3. సంస్థానములలో కొనసాగింపబడుచున్న నిర్బంధ చర్యలను ఖండించుచూ సంస్థాన ప్రజా పోరాటమును అభినందించుచున్నారు-

4. సి. టి. ఆక్టు తొలగించవలసినదిగా మద్రాసు ప్రభుత్వమువారిని గోరుచున్నారు-

5. కాంగ్రెసు మంత్రివర్గముయొక్క కానిస్టిట్యూషనల్ డ్రిఫ్టుకు సభవారు తమ అసమ్మతి తెల్పుచున్నారు-

6. తిరువూరు తాలూకాలో భూమి తనఖా ద్యాంకును స్థాపించవలెననియు, కోఆపరేటివు ద్యాంకులు యీ తాలూకాయందు విరివిగా స్థాపించవలసినదిగా మద్రాసు ప్రభుత్వంవారిని కోరిరి-

7. బ్రిటిషు ప్రజలు నైజాం సంస్థానములోగుండా వెళ్లినప్పుడు పోలీసువారు కలిగించు ఆటంకములు కలుగకుండా రక్షణ యొసగవలసినదిగా మద్రాసు ప్రభుత్వంవారిని కోరుచున్నారు.

8. మితవాద నాయకులు విద్యార్థులు రాజకీయలలో ప్రవేశించరాదనుటను ఖండించిరి. కాలేజీనుండి విద్యార్థులను వెడలగొట్టినందుకు ఉస్మానియా కాలేజీవారి చర్యను నిరశించిరి-

9. పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు వ్యవహారములలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసువారి చర్యకు అసమ్మతి తెలుపుచూ, వెంటనే విచారణ కమిటీని వేయవలసినదిగా ఆ॥ ధ॥ కాం॥ సంఘము వారిని కోరుచూ యింకా యితర తీర్మానములు సుమారు 10 చేసియుండిరి.

తునికిపాడు, 2-3-39. } సుంకర వీరభద్రరావు, సమావేశ కర్త.

★ ★ ★

వెంకటగిరి

కామ్రేడ్ బీరం రామనాధం, తిరుపతిగారి శ్రీరామమూర్తి గారల మధ్య జిల్లా కాంగ్రెసు ఎన్నిక పోటీ జరిగింది. బీరం రామనాధంగారు 174 ఓట్లు అధికముతో ఎన్నుకొనబడిరి.

26—2—39

గమనించండి

కోవూరు తాలూకా కాంగ్రెసు సంఘము

కోవూరు తాలూకా కాంగ్రెసుసంఘ కార్యనిర్వాహక వర్గమువారు యీ నెల 25 వ తేదీన అల్లూరులో సమావేశమై ఈ క్రింది తీర్మానముల గావించిరి.

1. 1938 సం॥ జులై నెలనుంచి 1939 సం॥ ఫిబ్రవరినెలవరకు అయిన జమా ఖర్చులు మంజూరు చేయడమైనది.

2. తాలూకా రాజకీయ మహాసభ మార్చి నెలలో జరుపవలసినట్లు తీర్మానించడమైనది.

26—2—39 మొల్లూరు వెంకటశేశయ్య, కార్యదర్శి

★ ★ ★

ఆత్మకూరు తాలూకా నాగులపాడు మజరాయడపల్లె గ్రామ రైతులు సంఘము 30—1—39 వతేదీని స్థాపించుకొని, ఆరోజు కామ్రేడ్ గంగా చిన కొండయ్య అధ్యక్షత క్రింద మీటింగు చేసి ఈక్రింది విషయములు తీర్మానము చేసిరి.

1. మా గ్రామ మంచినీళ్ళ బావి రిపేరు చేయంచమని శ్రీ కలెక్టరు వారిని, 2. మాగ్రామములో కోఆపరేటివ్ సొసైటీని స్థాపించమని శ్రీ కలెక్టరువారిని కోఆపరేటివ్ రిజిస్ట్రారు జనరల్ ఆఫ్ మద్రాసు గారిని, 3. మా చెరువుకు, ఆత్మకూరు చెర్లోకి వచ్చే యేటి కాలువలునుంచి, ఒక చీలు కాలువ త్రవ్వుకొనుటకు ఉత్తరువులు యిచ్చునట్లు శ్రీ ప్రభుత్వమువారిని, శ్రీ కలెక్టరు వారిని, 4. ఈ సంవత్సరము మా నెల్లూరు జిల్లాలో మద్యపాన నిషేధము అమలు జరుపమని శ్రీ ప్రభుత్వం వారిని కోరుచు తీర్మానములు చేయడమైనది.

1. పి. బుచ్చిరెడ్డి (ప్రెసిడెంటు), 2. డి. రాజగోపాలరావు, 3. పి. బలరామిరెడ్డి, 4. పి. నాగయ్య, 5. యం. సుబ్బరామయాచారి, 6. ఎ. పెద్ద వెంకటసుబ్బారెడ్డి, 7. పి. కోటిరెడ్డి, 8. పి. వెంకట శేషిరెడ్డి, గారు కమిటీగా ఎన్నుకోబడిరి.

డి. రాజగోపాలరావు
సెక్రటరీ

★ ★ ★

నేను 23—12—'38 వ తేదీన మా బంధువులను చూచి వచ్చుటకు నైజాము స్టేటులోని కారేపల్లి స్టేషనుకు సమీపమున గల గ్రామమునకు వెళ్ళి యుంటిని. అచ్చట పోలీసు ఠాణా గలదు. ఠాణా అధికారి దఫేదారు కూడా అచ్చటకు వచ్చియుండెను.

నేను మామూలుగా వాడు ఖద్దరు దుస్తులను ధరించి అంతకు పూర్వమునుండి చదువుకొనుచుండిన రష్యా నవశక్తి సంచికను చేతితో పుచ్చుకొని యుంటిని. అట్టి సమయమందు దఫేదారు పత్రిక నా చేతులోనున్న కారణముచే నేను కాంగ్రెస్ మనుష్యుడనని నన్ను పోలీసు ఠాణాకు రమ్మనమని బలవంతపెట్టెను. నేను ఈపత్రిక శ్రీ నైజాం గవర్నమెంటువారిచే నిషేధింపబడిన పత్రికలలో లేదని వాదించినను లాభము లేకపోయినది. కారణ మేమన అతనికి తెలుగు రాదు. నిషేధింపబడిన పత్రికలపేర్లు తెలియదు. తరుపరి అనగా 30-12-38వ తేదీన అరెస్టు చేసినాడు ఆ సమయం సాయంత్రము 3 గంటల వేళ.

అప్పటికి 4 రోజులనుండి జ్వరంచే బాధపడు నన్ను, 12 మైళ్ల దూరములో బొగ్గుగుంటలో నున్న అమీన్ సాహెబ్ దగ్గరకు రమ్మనమని బలవంతపెట్టి ఆ దినముకు జామీనుమీద వదలి మరునాడు ఉదయం 5 మైళ్లు నడిపించి కారేపల్లిలో బండి ఎక్కించి బొగ్గుగుంట చేర్చిరి. అచ్చటనుండి అమీన్ సాహెబ్‌గారి యింటికి తీసుకొనివెళ్ళిరి. వారికి తెలుగు రాని కారణముచే నేను చెప్పు భావములు తెలియక సర్కిలు యిన్స్పెక్టరువారి వద్దకు తీసుకుపోయిరి. సర్కిలు యిన్స్పెక్టరు గారికి తెలుగు వచ్చి యుండుటచే వివరముగా విచారించి శ్రీ నైజాము ప్రభుత్వమువారు నిషేధించిన పత్రికలలో నవశక్తి పత్రిక లేని కారణముచే నన్ను తక్షణము మీ బంధువులు గల గ్రామము వెళ్ళవలసిన దని చెప్పుచు, అచ్చటనున్న అమీన్ సాహెబ్ గారితో పోరల్‌గా ఈ పట్టణములో మీరు ఎవరితోనైనా సరే ఇద్దరు ముగ్గురు కలసి మాట్లాడుచుండినచో అరెస్టు చేయుమని చెప్పిరి. రైలు వద్దకు రాగా రైలు పోయినది. అప్పుడు అడవులో గుండా మధ్యదారిని 12 మైళ్ళు నడిపించి చివరకు మాబంధువుల గ్రామము చేర్చిరి.

★ ★ ★

తంతివార్తలుగూడా చేరుటలేదు.

ఇదివరలో ఉత్తరములు సరిగా పోష్టల్ డిపార్టుమెంటువారు అందజేయుటంలేదనే ఫిర్యాదులు లెక్కకు మిక్కుటంగా యున్నవి. గాని యిప్పుడు తంతివార్తలు గూడా పోష్టల్ డిపార్టుమెంటువారు సరిగా చేర్పక పోవటం శోచనీయంగా యున్నది. నేను ది 4-3-39 మధ్యాహ్నం 1-30 సమయంలో బెజవాడ గవర్నమెంటు టెలిగ్రాము ఆఫీసులో నెం 71 రుగా యీ దిగువ విధంగా టెలిగ్రాము యిచ్చియుంటిని.

"బొప్పూడి పిచయ్య, నవాబుపేట, నందిగామ
వివాహం, దశమి, సోమవారం.
వెంకటప్పయ్య"

నందిగామకు నవాబుపేట జగ్గయ్యపేట రోడ్డుపై $4\frac{1}{2}$ మైళ్ల దూరం వున్నది. టెలిగ్రాము ఫీజు 0-9-0 కూలి 0-7-0 మొత్తం 1-0-0 చెల్లించితిని. కాని ఆ టెలిగ్రాము అందవలసినవారు లోగడ నిర్ణయించుకొన్న 6-2-39 తేదీ ప్రయాణం ఆగవలసియుండుటచే యిచ్చియుంటిని. గాని 6-2-39 ఉదయం 11 గంటలకు వారు అంతా ప్రయాణమై వచ్చువరకు నందిగామ పోస్టువారు టెలిగ్రాము అందించి యుండలేదు. 46 గంటలవరకు $4\frac{1}{2}$ మైళ్లు దూరంలోయున్న గ్రామముకు నందిగామ పోస్టువారు టెలిగ్రామును అందించలేకపోవుట శోచనీయం. యిందు విషయంలో డిపార్టుమెంటువారు సక్రమముగా విచారణ జరిపి సరియగు సంజాయిషీ యివ్వనిచో డిపార్టుమెంటుపై తగిన చర్య తీసుకొనదలచి యిందు మూలకముగా ప్రకటన చేయుచున్నాను.

మురుకుంట్ల వెంకటప్పయ్య,
11—2—39.

ప్రెస్ కార్మికులపై యజమానుల దాడి

తెనాలి లక్ష్మీ ప్రెస్ లాకౌట్

40 మందికి పని లేదు.

తెనాలి లక్ష్మీప్రెస్ యజమానులు తాము తయారు చేసిన కొత్త నిబంధనలు (ఒక రోజు నాగా అయితే 2 రోజుల జీతం మినహాయించుకొనుట, విశ్రాంతి కాలములో 20 నిమిషాల ఎక్కువ పని, వారంలో 3రోజులు నాగా అయితే ఆదివారం జీతం మినహాయించుకొనుట మొదలగునవి) అంగీకరించలేదనే కారణముతో ప్రెస్ పనివారిని 40 మందిని 11-3-39 వ తేదీని పనిలో నుంచి తొలగించారనీ, ఆనిబంధనలు పనివారికి పూర్వముకన్న నష్ట, కష్టాలను ఎక్కువ చేసేవి కాబట్టి పనివారు వాటికి అంగీకరించలేదనీ, ఆనిబంధనలు లేకుండా పూర్వంలాగా పని చేయటానికి పనివారికి ఆక్షేపణ లేదనీ లోగడ తెలియజేశారు.

ప్రెస్ యజమానుల చర్యలను నిరసించుటకు 12-3-39 వతేదీ సాయంత్రం 5 గంటలకు గాంధిచౌకు నుంచి ప్రెస్ వర్కర్సు యాజమాన్యమున గొప్ప ఊరేగింపు బయలుదేరెను. ఊరేగింపు 6 గంటలకు మ్యునిసిపల్ లైబ్రరీ వద్దకు చేరి అచ్చట మాదాసు కోటయ్యగారి అధ్యక్షతను పెద్దబహిరంగసభ జరిగెను. సభలో ముత్తేవి మాధవాచార్య, కాకుమాను సుబ్బారావు, గుడిపల్లి వెంకటప్పయ్యశాస్త్రిగార్లు మాట్లాడిరి. యజమానుల చర్యలను విమర్శిస్తూ, పనివారిని బలపరుస్తూ తీర్మానములు చేయబడెను.

పనివారు చాలా ఉత్సాహంతోనూ, పట్టుదలతోనూ రోజువారీ కార్యక్రమాన్ని (ఊరేగింపులు, సభలు పికెటింగు మొదలయినవి) సాగిస్తున్నారు. యజమానులు ప్రెస్ తాళం వేసుకుంటామనీ, లేకపోతే వచ్చిన పని మేమిద్దరమే చేసుకుంటామనీ మామూలు ధోరణిలోనే మాట్లాడుతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ లాకౌటు ఎక్కువ రోజులు సాగే సూచనలు కనిపిస్తున్నై. ఈ సమయంలో ప్రెస్ పనివారిని అన్ని విధాలా బలపరచవలసిన బాధ్యత ప్రజలపైన, ఇతర ప్రెస్ పనివారలపైన వున్నది.

మద్రాసులో కార్మిక ప్రదర్శనం

నిందా గీతములు పాడినారని 4 గురి అరెస్టు.

విషమ పరిస్థితి తప్పినది.

15 వ తేదీ సాయంకాలము జార్జి టౌను మద్రాసు ప్రెస్ వర్కర్సు సంఘంవారు బీచ్‌వద్దనుండి అసెంబ్లీ భవనం యెదుట పెద్ద ప్రదర్శనము జరిపిరి. పట్టణంలోని చాల చోట్లనుండి కార్మికులు గీతములు పాడుచు చిన్న చిన్న దళములుగవచ్చి చేరిరి. బందోబస్తుమీద నున్న పోలీసులు, అవమానకరమగు భాష నుపయోగించు చున్నారని ఒక కార్మికునకు హెచ్చరిక నిచ్చి దీనిని లెక్కచేయలేదని వానిని అరెస్టు చేసిరి. వీరితోడివారందరు దీనికి వ్యతిరేకము తెలుపగా దాని మీద కొంత ఆందోళన ప్రారంభమయ్యెను. పోలీసులు మరి 3 గురుని అరెస్టు చేసిరి. పరిస్థితులు విషమరూపమును దాల్చు చున్నవని కార్మికులను ముందుకు పోకుండా పోలీసు లాటంకపరచిరి. ఈ ఆటంకమును గురించి అదివరకే అసెంబ్లీ ఎదుట చేరియున్న కార్మికులకు కబురందినది.

జార్జిటౌను కార్మికుల సంగతి తెలిసినంతనే అసెంబ్లీ వద్దనున్న గుంపు పి. ఆర్. కె. శర్మగారి నాయకత్వమున ఫోర్టు ప్రక్కకు బయలుదేరెను. కార్మికులు దాదాపు 500 మంది వరకుండిరి. కార్మికులను గీతములు పాడకుండ తామేమియు ఆటంకం తెలుపలేదని ప్రత్యేకపు వ్యక్తులను గురించిన అవమానకర గీతములను పాడరాదని ఆటంక పరచితిమని లాథం (పోలీసు డిప్యూటీ కమీషనరుగారు) శర్మగారికి తెలియ చేసిరి.

కార్మికులు అరెస్టు కాబడినవారిని విడుదల కోరు చున్నారని, వారిని విడుదల చేయువరకు వారిక్కడ నుండి కదలదలచుటలేదని శర్మగారు అధికారికి తెలియ చేసిరి.

బెయిలు నొసగినచో వారిని విడుదలచేయుట కెట్టి ఆటంకంలేదని లాథంగారు తెలిపిరి. అరెస్టయినవారి విడుదల గురించి తాము శ్రద్ధ వహించెదమని, కార్మికులందరును చిన్న చిన్న దళములుగ యిండ్లకు తిరిగి పోవలసినదని శర్మగారు కార్మికులకు సలహా నిచ్చిరి. దీనికి వారంగీకరింపక అచ్చటనే రాత్రి గడప నిశ్చ

కార్మిక సమస్యలు

యించిరి. రాత్రి 11-30 తరువాత పోలీసు అసిస్టెంటు కమీషనరు అచ్చటికివచ్చి లాథంగారితో చాలసేపు చర్చను జరిపిరి. కొంచెము సేపయినతరువాత పోలీసు దళము మెల్లగ అచ్చటనుండి వెళ్ళిపోయెను.

యింక రాత్రి అచ్చటనుండిన కలుగు లాభమేమియు లేదని కార్మికులుకూడా అచ్చటినుండి వారి వారి గృహములకు వెళ్ళిరి.

అరెస్టయిన నల్గురిని రాత్రి ఒంటిగంటకు బెయిలు మీద వదలివేసిరి. వారిపై కేసు 23 వ తేదీకి వాయిదా వేయబడినది.

'గవర్నమెంటు స్టోరు వర్కర్లు

ఈ నెల 16 వ తేదీ మధ్యాహ్నము మద్రాసు గవర్నమెంటు స్టోరు వర్కర్లు పి. ఆర్. కె. శర్మ గారి నాయకత్వము క్రింద మంత్రివర్గం వద్దకు డెప్యుటేషన్ వెళ్ళి ఈ దిగువ కోరికలను నివేదించారు.

1. లష్కర్‌లుగా పరిగణింపబడే వారి నందరిని, మద్రాసు గవర్నమెంటు ప్రెస్ స్టోరువర్కర్ల హోదాలో చేర్చి వారికి పెన్షన్ అవకాశాలను కలిగించవలసి దని, 2. రోజు కూలీలుగా నుండేవారిని, నెలసరి జీతగాండ్రను జేసి పెర్మనెంటు సిబ్బందీ హోదాలోకి మార్చ వలసినదని, కోరుతూ మద్రాసు ప్రభుత్వ స్టోరు అధికారము గలిగియున్న ప్రచురణ శాఖా మంత్రిగారికి విన్నవించారు.

సామర్లకోట కార్మిక సంఘము

వార్షిక సమావేశము

సామర్లకోట డక్కన్ షుగర్ అందు అబ్కారీ కంపెనీ కార్మికసంఘ వార్షిక సమావేశము 13-3-39 వ తేదీని సంఘోపాధ్యక్షులగు శ్రీ యస్. లక్ష్మణస్వామిగారి యాధిపత్యమున జరుపబడినది. ఈసంఘం నెల్లికుప్పం యన్. ఆర్. యస్. టి. వర్కర్సు ఫెడరలు కమిటీతో కలుపుట కంగీకరించడమైనది. సంఘ ప్రతినిధులు నెల్లికుప్పములో ది 25-12-1938 వ తేదీని సమావేశమై తీర్మానించిన తీర్మానములు రాణీ పేటలో 20-2-39 వ తేదీని సమావేశమైన ఫెడరల్ కమిటీలో పునరుద్ధరించిన ప్రకారం కంపెనీ మేనేజింగు ఏజంట్లు అమలు జరుపకున్నచో తప్ప సమ్మెచేయుటకు తీర్మానించడమైనది. కంట్రాక్టు పద్ధతిలో మేనేజిమెంటువారు కార్మికులను తీసివేసేటట్లు ఏర్పాటు చేసిరి గాన సదరు యేర్పాటును నిరసించిరి.

ఈ దిగువవారిని 1939 వ సంవత్సరమునకు కార్యవర్గముగా ఎన్నుకోవడమైనది. శ్రీ గోలి వెంకట్రాయుడుగారు, బి ఏ. బి. కాం. ప్రెసిడెంటు. శ్రీ యస్. లక్ష్మణస్వామిగారు వైస్ ప్రెసిడెంటు. దుద్దుంపూడి సత్యనారాయణగారు, బి. యే. సెక్రటరీ. శ్రీ టి. కూర్మ నాయకులు కోశాధిపతి, మరి 16 గురు కార్యవర్గ సభ్యులుగను ఎన్నుకోబడిరి.

కలకత్తా

హౌరా బట్టల మిల్లులలో పని చేసే కార్మికులు సుమారు 1700 మంది తమకు జీతం ఎక్కువ చేయవలసినదని కోరుతూ సమ్మెను ప్రారంభించారు. అందు 200 మంది సమ్మెదారులు మిల్లులో నిరాహార దీక్ష వహించారు. తమ కోర్కెలు నెరవేర్చక పోయినచో యీ ఉపవాసమును కొనవరకు సాగించుటకు సిద్ధంగా నున్నామని కార్మికులు తెలిపారు. పోలీసు అధికారులు వచ్చి నిరాహార వ్రతము మానవలసినదని హాస్పిటల్‌కు వెళ్ళవలసినదని కార్మికులను కోరి యున్నారు. కాని కార్మికులు ఆ సలహా లన్నిటిని నిరాకరించారు.

ఆంధ్రరాష్ట్ర

ప్రెస్ వర్కర్సు యూనియన్

కార్యనిర్వాహక వర్గ సమావేశము.

పైసమావేశం 26-3-39 ఆదివారము తెనాలి ప్రెస్ వర్కర్సు యూనియన్ ఆఫీసులో మధ్యాహ్నం 11 గంటలకు జరుగును. సభ్యులందరు తప్పక విచ్చేయ ప్రార్ధన. ముఖ్యమైన విషయములు చర్చింపబడును.

ఇట్లు.
పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
కార్యదర్శి.

యం. యస్. యం.
రైల్వే పనివారల యూనియన్

బెజవాడ బ్రాంచి యూనియన్ సంవత్సరాంతర వార్షికోత్సవము మే నెలకు వాయిదా వేయబడెను. ఇదివరకు 26-3-39 తేదీన జరుగునని పత్రికలలో ప్రకటించబడెను. సోదరులందరు యీ మార్పును గమనించ ప్రార్ధన.

ఇట్లు,
వై. వి. గోపాల్,
బ్రాంచి కార్యదర్శి.

ఒక సవరణ

క్రిందటివారం నవశక్తిలో గుంటూరుజిల్లా విద్యార్థి మహాసభ సత్తెనపల్లిలో జరిగినట్లు ప్రకటింపబడినది. అది పొరపాటు పైమహాసభ నర్సారావుపేటలో జరిగినది. ఈపొరపాటుకు పాఠకులు మన్నింతురుగాక.

— సంపాదకుడు.

"ముటార్నరి ముస్సోలినీ" బోసును ఫాసిస్టుఅంటాడు!

కృష్ణా పత్రిక వ్రాతలకు సమాధానం

కామ్రేడ్ వెల్లంకి విశ్వేశ్వరరావు

కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నికలప్పటినుండి కృష్ణాపత్రిక సుభాస్‌ను విమర్శించుటలో వుచితజ్ఞతను హద్దులను దాటినది. ఆంధ్ర దేశములో వున్న పత్రికలన్నిటిలో ముసలిదిమై, గాంధీయుల పంథాను సరిగా ప్రతిఫలింపజేస్తుందను కోబడుచున్న కృష్ణాపత్రిక అనేక ఆధారం లేని అనుమానాస్పదములైన ఆరోపణలు,మర్యాదనతిక్రమించిన దూషణలు చేస్తూంది. దురాగ్రహం వెల్లడించుచున్న యీ వ్రాతలకు సమాధానమివ్వ నవసరం లేదని యెంచియో, యేమో ఎవరూ ప్రతి విమర్శనలు గావించలేదు మార్చి 18 వ తేదీ సంపాదకీయం చదివిన తరువాత అమాయకుల మనస్సులలో సుభాస్ యెడల తీవ్రవాదుల యెడల సందేహాలు కల్పించుటకు గావించిన హద్దుమీరిన ఆరోపణలను ఖండించుట అవసరమని యీవ్యాసం వ్రాయవలసివచ్చింది.

ఎన్నికలకు ముందు తమ అభ్యర్థి జయం కోసం ఉబలాటంలో వ్రాసిన వ్రాతలను విడిచి వేద్దాం. ఎన్నికానంతరం జయంపొందిన అభ్యర్థిని అభినందించి కార్య రంగంలో జరుగవలసిన పనిలో అందరూ సహకారం చేయుట మర్యాద లక్షణం. కృష్ణా పత్రిక యిట్టిమర్యాతనే గమనించలేదు సరిగదా దుష్ప్రచారపట్ట నారంభించినది. శాంతినికేతనంలో కలసిన "నెహ్రూ, బోసులు ఏదో గూడుపుఠాణీ చేస్తున్నారని" ఎన్నికలయిన వెంటనే ఫిబ్రవరి 4 వ తేదీ సంపాదకీయంలో వ్రాసింది.

11 వ తేదీ సంపాదకీయంలో "బోసు అన్నగారగు శరత్‌చంద్రబోసు తుదకు ఆల్‌యిండియా కాంగ్రెస్ కమిటీ మెంబరు గాకుండ పోయినాడు" అని లోలోన పేచీలవల్ల తప్పితే బోసుకు పలుకుబడిలేదని రుజువు చేయడానికి వ్రాసింది. ఆల్‌యిండియా కాంగ్రెసు కమిటీ ఎన్నికలు జరుగువిధానం తెలియని ప్రజలను బెంగాలులో కూడా బోసుకు పలుకుబడిలేదని నమ్మించుటకు చేసిన యెత్తిది. అ. భా. కాం. కమిటీ ఎన్నికలు ట్రాన్సఫర్‌బుల్ ఓటింగు ద్వారా జరుగుటచే ఏర్పాటులు సరిగాచేసికోనిచో ఎంత పలుకుబడివున్నా ఓడిపోవచ్చునని తెలియదా కృష్ణాపత్రికకు? ఏదో సమయానుకూలముగా తప్పు అభిప్రాయాన్ని ప్రచారంచేయుట గాని; తరువాత రాష్ట్రి కాంగ్రెస్‌చే శరత్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నుకోబడలేదా?

అదేపత్రికలో శ్రీనివాసయ్యంగారు జమీందారీ విచారణ కమిటీ రిపోర్టులోని మీర్జాపురం వారి అసమ్మతి రిపోర్టుకు సాయపడ్డాడని అన్వేషించి కనుక్కొని బోసుకు యిట్టివారితోనా సహకారం అనే భావాన్ని ప్రచారం కావించడానికి పూనుకుంది. సోషలిస్టులు శ్రీనివాసయ్యంగారిని సమర్ధించరు. స్వాతంత్ర్య పోరాట సమయంలో కాంగ్రెసును-గాంధిపై కక్షతో విడనాడుటను నిరసించుతాడు. కాని జమీందారులకు పరోక్షంగా సహాయంచేయు వాదనలలో ప్రకాశం కమిటీ రిపోర్టును కృష్ణాపత్రికయు ఎదిరించినదను సంగతి ప్రజలు యింకా మరువలేదని తలుస్తారు. ఈవాదన తెచ్చుటలో కృష్ణాపత్రిక ఉద్దేశ్యము జమీందార్ల సలహాదారు శ్రీనివాసయ్యంగారు బోసుకు అండనుమా అని ప్రజలను బెదిరించుటకే. కాని డబ్బుకోసం అధర్మాన్ని, అసత్యాన్ని, ధర్మం, సత్యం అని వాదించే లాయర్లు కాంగ్రెసు నాయకులుగా వుండుట భారతీయుల దురదృష్టం. ఈ గాంధీయులే భూలాభాయిదేశాయి పీడితప్రజలకు విరుద్ధంగా సంస్థానాధిపతులకు సలహా యిచ్చినపుడు వ్యక్తిగత హోదాలో యిచ్చాడని (మైసూరులో) సమర్థించారు. ఢిల్లీ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు. అటులచేయుట క్షంతవ్యంకాదని గాంధీయులు నోరైనా మెదల్పలేదు. అంతేగాక గాంధీయులు డబ్బు, పలుకుబడివున్న జాతీయ విద్రోహకపార్టీలకు చెందిన వారినెంతమందిని కాంగ్రెసులోనికి ఆహ్వానించి పదవులివ్వలేదు? అట్లని అయ్యంగారిని సమర్థించను. అతడు తన జాతీయతను పోరాటంలో రుజువుచేసికోందే ఛోటా నాయకత్వానికికూడా అర్హుడుకాడు. కాని యీవాదన "సుభాసు నూరేగించేవారే, వారిని వారి పల్లకీని బోర్లదోసి పారిపోవుదురు" అని సిద్ధాంతాన్ని తేల్చుటకు కృష్ణాపత్రిక ప్రయత్నించుటలోనే వుంది సంకుచితత్వము.

ఫిబ్రవరీ 25 వ తేదీన సంపాదకీయంలో సుభాష్, వారి యనుచరులు, "బ్రిటీషు సామ్రాజ్యాన్ని 'రెక్క' చేయలేకపోయినా, కాంగ్రెసును రెక్కచేసి దేశంలో అరాచకాన్ని తీసుకొని రాగలరు" అని వ్రాసింది. ఢిల్లీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం తరువాత గాంధిజీ కాంగ్రెసులో ఒకేపక్షం వుండాలనీ, అవసరమైతే కాంగ్రెసును తీవ్రవాదులకు గాంధీయులు వదలివేస్తారని హెచ్చరించాడు. నాటి నుండి గాంధీయులు తీవ్రవాదులను కాంగ్రెసు నుండి తరిమివేయాలని ప్రయత్నిస్తున్నారు. త్రిపురీ కాంగ్రెస్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు కాంగ్రెసును భగ్నం చేయదలపరనియు, కాంగ్రెసులో సంపూర్ణ స్వాతంత్ర్యం కోరువారందరూ, గాంధీయులునైతం వుండాలని కోరుతారనియు స్పష్టపరచింది. గాంధీయులే కాంగ్రెస్‌నుండి తీవ్రవాదులను తరిమివేయాలని ప్రయత్నించి కాంగ్రెస్ సంపూర్ణతను భగ్నం చేయాలని ప్రయత్నించారు. బోసు ఎన్నిక అట్టి ప్రయత్నాలను నాశనం గావించింది.

ఈ పత్రికలోనే యింకా బోసు విదేశాల నుండి కాంగ్రెసు ప్రెసిడెంటుగ జేయనిదే తిరిగి రానని తంతుల నిచ్చెననియు, బోసు తల్లి గాంధీజీని "మావాడిని సభాపతిగ జేయనిచో వాడు ఆత్మహత్య జేసుకొనును" అని ప్రార్థించినదని వ్రాసారు. 1935 లో ఢిల్లీ అసెంబ్లీలో బోసుకు యిండియాకురావడానికి అనుమతి నిరాకరించడానికి తెలిపిన కారణాల్లో కొన్ని రహస్యాలు బయటపడ్డాయి. గాంధీజీ బెంగాలు రాజకీయవాదులపై సి. ఐ. డీ.గా తన సెక్రటరి కృష్ణదాసును పంపాడు. అతడు గాంధిగారికి అచటి దేశసేవకులకు "సత్యం, అహింసలపై" నమ్మకం లేదని ఏమేమో తెలివి తక్కువ వ్రాతలు వ్రాసిన ఉత్తరాలు ప్రభుత్వానికి దొరికాయి. వాని నాధారంగా కొని బోసు సోదరులూ, యింకా ఎంతో మంది జైళ్ళపాలయ్యారు. అపుడు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా గాంధీజీ, వారి ముఠా, దేశీయులందరి ఒత్తిడివలన బోసు అధ్యక్షతను విధిలేక అంగీకరించవలసి వచ్చింది. ఐనా ఆంధ్రులలో అనేకమంది మా "పట్టాభి"ని ప్రెసిడెంటు చేయమని గాంధీజీకి ఉత్తరాలు వ్రాయలేదా? కృష్ణా పత్రిక నిజాన్ని దాచి గోరంతను కొండంతలు చేయుట ఎందులకో!

ఎన్నికలకు ముందు కృష్ణా పత్రిక పట్టాభిగారి జయాన్ని గురించి జోస్యం చెపుతూ "Pattabhi be ready to wear the crown of thorns" (పట్టాభీ! కంటకావృతమైన కిరీటాన్ని ధరించడానికి సిద్ధంగా వుండు!) మని ఆ మహాత్ముని ఆశీర్వచనం కాబోలు-ఉల్లేఖించుతూ వ్రాసింది. మార్చి 11 వ తేదీ పత్రికలో సుభాస్‌కు "యీ ముండ్లకంప" నెత్తిబరువు ఎందుకు వచ్చిందనీ, మెజారిటీ ఓట్లతో పదవి వచ్చినంతమాత్రాన నాయకత్వం ఎక్కడినుండి వస్తుందని ఆక్షేపించింది. ఐనచో ఇతరుల ఆశీర్వాదాలపైననే ఆధారపడి నిలచిన పట్టాభిగారికి నాయకత్వం అసలే లభించెడిది కాదుగదా?

అన్నిటినీ మించిన అవకతవకలు మార్చి 18 వ తేదీ సంపాదకీయంలో ఉన్నాయి. బోసును గురించి వ్రాస్తూ "తాను ట్రాఫికల్ భీమా కంపెనీకి చైరుమన్, ఈ భీమా ఏజంట్లందరు ఈ కాన్వాసింగుకు ఉపయోగపడ్డారు." అని వ్రాసింది. ఇది అపసవ్యమైన విమర్శ. ఆంధ్రరాష్ట్రి కాంగ్రెస్ అధికారులకు హిందూస్థాన్ మ్యూచుయల్‌యిన్స్యూరెన్సు కంపెనీతో పూర్తి సంబంధ మున్నంతమాత్రాన పట్టాభిగారికి వచ్చిన ఓట్లన్నీ అలాంటి కాన్వాసింగు వలన వచ్చినవని చెప్పవల్సిందేనా?

"ఇటలీ, జపానులనుండి ఎంత సొమ్ము వచ్చిందో తెలియదు ఇండియాలో విప్లవం వస్తే బ్రిటీషు సామ్రాజ్యం పతనం అవుతుందనివ ఆ రాజ్యాలవారి ఆశ. ఇంతకాలం రష్యానుండి కమ్యూనిజం ప్రచారంకోసం కొంత డబ్బు వస్తూవుండేది. ఇప్పుడు రోము, బర్లిను, టోకియోలుకూడ ఈజూదంలోకి దిగినాయి సుభాస్ "ఫాసిస్టు" అనే సంగతి తన "Indian Struggle అనే గ్రంథంలోనే స్పష్టపరచుకొన్నాడు. సుభాస్ ప్రెసిడెంటుగ ఎన్నుకోబడ్డడను వార్తకు ఆరాజ్యాల పత్రికలు చప్పట్లు చరచడం దేనికి?" అనివ్రాసింది. ఈ అబద్దాలపుట్టకు సాక్ష్యంగా కృష్ణాపత్రిక "స్టేట్సుమన్" పత్రికను సాక్ష్యంగాతెస్తూంది పైగా అసాక్ష్యం ప్రజలు నమ్మరే అని ఏడ్పు.

ఐనా ఫాసిజంపై కోపం కృష్ణాపత్రికకు నిజంగావుండి కాదు. ఇపుడు బోసును తిట్టడానికి, కాంగ్రెస్‌లో జరిగిన అల్లరి విషయమై రెచ్చి జవ్హార్‌లాల్ అన్నమాటలు ఉపయోగించుకోడానికి మాత్రమే. ఫాసిజంపై యీఏవగింపు కృష్ణాపత్రిక పాఠకులు అపత్రిక ముస్సోలినీని పొగడుట, ఫాసిస్టుపార్టీ ప్రమాణపత్రాన్ని కొనియాడుట, ఒక సంపాదకీయంలో జపాన్ చైనాను ఆక్రమించుటను సమర్ధించుటలను మరచిపుందరు. 'ముటార్నరి ముస్సోలినీ' అని బిరుదు అందులకై సంపాదించినదే కదా!

ఇక నిజమేమో చర్చింతునాము. బోసు తన గ్రంథంలో తాను "ఫాసిస్టు"నని చెప్పుకోలేదు. ఇదిపచ్చి అబద్ధం.ఇక చైనాకు కాంగ్రెస్ ఆంబ్యులెన్సును సుభాష్ హయాంలోనే పంపారనే సంగతి మరువరాదు. అటులచేయుట జపానుకు సంతోషమని ఏ బుద్ధిమంతుడైనా అనగలడా? స్పెయిన్ విద్రోహ ప్రభుత్వాన్ని బ్రిటన్ గుర్తించినపుడు సుభాష్‌బాబు ఛాంబర్లేనుకు అసమ్మతి తెలిపాడు. అందుకై మద్రాసు కాంగ్రెసు విద్యామంత్రి వార్కీగార్కి ఎంతకోపం వచ్చిందీ పత్రికలు చదివేవారందరూ ఎరిగిందే! అట్టిమెడ స్పెయిన్ విద్రోహులకు తోడ్పడే ముస్సోలినీకి బోసు ఎలా హితుడౌతాడో కృష్ణా పత్రిక కొంచమైనా ఆలోచించవద్దా? ఐనా దూషణే ప్రధానమైనపుడు ఆలోచన ఎందుకులెండి!

త్రిపురీనుండి ఆంధ్రరాష్ట్రి కాంగ్రెస్ సంఘ కార్యదర్శిగారుగాంధీయులైన తమ అనుచరులను పిలిపించుకోడానికి 60 టెలిగ్రాములు యిచ్చాడనీ, ఎన్నో టెలిగ్రామ్ మనియార్డరులు పంపాడనీ రూఢిమైన వార్త లున్నాయి. వీనిపై సోషలిస్టులు స్కాండలైజు చేయడం నీచత్వం అనుకొని ఊరుకొన్నారు. అది ఎవరి సొమ్మో, రాష్ట్రికాంగ్రెసుదేమో అను అన్వేషణే మాకక్కరలేదు. ఎన్నికలలో మేము బోసును బలపరచడానికి రాజకీయకారణాలు చూపాము.అంతేగాని పట్టాభిగారు జైల్లోనే ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ డాక్టరుగా డబ్బు సంపాదించాడని-ఆ సంగతి తెలిసినా-అదొక కారణంగా అతడు అధ్యక్షతకు పనికిరాడని చూపామా? నిత్యం సత్య అహింసల జపంచేసే గాంధీయులకంటే భౌతికవాదులమైన సోషలిస్టులం, ఇందులో ఎంతో ఉన్నతస్థాయిలో వుండగలిగామని గర్వించాలి. త్రిపురీలోనైతం గాంధీయ హేమాహేమీలు బోసు జ్వరమే నమ్మదగినది కాదనీ, 'రాజకీయ జ్వరమని' నీచపు ప్రచారం గావించారు. అందుచే బొంబాయి ఆరోగ్యశాఖా మంత్రి డాక్టరు గిల్డర్, జబ్బల్‌పూర్ సివిల్ సర్జన్‌లచే పరీక్ష చేయించవలసి వచ్చింది. వాడు అపాయకరమైన స్థితిలోవున్నాడని చెప్పిన తరువాతనే యీ పెద్దల నోళ్లు మూతపడ్డాయి.

కృష్ణాపత్రిక సంపాదకులకు ఒక మనవి మీవిమర్శను ఎంతఘాటుగా వున్నా రాజకీయంగా వుండనివ్వండి ఆహ్వానిస్తాను. కాని వ్యక్తిగత విషయాల్లోకి దిగి 'రొచ్చు చిమ్ముకోడం' సబబుకాదు. ఆధారంవున్న విమర్శను చేయండి సంతసిస్తాను. లేని సంగతులు కల్పించి, దొసగులు ఊహించి, ఫాసిస్టులనీ, ఇటలీ, జపాను, జర్మనీ డబ్బులని ఆధారరహితంగా తిట్టి ప్రజలలో, కాంగ్రెసు మహాసభ అధ్యక్షునిపై చులకన భావాలు వ్యాపింప జేయడానికి ప్రయత్నించడం గాంధీతత్వ భాష్యకారులగు మీకు మెచ్చదగిన పనికాదు. కాంగ్రెసు వాదులమైన మనమంతా అధ్యక్షునికి సామాన్య మర్యాద అయినా చేయాలి. మనదూషణలు కాంగ్రెస్ గౌరవాన్నే కలుషితం చెయరాదు!

కాశీపట్టణంపై రైతు నాయకుల విజ్ఞప్తి

అఖిల భారత రైతు సంఘాధ్యక్షులయిన శ్రీ సహజానంద సరస్వతి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ రంగా, సంయుక్త కార్యదర్శులు ఇందూలాల్ యాగ్నిక్, బంకిం ముఖర్జీ, బి.పి.యల్. బేడీ, అవదేశ్వర ప్రసాద్ సిన్హా గార్లు కాశీపట్నం రైతుల సత్యాగ్రహాన్ని గురించి 12—3—39 వ తేదీని త్రిపురీ నుంచి యీ క్రింది ప్రకటన గావించుచున్నారు:


"కాశీపట్నం రైతులు తమ భూములపై పూర్వంనుంచీ వంశపారంపర్యంగా అనుభవిస్తూన్న హక్కులను రక్షించుకోవడానికి జరిపిన సత్యాగ్రహ పోరాట సందర్భములో మదరాసు ప్రభుత్వం దారవలంబించిన నిర్బంధ విధానాన్ని మేము ఖండిస్తున్నాము. కాశీపట్నం జమీందారుచే అనేక శతాబ్దాల నుంచి స్వయంగా గాని, ఆయన ఏజంట్లవల్ల గాని, సేద్యం చేయబడనట్టియు, చేపలు పట్టుట మొదలయిన హక్కులు రైతులచే అనాదిసిద్ధంగా అనుభవించబడుతూన్నట్టియు, భూమిని జమీందారు స్వాధీన పరచుకోవడానికి చేస్తూన్న ప్రయత్నాలను అరికట్టడానికి రైతులు శాంతియుతంగా సత్యాగ్రహం ప్రారంభిస్తే వారిపై పోలీసులు క్రూరంగా లాఠీచార్జీ చేయుట, సుమారు 80 మంది స్త్రీ-పురుష సత్యాగ్రహులను ఎరస్టుచేయుట మొదలయిన దారుణ చర్యలను గురించి మాకు వర్తమానము వచ్చింది. కొన్ని తంతి వార్తలు, ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘాధ్యక్షునివంటి బాధ్యతగల నాయకుల నుండి జాబులు, మాకుచేరాయి. గత 6 మాసాల నుంచీ తగాదాలో ఉన్న యీ సమస్యను పరిష్కరించి రైతుల హక్కుల్ని కాపాడటానికి మదరాసు ప్రభుత్వం ఇదివరకే కలుగజేసుకొని యుండవలసింది. దానికి బదులు విచ్చలవిడిగా లాఠీచార్జీలు జరగడం, ఆ లాఠీచార్జీలకు స్త్రీలు సహితం గురికావడం, 37 గురు స్త్రీలను, ఇంకా ఎంతోమంది పురుషులను ఎరస్టు చేయడం మొదలయిన నిర్బంధ విధానపు వార్తలు మేము విన్నప్పుడు ఎంతో ఆందోళన పడ్డాము.

కాశీపట్నం జమీందారుయొక్క, స్థానిక ప్రభుత్వోద్యోగులయొక్క నిరంకుశ విధానాన్ని ఆపుచేయవలసినదని రైతులు మద్రాసు ప్రభుత్వానికి ఎన్ని విన్నపాలు పంపించుకొన్నప్పటికీ, తటస్థంగా ఊరుకొని, ఇప్పుడు జమీందారుకి ప్రోత్సాహమిచ్చి, అతడు భూమిని స్వాధీనపరచుకొనే ప్రయత్నంలో ఎందుకు సహాయపడవలసి వచ్చిందని మేం ప్రశ్నిస్తున్నాం. కాంగ్రెసు ప్రభుత్వం రైతులయెడ నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని మరచిపోయిందని మేము భావించారేమో తెలియకుండా ఉంది. అపవిత్రమైన యీ నిర్బంధ విధానాన్ని యిప్పటికైనా కట్టిపెట్టి, రైతులు అనాదిగా అనుభవిస్తూన్న హక్కుల్ని కాపాడవలసిందని తక్షణమే స్థానిక ప్రభుత్వోద్యోగులకు ఉత్తరువులు జారీచేసి, ఎరస్టు చేయబడినట్టిగాని, శిక్ష విధించబడినట్టి గాని, వ్యక్తుల నందరినీ విడుదల చేయవలసిందని మేం మద్రాసు ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం.

"రైతులు క్రమ శిక్షణతోను, శాంతియుతంగాను, తమ ధైర్యమైన పోరాటాన్ని కొనసాగిస్తూన్నందుకు మేము సంతోషిస్తున్నాం. ముఖ్యంగా, రైతు స్త్రీలు తమ హక్కుల్ని కాపాడుకోవడానికి, పోలీసు దౌర్జన్యాన్ని ఎదుర్కొడానికి, స్థిరనిశ్చయం చేసుకొన్నందుకు వారిని అభినందిస్తున్నాం. బాధపడే రైతులు ధైర్యంగా తమ హక్కుల్ని రక్షించుకొంటూన్నందుకు వారికి మా అభినందనాలు. ఆంధ్రరాష్ట్ర మందలి రైతులు, కాంగ్రెసువాదులు, వారి సహాయార్థం ముందుకి దుముకవలసిందని కోరుతున్నాం."

నిర్మాణ సమస్యలు

ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పోరాటము సాగించడానికి దేశములో సన్నాహాలు జరుగుతున్న సమయములో నిర్మాణావశ్యకతనుగూర్చి ప్రత్యేకముగా తెలుపనవసరములేదు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారిచే ప్రకటించబడిన ఈ పుస్తకము, స్వాతంత్ర్య యోధులకు ఈ నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి అనేక సూచనల నిస్తుంది. వెల అణా. వెంటనే నవశక్తి ఆఫీసుకు వ్రాయండి



Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE